www.andhrajyothy.com పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 324

సోమవారం | 10-3-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి ఏకాదశి ఉ.7.45 తదుపరి ద్వాదశి, నక్షత్రం: పుష్యమి రా.12.51 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.8.13-9.53, అమృతఘడియలు: సా.6.12-7.51, దుర్ముహూర్తం: మ.12.49-1.36; మ.3.11-3.58, రాహుకాలం ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.30, సూర్యాస్తమయం: 6.20

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కప్పం కట్టాల్సిందే!

పనుల్లో 'వాటా' కావాలి.. కాదంటే ఒక్క లారీనీ రానిచ్చేది లేదు

రామాయపట్నం నిర్మాణ సంస్థకు
ఎమ్మెల్యే ఇంటూరి హుకుం
సంస్థ ససేమిరా అనడంతో విశ్వరూపం
పోర్టు పనుల కోసం కంకర, ఇసుక
తీసుకెళ్తున్న లారీల అడ్డగింత
తప్పుడు కేసులు పెట్టించి వేధింపులు
ట్రిప్పునకు వెయ్యి ఇవ్వాలనీ డిమాండ్
సీఎంవోకు చేరిన ఎమ్మెల్యే వ్యవహారం
ఆదేశాలిచ్చాకా ఆగని ఎమ్మెల్యే దందా!

అధికార పార్టీ ఎమ్మెల్యే అడ్డగోలుతనం!



రామాయపట్నం పోర్టుకు సంబంధించి జరుగుతున్న బ్రేక్‌వాటర్ టాప్ లేయరు పనులు

రాష్ట్రానికి కొత్త పెట్టుబడిదారులను తీసుకొచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకంతో కుదేలైన రాష్ట్రాన్ని భారీ పెట్టుబడులతో తిరిగి గాడిలో పెట్టేందుకు అహరహం పాటుపడుతోంది. కానీ ప్రభుత్వ సంకల్పాన్ని భగ్నం చేసే చర్యలకు ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే పాల్పడితే ఏమనాలి? ఏకంగా కప్పం కడితేనే కుదురుతుందంటూ నిర్మాణ పనులకు అడ్డం పడితే దానిని బరితెగింపు కాక మరేమనాలి? రామాయపట్నంలో ప్రస్తుతం జరుగుతున్న దందా ఇదే!

(ఒంగోలు - ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నడిచిన దందా.. ఇప్పుడు రామాయపట్నం పోర్టు నిర్మాణ పనుల్లోనూ అదే తరహా దందాకు తెర లేచింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు(టీడీపీ) స్వయంగా ఈ దందాకు తెర తీసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం అసలేం జరిగిందంటే.. పోర్టు నిర్మాణ పనుల్లో తనకు వాటా ఇవ్వాలని ఇంటూరి తొలుత డిమాండ్ చేశారు. కానీ ఆయన



ఇంటూరి నాగేశ్వరరావు

డిమాండ్ చేసిన రీతిలో వాటా ఇచ్చేందుకు, ఇతరత్రా కప్పం కట్టేందుకు కాంట్రాక్టు సంస్థ ససేమిరా అంది. దీంతో ఇంటూరి తన ప్రతాపం చూపడం మొదలెట్టారు. భయపెట్టి అయినా సరే కాంట్రాక్టు సంస్థను దారికి తెచ్చుకునే లక్ష్యంతో ఏకంగా 'దారి' కాశారు. నిర్మాణ పనుల కోసం కంకర, ఇసుక తెస్తున్న లారీలకు అడ్డం పడ్డారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ వెళ్లకుండా

మిగతా 2వ పేజీలో...

తీన్‌మార్.. సీటీమార్



టీమిండియాదే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ

ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఉత్కంఠ విజయం
మూడోసారి ట్రోఫీని ముద్దాడిన భారత జట్టు
అర్ధశతకంతో అదరగొట్టిన హిట్ మ్యాన్
రాణించిన శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్
అజేయంగా టోర్నీని ముగించిన భారత



రోహిత్ శర్మ (76)

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ క్రీజులో ఉన్నంత సేపూ విజయంపై ధీమా! గిల్, కోహ్లి వరుసగా పెవిలియన్ చేరగానే కాస్త నిరాశ! రన్ రేటు తగ్గుతున్నా రోహిత్ ఉన్నాడనే భరోసా! కెప్టెన్ కూడా ఔట్ అవ్వగానే నిర్వేదం! హార్దిక్ పాండ్యా సిక్సు, ఫోరూ కొట్టగానే ఆనందం! ఇలా.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన టైటిల్ పోరులో మనోళ్లే చాంపియన్స్! పుష్కర కాలం తర్వాత భారత్ మరోసారి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ(సీటీ)ని ముద్దాడింది! మూడోసారి (2003, 2013, 2025) చాంపియన్‌గా నిలిచింది! తొలుత బంతిని అందుకున్న వెంటనే కుల్దీప్ యాదవ్ న్యూజిలాండ్ వెన్ను విరిచేశాడు. కివీస్ హీరోలు రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. భారత బౌలర్లు కివీస్‌ను 251 పరుగులకే పరిమితం చేశారు. ఆ తర్వాత రోహిత్ శర్మ (76), శ్రేయాస్ అయ్యర్ (48), కేఎల్ రాహుల్ (34) సహకారంతో భారత్ విజయ తీరాలను చేరుకుంది! 2019 ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయానికి కూడా బదులు తీర్చుకుంది. టీమంతా కలిసికట్టుగా రాణించి అందించిన విజయమిది! టాస్‌లు అన్నీ ఓడినా.. మ్యాచ్‌లు అన్నీ గెలవడం ఈ టోర్నీలో మరో విశేషం!!

9

బీసీలకు పెద్దపీట!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ

ఇద్దరు బీసీ..
ఒక ఎస్సీకి అవకాశం

బీటీ నాయుడు, బీద రవిచంద్ర,
కావలి గ్రీష్మలకు టికెట్లు ఖరారు
ఉత్తరాంధ్ర, కోస్తా, సీమలకు సమతూకం
పాటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



బీటీ నాయుడు
బీద రవిచంద్ర
కావలి గ్రీష్మ

ఇంకా ఖరారు కాని బీజేపీ అభ్యర్థి

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాలకు పెద్దపీట.. ప్రాంతాల నడుమ సమతూకం.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారులో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పాటించిన ప్రధాన కొలమానాలు ఇవే!. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ప్రకటించిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించింది. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. వీరిలో

మిగతా 11వ పేజీలో...



గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్

అభినవ అన్నమయ్య గరిమెళ్ల

అస్తమయం

12

టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణ ప్రసాద్ తుదిశ్వాస
600కు పైగా అన్నమయ్య కీర్తనలు స్వరపరిచి వెలుగులోకి
తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియకు ఆద్యుడిగా ఘనత
ఇద్దరు కుమారులూ అమెరికాలో..
ఎల్లుండి అంత్యక్రియలు

'ఆస్పత్రి' సాకు ఉత్తిదే

చెన్నై అపోలోకు వెళ్లని బోరుగడ్డ
కూతుళ్లతో వెళ్లిన తల్లి పద్మావతి
ఆరా తీసిన అనంతపురం పోలీసులు
సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు
నేడో, రేపో హైకోర్టులో కౌంటర్
తల్లికి చికిత్స చేయించాలంటూ
హైకోర్టులో బెయిల్ తెచ్చుకున్న అనిల్



11

ఎన్టీఆర్ వైద్య ట్రస్ట్.. అస్తవ్యస్తం!

సేవ కంటే రాజకీయాలకే అడ్డా.. గాడి తప్పిన పాలన.. లక్ష్యం పక్కదారి
కీలక పోస్టుల్లో అర్హత లేని అధికారులు.. ఇతర శాఖల వారికి బాధ్యతలు
అందినకాడికి దోచేయడమే పని.. ఆస్పత్రులపై కక్షసాధింపు చర్యలు
మంత్రి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

11

అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు!

2

వాణిజ్య సంబంధాల బలోపేతానికే ఆ నిర్ణయం.. అధికార వర్గాల వెల్లడి
గతంలోనూ ఇలాగే కొన్ని దేశాల ఉత్పత్తులపై దిగుమతి సుంకాల తగ్గింపు
వ్యవసాయ ఉత్పత్తులు మినహా అన్నిటిపైనా తగ్గింపు కోరిన అమెరికా?

ఒడిశా ఏకాకులానాసి దీవిలో ఆలివ్ రిడ్లీ తాబేలు గుడ్లు



33ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి

కేంద్రపడ, మార్చి 9: ఒడిశాలోని గహిర్మాత సముద్ర జీవుల పరిరక్షణ కేంద్రం పరిధిలో ఉన్న ఏకాకులానాసి దీవిలో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల దాదాపు 33 ఏళ్ల తర్వాత గుడ్లు పెట్టాయి. గడిచిన రెండు రోజుల్లో ఈ దీవికి 1.7లక్షల ఆలివ్ రిడ్లీ తాబేళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతీ ఏటా ఒడిశా తీరంలో లక్షల సంఖ్యలో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు తరలివచ్చి గుడ్లుపెడతాయి. దీన్నే నెస్టింగ్ అంటారు. తర్వాత 40-50రోజులకు పిల్లలు బయటకు వస్తాయి. అయితే, ఏకాకులానాసి దీవి సముద్రపు కోతకు గురవుతున్న నేపథ్యంలో.. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అక్కడికి రావడం లేదు. చివరిసారి 1992లో 3లక్షల తాబేళ్లు ఇక్కడ గుడ్లు పెట్టినట్లు అధికారులు తెలిపారు. కాగా, అంతరించిపోతున్న తాబేలు జాతుల్లో ఆలివ్ రిడ్లీ తాబేలు ఉంది.

స్వయంగా చేతి రాతతో 100 పేజీల బడ్జెట్

» అసెంబ్లీకి సమర్పించిన ఛత్తీస్‌గఢ్ ఆర్థికమంత్రి





రాయ్‌పూర్, మార్చి 9: ఏఐ చాట్‌బోట్‌తో ఏ పనినైనా చిటికెలో పూర్తిచేస్తున్న ఈ రోజుల్లో ఛత్తీస్‌గడ్ ఆర్థికమంత్రి ఓపీ చౌధరి తన స్వహస్తాలతో 100 పేజీల బడ్జెట్ ప్రతిని రాసి అసెంబ్లీకి సమర్పించారు. ఐఏఎస్ అధికారి అయిన చౌధరి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో 2018లో తన కలెక్టర్ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో బీజేపీ తరఫున రాయ్‌గఢ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 100 పేజీలున్న ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ ప్రతిని తన స్వహస్తాలతో హిందీలో రూపొందించిన ఆయన, మార్చి 4న అసెంబ్లీలో సమర్పించారు. ఈ క్రమంలో బడ్జెట్ సమర్పణకు పది రోజుల ముందు నుంచి తాను రోజుకు కేవలం 2 గంటలు మాత్రమే నిద్రించానని తెలిపారు. కాగా, ఓ ఆర్థికమంత్రి స్వయంగా తన చేతితో రాసిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం దేశచరిత్రలో బహుశా ఇదే మొదటిసారి.



సిరియా ఘర్షణల్లో 1113 మంది మృతి

బీరూట్, మార్చి 9: ప్రతీకార హత్యలతో సిరియా దేశం అల్లకల్లోలంగా మారింది. రెండు రోజుల పాటు జరిగిన ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య 1,113కి పెరిగింది. పదవీచ్యుత అధ్యక్షుడు బషర్ అస్సాద్ మద్దతుదార్లు, ప్రభుత్వ భద్రతా దళాల మధ్య గురువారం కాల్పులు ఆరంభమయి శుక్రవారం వరకు కొనసాగాయి. శనివారం కాల్పులు ఆగినప్పటికీ భయానక వాతావరణం మాత్రం తొలగిపోలేదు. బ్రిటన్‌లో ఉన్న సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ అనే సంస్థ అందజేసిన వివరాల ప్రకారం ఈ ఘర్షణల్లో 830 మంది పౌరులు మరణించారు. ఘర్షణల్లో వందలాది మంది భద్రతా సిబ్బంది, మిలిటెంట్లు చనిపోయారు. అస్సాద్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మైనార్టీలైన అలవైటీలు తమను ఏళ్లతరబడి వేధించినట్టు సున్నీ ముస్లింలు అనుమానిస్తున్నారు. గురువారం సున్నీ ముస్లిం వర్గానికి చెందిన గన్‌మేన్ ఒకరు అలవైటీ తెగ వ్యక్తిని కాల్చి చంపడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఇవన్నీ వ్యక్తిగతదాడులని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రోడ్లు, ఇళ్ల డాబాలపై ఎక్కడికక్కడే శవాలు కనిపిస్తున్నాయి. లటకియా పట్టణానికి విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో తాగునీటి కొరత ఏర్పడింది. అస్సాద్ ప్రభుత్వం చేసిన తప్పులకు తమపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని అలవైటీలు వాపోతున్నారు.

మా స్టార్‌లింక్ సేవలు నిలిపేస్తే.. ఉక్రెయిన్ సేనలు కుప్పకూలుతాయి: మస్క్

వాషింగ్టన్, మార్చి 9: అమెరికా వ్యాపారవేత్త ఎలాన్ మస్క్.. ఉక్రెయిన్‌పై మరోసారి మండిపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. రష్యాతో యుద్ధం శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారంటూ ఇటీవల విమర్శించిన మస్క్.. తాజాగా తమ స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే యుద్ధ క్షేత్రంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. ఉక్రెయిన్ ఓటమి అనివార్యమైనప్పటికీ ఏళ్ల తరబడి జరుగుతున్న ఈ మారణకాండ విసుగు తెప్పించిందని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 2022 ఫిబ్రవరిలో రష్యా దాడితో ఉక్రెయిన్ కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో ప్రస్తుతం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ అక్కడ సేవలందిస్తోంది.

అమెరికాలో ఆలయంపై భారత వ్యతిరేక రాతలు

న్యూయార్క్/న్యూఢిల్లీ, మార్చి 9: అమెరికాలో మరోసారి హిందూ ఆలయంపై దాడి జరిగింది. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్ బెర్నార్డినో కౌంటీ చినో హిల్స్ పట్టణంలోని బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బాప్స్) శ్రీ స్వామినారాయణ్ మందిరం గోడలపై గుర్తుతెలియని దుండగులు భారత వ్యతిరేక రాతలు (గ్రాఫిటీ) రాశారు. ఆలయ గోడలపై 'హిందూస్ గో బ్యాక్' అనే నినాదాలు రాశారని మీడియా నివేదికలు వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని అతిపెద్ద ఆలయంపై శనివారం ఈ దాడి జరిగిందని, దీనిపై దర్యాప్తు చేయాలని ఎఫ్‌బీఐ, దాని డైరెక్టర్ కాశ్ పటేల్‌ను హిందూ అమెరికన్ ఫౌండేషన్ అనే గ్రూపు డిమాండ్ చేసింది. తాజా ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ డిమాండ్ చేశారు.

న్యూయార్క్‌లో కార్చిచ్చు



కార్చిచ్చుతో కమ్మేసిన పొగ

న్యూయార్క్, మార్చి 9: న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌ను కార్చిచ్చు పొగ కమ్మేసింది. దీంతో ఆ ప్రాంతంలోని మిలిటరీ స్థావరాన్ని ఖాళీ చేయడంతోపాటు ప్రధాన రహదారిని మూసివేశారు. కార్చిచ్చు వేగంగా విస్తరిస్తుండటంతో న్యూయార్క్ గవర్నర్ కేతీ హోచుల్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. న్యూయార్క్ నగరం తూర్పుభాగంలోని పెన్ బారన్స్ ప్రాంతాన్ని అగ్నికీలలు చుట్టుముడుతున్నాయి. కార్చిచ్చుకు కారణమైన 40 ఏళ్ల మహిళ అలగ్జాండ్రా బియాలోసోను అధికారులు అరెస్టు చేశారు. దక్షిణ కరోలినా మైర్టిల్ బీచ్ ప్రాంతంలోని ఆమె ఇంటి వెనుక నుంచే తొలుత మంటలు వ్యాపించాయని, అవి క్రమంగా 2,059 ఎకరాలకు విస్తరించాయని అధికారులు తెలిపారు.

నేటి నుంచే పార్లమెంటు

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా

» మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు

» నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన



న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత గొడవ చేసినా సాధ్యమైనంత త్వరలో వక్ఫ్ బిల్లును చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇండియా కూటమి పార్టీలన్నీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు వ్యూహ రచన చేస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో రైల్వే సవరణ బిల్లు, సహకార సంఘాల్లో పనిచేసే వ్యక్తులకు తగిన శిక్షణను అందించేందుకు త్రిభువన్ సహకారీ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రం ద్వారా హిందీని దక్షిణాదిపై రుద్దడం, భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడంపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టరాదని డీఎంకే సహా పలు పార్టీలు డిమాండ్ చేయనున్నాయి.

ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు అస్వస్థత

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అస్వస్థతకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఆయనకు ఛాతీ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తలించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం ప్రధాని మోదీ ఎయిమ్స్‌కు వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. ఆ తర్వాత ధన్‌ఖడ్ ఆరోగ్యంగా ఉండాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సైతం ఆస్పత్రికి వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు.

ఏకధాటిగా పనిచేస్తే సామర్థ్యం తగ్గుతుంది

శరీరం చెప్పినట్లు విని విశ్రాంతి తీసుకోవాలి

డబ్ల్యూహెచ్‌వో మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య

న్యూఢిల్లీ, మార్చి9: ఏకధాటిగా పనిచేయడం వల్ల సామర్థ్యం తగ్గుతుందని, శరీరం చెప్పింది వింటూ విశ్రాంతి ఎప్పుడు అవసరమో తెలుసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ సూచించారు. పనిచేయడానికి మానసిక విశ్రాంతి అవసరమన్నారు. ఎన్ని గంటలు పనిచేశామనేది కాదని, నాణ్యత ముఖ్యమని స్వామినాథన్ తేల్చి చెప్పారు. పని గంటలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ ఆమె వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని ఈ ఏడాది ఆరంభంలో ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ అన్నారు.

47.2 లక్షల మందికి ఆయుష్మాన్ వేవందన కార్డులు

హైదరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ వేవందన కింద ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు 47.2 లక్షల మంది వయోవృద్ధులు నమోదు చేసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది అక్టోబరు 29న కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్ల పైబడిన వారు తమ సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేసుకోవచ్చని, ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని వెల్లడించింది. ఈ ఏడాది జనవరి వరకు 1.10 లక్షల మంది వృద్ధులు ఈ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని రూ.202.96 కోట్ల విలువైన వైద్య సేవలు పొందినట్లు పేర్కొంది.

అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు నిజమే!

» కానీ అది ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి కాదు

» వాణిజ్య సంబంధాల బలోపేతానికే ఆ నిర్ణయం.. అధికార వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 9: అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించేందుకు భారత్ నిర్ణయించినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అయితే.. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకునేందుకు తీసుకుంటున్న విస్తృత చర్యలో భాగంగానే భారత్ ఈ నిర్ణయం తీసుకుంది తప్ప ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి కాదని ఆ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, నార్వే దేశాల ఉత్పత్తులపై సుంకాలను ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల మేరకు తగ్గించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్, యూకేతో కూడా ఇదేరీతిలో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు చర్చలు జరుగుతున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు నిర్ణయాన్ని కూడా అదే కోవలో చూడాలని చెబుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వ్యవసాయ ఉత్పత్తులపై తప్ప మిగతా అన్ని ఉత్పత్తులపైనా సుంకాలను ఉపసంహరించుకోవాల్సిందిగా భారత్‌ను అమెరికా కోరింది. ఒకవేళ ఇండియా అందుకు అంగీకరిస్తే.. ఎలాంటి ప్రతిఫలమూ లేకుండా భారత్ తనకున్న వాణిజ్య రక్షణలన్నింటినీ వదులుకున్నట్టేననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాల విధింపు తథ్యమని ట్రంప్ ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అమెరికాకు చేరుకుని ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో చర్చలు జరిపి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు.. పలు వ్యాపార సంస్థలు కూడా సుంకాల ప్రభావం ఎక్కువగా పడకుండా, వాణిజ్యాన్ని కొనసాగించడానికి అమెరికాలోని తమ వ్యాపార భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాయి. 2016-20 నడుమ ట్రంప్ తొలి హయాంలో కూడా ఇరుదేశాల మధ్య పరిమిత వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్చలు జరిగాయిగానీ.. పలు కారణాల వల్ల అవి ఫలించలేదు.

డీలిమిటేషన్, నిర్బంధ హిందీపై కేంద్రాన్ని నిలదీయాలి



» బాధిత రాష్ట్రాల ఎంపీలను కలుపుకొని వెళ్లాలి

» డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, జాతీయ విద్యావిధానంపేరుతో రాష్ట్రంలో హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కేంద్రంతో అమీతుమీకి డీఎంకే సిద్ధమవుతోంది. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాలకపక్షాన్ని నిలదీయాలని ఆ పార్టీ ఎంపీలు నిర్ణయించారు. చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అరివాలయంలో ఆదివారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఆ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల నష్టపోయేదీ తమిళనాడు మాత్రమే కాదని.., ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఒడిస్సా, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాల సంఖ్య బాగా తగ్గే అవకాశాలున్నాయని, ఈ రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశంలో స్టాలిన్ సూచించారు. డీఎంకే అన్య భాషలకు వ్యతిరేకం కాదనే విషయాన్ని పార్లమెంటు ఉభయసభల్లో కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించాలని పేర్కొన్నారు. ఏ భాషను నిర్బంధంగా అమలు చేయకూడదని డీఎంకే దశాబ్దాల తరబడి చెబుతున్న విషయాన్ని అన్ని పార్టీల ఎంపీలకు సులువుగా అర్థమయ్యే పదజాలంతో డీఎంకే ఎంపీలు వివరించాలన్నారు. త్రిభాషా విద్యావిధానం గురించి సభ్యులు ఆచితూచి మాట్లాడాలని, తమ వాదనలను సమర్థవంతంగా వినిపించాలన్నారు. రాష్ట్రంలో నిర్బంధ హిందీని అమలు చేయడానికిగాను...జాతీయ విద్యావిధానాన్ని ఆమోదించకుంటే నిధులు రావని కేంద్రం బెదిరిస్తున్న విషయాన్ని కూడా సభలో ప్రస్తావించాలని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు దిశగా స్టాలిన్ చేపడుతున్న చర్యలను సమర్థిస్తూ ఎంపీలు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. నిర్బంధ హిందీని అమలు చేసి తమిళభాషకు ముప్పు కలిగించడానికి కేంద్రం చేస్తున్న కుట్రను అడ్డుకునేలా, నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించేలా ఉభయ సభల్లో పటిష్టమైన వాదనలను వినిపిస్తామని ఈ విషయంలో పార్టీ ఎంపీలందరూ ఏకతాటిపై నడుస్తామని మరొక తీర్మానం కూడా చేశారు.

కప్పం కట్టాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

చేయడం ద్వారా నిర్మాణ సంస్థను తన దారికి తెచ్చుకోవాలన్నది ఆయన లక్ష్యం. ఎలాగైనా తనకు కప్పం కట్టేలా ఒప్పించడమే ఆయన చర్యల అసలు ఉద్దేశం.

కాదంటే బండికి వెయ్యి...

నిర్మాణ పనుల్లో వాటా డిమాండ్‌తో మొదలైన ఇంటూరి అరాచకం.. ఆ తర్వాత కంకర, ఇసుక తోలకం పనులను పూర్తిగా తనకే అప్పగించాలనే దాకా వెళ్లినట్లు తెలుస్తోంది. కాదంటే ఒక్కో లారీ ట్రిప్పునకు వెయ్యి రూపాయల చొప్పున తనకు చెల్లించాలని బెదిరించినట్లు సమాచారం. అందుకు నిర్మాణ సంస్థ అంగీకరించకపోవడంతో.. ఇద్దరు కానిస్టేబుళ్లను దగ్గర పెట్టుకుని మరీ లారీలను రోడ్డు మీద నిలిపివేయిస్తూ, తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. పోర్టు పనులు ముందుకు సాగకుండా నానా అరాచకం సృష్టిస్తున్నారు.

సీఎంవోకు చేరినా..

ఇంటూరి అరాచకం గురించి పలువురు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే రంగంలోకి దిగిన సీఎంవో అధికారులు పోలీసు ఉన్నతాధికారులకు, జిల్లా పోలీసు అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. పోర్టు పనులకు ఎలాంటి ఆటంకాలు రాకూడదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. అయినా ఎమ్మెల్యే తన దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్న తీరు అధికార పార్టీ వర్గాల్లోనూ, నియోజకవర్గ ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై వివరణ కోరేందుకు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఆదిలోనే ఆటంకాలు!

రామాయపట్నం పోర్టుకు 2018 ప్రాంతంలో అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అక్కడికి సమీపంలోనే పేపరు మిల్లు నిర్మాణానికి అదే సమయంలో శ్రీకారం చుట్టారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం పేపరు మిల్లుకు తిలోదకాలు ఇచ్చి పోర్టు నిర్మాణ పనులను మాత్రమే చేపట్టింది. కొంతమేర పనులు జరిగాయి. ఆ తర్వాత ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఈనెల మొదటి వారంలో నిర్మాణ సంస్థ పోర్టు పనులు పునఃప్రారంభించింది. సముద్రంలో అసంపూర్తిగా ఉన్న బ్రేక్‌వాటర్ పనులు పూర్తిచేయడంపై దృష్టి సారించింది. ఇక్కడ పనులు ప్రారంభం కాగానే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రంగంలోకి దిగారు!

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం

ఉత్పత్తిని పెంచి, నాణ్యమైన దిగుమతి సాధించేలా ఉద్యానశాఖ ప్రణాళికలు

» ఏటా 12% తోటల విస్తీర్ణం పెంపు లక్ష్యం

» నష్టాల నివారణకు సాంకేతికత సాయం

» అనుగుణంగా పలు పథకాలతో కార్యాచరణ

» బడ్జెట్‌లో రూ.1,856.62 కోట్ల కేటాయింపు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండ్ల తోటల రైతులను ప్రోత్సహించి, ఉత్పత్తి పెంచి, నాణ్యమైన దిగుబడి సాధించి, డిమాండ్ మేరకు ఎగుమతులు చేసేలా ఉద్యానశాఖ ప్రణాళికలు అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను వినియోగించుకుని ఉద్యాన రైతులను లాభాల బాటలో నడిపించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. వ్యవసాయ అనుబంధ రంగాలు 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్న సీఎం చంద్రబాబు నిర్దేశంతో వృద్ధి రేటు, జీవీఏలో కీలక పాత్ర పోషించే ఉద్యానశాఖ అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు సమాయత్తం చేశారు. దీంతో 2025-26లో రైతులకు అమలు చేయాల్సిన పథకాలతో ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ప్రణాళికలు రూపొందించారు. అత్యధిక నికర విలువ జోడింపు (జీవీఏ) లభించే 11 రకాల ఉద్యాన పంటలను క్లస్టర్ విధానంలో ప్రోత్సహించాలని ఉద్యానశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏటా 15% వృద్ధి రేటు వచ్చేలా మేలైన ఉద్యాన పంటలు, క్లస్టర్లను ఎంపిక చేసింది. ఏటా 10-12% తోటల విస్తీర్ణం పెంచడం ద్వారా ఉత్పాదకత 5-8% పెంచడం, పంట కోత అనంతర నష్టాలను నివారించేందుకు సాంకేతికతను జోడించి, 3-5% వృద్ధి రేటు పెరిగేలా కార్యాచరణ చేపట్టారు.

బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఇలా..

2025-26లో ఉద్యాన శాఖకు కూటమి ప్రభుత్వం రూ.1,856.62 కోట్లు కేటాయించింది. దీంతో పంట వైవిధ్యం ద్వారా లక్షన్నర ఎకరాలు ఉద్యాన వాణిజ్య పంటల కిందకు తేవడం, సూక్ష్మసేద్యం కిందకు అదనంగా 3.75 లక్షల ఎకరాలు తీసుకురావడం, రూ.1,224.23 కోట్లతో రైతులకు రాయితీపై సూక్ష్మసేద్య పరికరాలు అందించడం, ఉద్యాన పంటల అభివృద్ధికి రూ.278.96 కోట్లు, ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి రూ.330.90 కోట్లు, వెదురు పెంపకం, జీవనోపాధికి రూ.3.12 కోట్లు ఖర్చు చేయనున్నారు.

సూక్ష్మ సేద్యానికి సబ్సిడీతో ఊతం

2024-25లో 85 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అమలుకు 80 వేల మందికి పైగా రైతులకు అనుమతి ఇచ్చారు. 2025-26లో ఆర్‌కేవీవై-పీఎండీసీ కింద రూ.1,224 కోట్లతో లక్షన్నర హెక్టార్లను సూక్ష్మసేద్యం కిందకు తీసుకురావాలని ఉద్యానశాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద 2025-26లో రైతులకు ఇచ్చే డ్రిప్, స్ప్రింక్లర్ల సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీల్లో చిన్న, మధ్యస్థ రైతులకు ఐదెకరాల వరకు 100%, ఇతర చిన్న, మధ్యస్థ రైతులకు 90%, రాయలసీమ, ప్రకాశం జిల్లాల మధ్యస్థ రైతులు, ఐటీడీఏ పరిధిలో 5-10 ఎకరాల ఎస్సీ, ఎస్టీ రైతులకు 90%, కోస్తా జిల్లాల్లో 5-10 ఎకరాల మధ్యస్థ రైతులకు 70%, పెద్ద రైతులకు 50% సబ్సిడీ ఇవ్వనున్నారు. స్ప్రింక్లర్లను అన్ని క్యాటగిరీల రైతులకు 50% సబ్సిడీ ఇవ్వనున్నారు. సబ్సిడీలో 27 నుంచి 33% కేంద్రం, 17 నుంచి 67% రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నాయి.

ఆయిల్‌పామ్ విస్తరణకు ప్రణాళిక

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం 2.27 లక్షల హెక్టార్లు ఉండగా, ఉత్పత్తిలో దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉంది. 2024-25లో 17 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు విస్తరించి, 17 వేల మంది రైతులకు లబ్ధి చేకూర్చారు. 2025-26లో 31,530 హెక్టార్ల లక్ష్యంతో రూ.331 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. కోకో అభివృద్ధికీ ప్రణాళికలు తయారు చేస్తున్నారు. నేషనల్ బ్యాంబూ మిషన్ కింద 2025-26లో రూ.3.12 కోట్లతో వెదురు మొక్కల నర్సరీలు ఏర్పాటు చేసి, వెదురుతో తయారు చేసే వస్తువులతో లబ్ధిదారులకు ఉపాధి చూపనున్నారు. పండ్ల తోటల్లో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయి సందర్శనలు చేపడుతున్నారు.

ఐదేళ్లు దాటినా పక్క తడుపుతుంటే వైద్యులను సంప్రదించాల్సిందే

» కిమ్స్ నెఫ్రో-యూరో సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వయస్సు దాటినా చాలా మంది పిల్లల్లో పక్క తడిపే అలవాటు ఉంటుందని, సిగ్గుపడి బయటకు చెప్పకపోతే పిల్లలు పెద్దయినా ఆ సమస్య కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు వైద్యులను సంప్రదిస్తే పిల్లల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. అలాగే, పిల్లల్లో కిడ్నీ, యూరాలజీ సమస్యల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం నెఫ్రో-యూరో సమ్మిట్ 2025 పేరిట ఓ సదస్సు జరిగింది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకకు చెందిన పీడియాట్రిక్, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలకు చెందిన 250 మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. ఐదేళ్ల వయస్సు దాటిన పిల్లల్లో పక్క తడిపే అలవాటుపై ఈ సదస్సులో వైద్యులు చర్చించారు. ఈ సమస్యను బయటకు చెప్పకుండా వదిలేయడం వల్ల కొందరు పెళ్లి అయ్యే వయస్సులో ఈ సమస్య పరిష్కారం కోసం వైద్యుల వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇక, చిన్న పిల్లల్లో వచ్చే నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచించారు. ఆయా వ్యాధుల లక్షణాలను పిల్లల్లో గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆయా సమస్యలను చాలా వరకు నయం చేయగలమని వైద్యులు తెలిపారు. చిన్నపిల్లల కిడ్నీల్లోనూ రాళ్లు ఏర్పడతాయని, పిల్లలు నొప్పి అని చెప్పినా, మూత్రంలో రక్తం చారికలు కనిపించినా తల్లిదండ్రులు వెంటనే వారిని యూరాలజిస్టులకు చూపించాలని సూచించారు. లేదంటే కిడ్నీలు పాడయ్యే ముప్పు ఉందని హెచ్చరించారు. బరువులో ఒక కిలోకు 2మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ప్రోటీన్ ఉన్నాసరే జాగ్రత్త పడాలన్నారు.

22,850 పైన బుల్లిష్

(మార్చి 10-13 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,633-21,965 పాయింట్ల మధ్యన కదలాడి 428 పాయింట్ల లాభంతో 22,553 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 22,850 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,250

నిరోధ స్థాయిలు: 22,750, 22,850, 22,950 (22,650 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22,350, 22,250, 22,150 (22,450 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	63	విజయవాడ	85
వరంగల్	63	గుంటూరు	80
కరీంనగర్	63	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	63	చిత్తూరు	72
కర్నూలు	63	నెల్లూరు	77
విశాఖపట్నం	84	అనంతపురం	77
గోదావరి	85		

చతికిల పడిన ఐపీఓ మార్కెట్

మార్కెట్ కరెక్షన్‌తో ధమాల్

న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్లో కనిపిస్తున్న దిద్దుబాటు (కరెక్షన్) ప్రభావం ప్రైమరీ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. గత మూడు వారాలుగా ఒక్క ప్రధాన కంపెనీ షేరు కూడా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కాలేదు. గత ఏడాది డిసెంబరులో 16 కంపెనీలు నిధుల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేశాయి. ఈ ఏడాది జనవరి నాటికి వీటి సంఖ్య ఐదుకు, ఫిబ్రవరికి నాలుగుకు పడిపోయాయి. ఇన్వెస్టర్లు ఆదరిస్తారో.. లేదోనని భయంతో అడ్వాన్స్‌డ్ సిస్టెక్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వినీ కార్పొరేషన్ అనే మూడు కంపెనీలు ఏకంగా తమ ఐపీఓలనే పక్కన పెట్టాయి.



వేచి చూసే వైఖరి

గత ఏడాది 91 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి 'బేర్' పట్టుతో మార్కెట్ ట్రెండ్ మారింది. గత రెండు నెలల్లో లిస్టయిన ఐపీఓలూ మదుపరులకు పెద్దగా లాభాలు పంచలేక పోయాయి. అయినా మార్కెట్ కోలుకుంటే రూ.67,000 కోట్ల సమీకరణ కోసం ఐపీఓలు జారీ చేసేందుకు ఇప్పటికే 45 కంపెనీలు సెబీ ఆమోదం పొందాయి. ఇంకో రూ.1.15 లక్షల కోట్ల సమీకరణ కోసం మరో 69 కంపెనీలు సెబీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇందులో 45 కంపెనీలు గత రెండు నెలల్లోనే దరఖాస్తు చేయడం విశేషం. మార్కెట్ కోలుకున్నా ఐపీఓల వాల్యుయేషన్లు సముచితంగా ఉంటే తప్ప మదుపరులు ఆదరించక పోవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఏప్రిల్‌లో ఏథర్ ఎనర్జీ ఐపీఓ

మరో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే నెల (ఏప్రిల్)లో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాల సమాచారం. ఈ ఐపీఓకు నాందిగా 1.73 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటి రూపాయి ముఖ విలువ ఉన్న 24.04 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చేందుకు ఏథర్ ఎనర్జీ బోర్డు ఈ నెల 8న ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓ కూడా రూ.5,000 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం.

టాటా క్యాపిటల్ రూ. 17,000 కోట్ల ఐపీఓ!

టాటా గ్రూప్ నుంచి మరో బాహుబలి ఐపీఓ మార్కెట్‌కు రాబోతోంది. టాటా మోటార్స్ ఫైనాన్స్ కంపెనీని తనలో విలీనం చేసుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించిన వెంటనే ఐపీఓకు వచ్చేందుకు టాటా క్యాపిటల్ సిద్ధమవుతోంది. ఎన్‌సీఎల్‌టీ ఈ నెలాఖరులోగా ఇందుకు అనుమతిస్తుందని భావిస్తున్నారు. ఈ ఐపీఓ రూ.17,000 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

స్టార్టప్స్‌లో వేగుచుక్క 'స్విగ్గీ'

ఆలోచనను వ్యాపారంగా మార్చిన శ్రీహర్ష మాజేటి.. రూ.1,400 కోట్ల ఆస్తులు

ఒక ఆలోచన జీవితాలనే మార్చివేస్తుంది. ఇంకా ఎందరికో దిక్సూచిలా పని చేస్తుంది. ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మాజేటి శ్రీహర్ష ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. 'స్విగ్గీ'తో దేశ ఫుడ్ డెలివరీ బిజినెస్ స్వరూపాన్నే మార్చివేసి రూ.1,400 కోట్ల అధిపతిగా ఎదిగిన తెలుగు బిడ్డ మాజేటి శ్రీహర్ష విశేషాలు.



మాజేటి శ్రీహర్ష, భారత ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ' సహ వ్యవస్థాపకుడు, సీఈఓ. మన దేశ అంకుర సంస్థ(స్టార్టప్)ల్లో స్విగ్గీలా సూపర్ డూపర్ హిట్టయిన స్టార్టప్ మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. ఈ యాప్ మన దేశ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఫుడ్ బిజినెస్ స్వరూప, స్వభావాల్నే మార్చివేసింది. చేతిలో మొబైల్. అందులో స్విగ్గీ యాప్ ఉంటే చాలు. మనకు ఇష్టమైన ఏ రెస్టారెంట్ నుంచైనా పసందైన ఆహారాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి నిమిషాల్లో ఆస్వాదించవచ్చు. మన దేశ ఫుడ్ బిజినెస్ స్వరూపాన్ని ఇంతగా మార్చివేసిన మాజేటి శ్రీహర్ష జీవితం ఎందరో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చక్కటి ప్రేరణ.

చదువు, కుటుంబ నేపథ్యం : విజయవాడలో పుట్టి పెరిగిన శ్రీహర్ష ఉన్నత మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. తల్లి డాక్టర్. తండ్రికి విజయవాడలో చిన్న రెస్టారెంట్ ఉండేది. శ్రీహర్ష ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీకి అదే ప్రేరణ అనుకోవచ్చు. తండ్రి వ్యాపార మెళకువలు, తల్లి క్రమశిక్షణ శ్రీహర్ష ఉన్నతికి పునాదుల్లా పని చేశాయి. ఎంతో మంది ప్రముఖులను తీర్చిదిద్దిన రాజస్థాన్‌లోని పిలానీలో ఉన్న బిట్స్‌లో ఆయన తన ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్‌తోనే ఆగక ఫిజిక్స్‌లోనూ పీజీ పూర్తి చేశారు. అంతటితోనూ ఆగకుండా చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ కోర్సు లెవల్ 2 కూడా పూర్తి చేశారు. తర్వాత కోల్‌కతా ఐఐఎం నుంచి పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. ఈ కోర్సులన్నీ శ్రీహర్షలో దాగి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు సానపట్టాయి.

ఉద్యోగ ప్రయాణం: ఉన్నత విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత శ్రీహర్ష కొద్దికాలం లండన్‌లోని నోమురా ఇంటర్నేషనల్ కంపెనీలో పని చేశారు. కొద్ది కాలానికే ఆ జాబ్ వదిలేసి పోర్చుగల్ నుంచి గ్రీస్ వరకు, టర్కీ నుంచి కజకిస్థాన్ వరకు దాదాపు 3,500 కిలోమీటర్ల సైకిల్ జర్నీ చేసి భిన్న సంస్కృతులను ఆకళింపు చేసుకున్నారు. ఈ అనుభవం మనుషుల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో ఆయనకు ఎంతగానో తోడ్పడింది.

స్విగ్గీ ఏర్పాటు: నోమురాలో జాబ్, యూరప్‌లో చాలా దేశాలు చుట్టి వచ్చాక, ఇంకా ఎన్నాళ్లు ఇక్కడ ఉంటాం. స్వదేశానికి వెళ్లి అక్కడే మన లక్ పరీక్షించుకుందాం అనుకున్నారు. వెంటనే ఇండియా వచ్చేసి బండిల్ పేరుతో ఒక కొరియర్ సర్వీసెస్ అగ్రిగేటర్ కంపెనీ ఏర్పాటు చేశారు. అయితే సరైన టెక్నాలజీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆ వ్యాపారం పెద్దగా కలిసి రాలేదు. దాంతో 2014లో బండిల్ పేరును స్విగ్గీగా మార్చి ఫుడ్ డెలివరీ బిజినెస్ ప్రారంభించారు. ఇందుకోసం నందన్ రెడ్డి అనే మిత్రుడు కూడా శ్రీహర్షతో చేతులు కలిపారు. ఈ యాప్ మన దేశ ఫుడ్ డెలివరీ వ్యాపార స్వరూప, స్వభావాల్ని పూర్తిగా మార్చివేసింది. రాహుల్ జైమిని అనే టెక్నాలజీ నిపుణుడు కూడా వీరికి తోడవడంతో స్విగ్గీ దేశంలోని ప్రతి నగరం, పట్టణానికి విస్తరించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా స్విగ్గీ వాల్యుయేషన్‌ను 1,130 కోట్ల డాలర్లు (సుమారు రూ.96,000 కోట్లు)గా లెక్కగట్టారు. ప్రస్తుతం స్విగ్గీలో శ్రీహర్ష వాటా విలువే సుమారు రూ.1,400 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

మెటల్స్, కమోడిటీస్ షేర్లపై కన్నేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడొచ్చు. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయంగా ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు సూచీలను నడిపించే వీలుంది. సూచీలు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను బట్టి మార్కెట్ మూమెంటమ్ కొనసాగనుంది. నాణ్యమైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం లేకపోలేదు. మెటల్స్, కమోడిటీస్, ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు బుల్లిష్‌గా ఉన్నాయి. ఆటుపోట్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

మజగావ్ డాక్: గత ఏడాది జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కొన్ని నెలలుగా అక్యుములేషన్ కొనసాగుతోంది. కీలకమైన రూ.2,000 స్థాయి వద్ద మరోసారి మద్దతు తీసుకుని పెరుగుతున్నాయి. గత వారం నిఫ్టీతో పోల్చితే 9% మేరకు పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,338 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,320/ 2,300 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,285 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

కొచ్చిన్ షిప్‌యార్డ్: జీవితకాల గరిష్ఠం నుంచి 60 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ ఆరంభమైంది. కీలకమైన రూ.1,200 స్థాయిలో మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.1,335 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,280 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారత్ రసాయన్: ఈ షేరు రూ.14,500 స్థాయి నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు లోనై తర్వాత రూ.10,000 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 6 శాతం లాభంతో రూ.11,140 వద్ద క్లోజయి బేస్ బ్రేకౌట్ చేసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.11,000 వద్ద ప్రవేశించి రూ.11,500/11,600 టార్గె ట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.11,000 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రైట్స్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. దాదాపు 50 శాతం మేర పతనమైంది. అయితే గత వారం వరుసగా నాలుగు సెషన్లు లాభపడింది. గత శుక్రవారం ఈ షేరు రూ.219 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.200 వద్ద పొజిషన్ తీసుకుని రూ.225/240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.200 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా: ఈ ఏడాది ఆరంభం నుంచి 35 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం 'వీ' షేప్ రికవరీ కనిపిస్తోంది. రూ.220 వద్ద మద్దతు తీసుకున్న ఈ షేరు గత వారం 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.239 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.260 స్థాయిలో ప్రవేశించి రూ.310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.245 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: నిరోధం 22,700



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ రికవరీ సాధించి 425 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 22,550 వద్ద నిలకడగా క్లోజయింది. అయితే ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ బలహీనంగానే ఉంది. సుదీర్ఘ బేరిష్ ధోరణి అనంతరం ఏర్పడిన రిలీఫ్ ర్యాలీగానే దీన్ని భావించాలి. అయితే తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు నుంచి మాత్రం బయటపడిందనిపిస్తోంది. అలాగే మిడ్ క్యాప్-100 సూచీ 1,275 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 800 పాయింట్లు లాభపడ్డాయి. గత శుక్రవారం అమెరికా మార్కెట్లో ఏర్పడిన నిలకడతో కూడిన రికవరీ వల్ల మన మార్కెట్ కూడా మరింత రికవరీ బాటలో పయనించవచ్చు. కనిష్ఠ స్థాయిల నుంచి ఆకస్మిక రికవరీ ఏర్పడినందు వల్ల ఈ వారంలో కన్సాలిడేషన్ కూడా ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: స్వల్పకాలిక సానుకూలత కోస స్వల్పకాలిక నిరోధం 22,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 23,000.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. దిగువన ప్రధాన మద్దతు స్థాయిలు 22,200, 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 48,000 వద్ద మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది. ప్రధాన నిరోధం 49,000. ఆ పైన మాత్రమే మరింత సానుకూల ధోరణి ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 48,000 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ ఇప్పటికీ 25 డీఎంఏ 22,700 కన్నా దిగువనే ఉంది. ఈ నిరోధం వద్ద కన్సాలిడేషన్ ఉండవచ్చు. సానుకూలత కోసం అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. మార్కెట్ గత వారం ఓవర్ సోల్డ్ స్థితిని సద్దుబాటు చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,640, 22,700
మద్దతు	22,500, 22,430



తెప్పోత్సవాల్లో భాగంగా పుష్కరిణిలో విహరిస్తున్న సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి

తెప్పపై విహరించిన శ్రీరామచంద్రమూర్తి

తిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం సాయంత్రం శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి తెప్పపై విహరించారు. తొలిరోజు ఆదివారం కావడంతో భక్తులు భారీగా ఈ ఉత్సవంలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించారు.

'శ్రీవాణి' టికెట్ల పేరిట మోసం

» నాలుగు టికెట్లకు రూ.60 వేలు వసూలు

» సాధారణ బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వడంతో భక్తుడి ఫిర్యాదు

తిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి కోటాలో నాలుగు బ్రేక్ దర్శన టికెట్లకు రూ.60 వేలు తీసుకున్నాడు. తీరా రూ.రెండు వేలతో సాధారణ బ్రేక్ దర్శన టికెట్లు ఇప్పించడంతో మోసపోయినట్టు గ్రహించిన భక్తుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేరళకు చెందిన దర్శన్ శ్రీనివాస్ అనే భక్తుడు ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్నారు. తన కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, సులువుగా శ్రీవారిని దర్శించుకునేలా టికెట్లు కావాలంటూ చెన్నైకి చెందిన ఏపీ టూర్ ట్రావెల్స్‌కు చెందిన థామస్‌ను సంప్రదించారు. శ్రీవాణి కోటాలో నాలుగు వీఐపీ బ్రేక్ దర్శనాలు ఏర్పాటు చేస్తామని, దీనికి రూ.60 వేలు ఖర్చవుతుందని థామస్ చెప్పాడు. దీనికి అంగీకరించిన దర్శన్ శ్రీనివాస్.. ఆ మొత్తాన్ని అతనికి పంపారు. మూడ్రోజుల క్రితం తిరుమలకు వచ్చిన దర్శన్ శ్రీనివాస్‌కు సాధారణ వీఐపీ బ్రేక్ టికెట్లను అందజేశారు. అందులో మరో ఇద్దరు పేర్లు కూడా ఉండటాన్ని గుర్తించి ఆయన షాక్‌కు గురయ్యారు. దీంతో మోసపోయామని భావించిన దర్శన్ శ్రీనివాస్ విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి అసలు విషయాన్ని తెలిపాడు. ఓ న్యూస్ చానల్ సిఫారసు లేఖతో బ్రేక్ టికెట్లు పొందినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు నివేదిక సమర్పించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తకు రిమాండ్

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టింగులు పెట్టిన కేసులో అరెస్టయిన చిలకలూరిపేటకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త దొడ్డా రాకేష్ గాంధీకి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. చంద్రబాబు, లోకేశ్, ప్రత్తిపాటి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కేసులో పల్నాడు జిల్లా చిలకలూరిపేట అర్బన్ పోలీసులు రాకేశ్ గాంధీని అరెస్టు చేసి శనివారం చిలకలూరిపేట కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఈ మేరకు తీర్పిచ్చింది.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు.

'బీఈడీ ప్రశ్నపత్రం లీకేజీ' గుట్టు రట్టు!

» పోలీసుల అదుపులో మరో 9 మంది

» వినుకొండ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కూడా..

పెదకాకాని, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం గుట్టురట్టయింది. మొబైల్ నంబర్ ఆధారంగా శుక్రవారం రాత్రి ఒడిశాకు చెందిన ముగ్గురిని పెద్దకాకాని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం మరో 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో వినుకొండలోని వివేకానంద బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సిబ్బంది ధారా స్వర్ణ, ఎస్.రఫీ ఉండగా ఒడిశాకు చెందిన ఏజెంట్లు సంతోష్ సాహూ, విష్ణు పాత్రో తోపాటు విద్యార్థులు సుదాంషు, శేఖర్‌రాణా బాదల్, ప్రధాన్ ప్రియవ్రత గాంధాయ్ ఉన్నారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది, ఏజెంట్లు, విద్యార్థులు సిండికేట్‌గా ఏర్పడి పేపర్ లీకేజ్ తో పాటు పరీక్షల వ్యవస్థలో పలు రకాల అవకతవకలకు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరి పాత్ర ఎంత? ఆర్థిక లావాదేవీలు ఏ మేరకు నడిచాయి! అసలు పాత్రధారులెవరు? సూత్రధారులెవరు? తదితర అంశాలపై ఇప్పటికే పోలీస్ అధికారుల వద్ద కీలక సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు తెరవెనక ఇంకెవరున్నారనే విషయమై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్న 9 మంది కలిసి ఇప్పటికి ఈ సంఖ్య 12కు చేరింది.

అప్పులు మిగిల్చిన బోర్లు!

» ఆత్మహత్యకు యత్నించి కోమాలోకి రైతు

» సోషల్ మీడియాలో చూసి స్పందించిన నారా లోకేశ్

» రైతు ప్రాణాలు కాపాడటానికి మంత్రి భరోసా



హరి

రామకుప్పం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పంట సాగు కోసం తవ్వించిన బోర్లు ఆదుకోకపోవడంతో అప్పులు పాలైన ఓ రైతు ఆత్మహత్యకు యత్నించి కోమాలోకి వెళ్లిపోయాడు. సామాజిక మాధ్యమంలో ఈ విషయం తెలుసుకుని.. ఆ రైతు ప్రాణాలు కాపాడటానికి సాధ్యమైనంత సాయం చేస్తానని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. వివరాలివీ..చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం వెంకటాపురానికి చెందిన హరి తన రెండెకరాల పొలంలో సేద్యం చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం పొలంలో బోరు తవ్వించగా, నీళ్లు పడలేదు. అప్పు చేసి ఆర్నెల్ల క్రితం మరో బోరు తవ్వించగా, తొలుత నీళ్లు వచ్చినా ఆ తర్వాత అడుగంటాయి. సాగు చేసిన పంట ఎండిపోయింది. బోర్లు, పంటలకు పెట్టుబడి కోసం రూ.4-5లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ పరిస్థితుల్లో తీవ్ర మనస్తాపానికి గురై రెండు నెలల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో 15 రోజులు చికిత్స పొంది కోలుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత ఊపిరాడటంలో ఇబ్బంది ఏర్పడగా, తిరుపతిలో శ్వాసకోశ శస్త్రచికిత్స చేయించారు. అబ్జర్వేషన్‌లో ఉన్న తరుణంలో గుండెపోటు వచ్చి కోమాలోకి వెళ్లిపోయాడు. ఇప్పటికే హరి వైద్యం కోసం కుటుంబీకులు.. రూ.7-8లక్షల వరకు అప్పులు చేశారు. గ్రామానికి చెందిన లోకేశ్ అనే యువకుడు హరి పరిస్థితి వివరిస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేస్తూ ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టాడు. దీనికి మంత్రి లోకేశ్ స్పందించారు. తన టీమ్ హరిని ఆదుకునేందుకు కృషి చేస్తుందని, సాధ్యమైన సాయాన్ని అందిస్తుందని ఎక్స్ ద్వారా భరోసా ఇచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి సవిత

» బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ

» మహిళా విభాగం అధ్యక్షురాలిగా సరళాదేవి ప్రమాణం

మంగళగిరి సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యమని భావించిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరిలో మహిళా సదస్సు నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి ఆనాడు ఎన్టీఆర్ తరహాలోనే నేడు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సవిత తెలిపారు. మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వావిలాల సరళాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గురుకులాల కార్యదర్శి మాధవీలత పాల్గొన్నారు.

హౌరా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

» విరిగిన పట్టా గుర్తించి రైలును ఆపిన స్థానికులు

గూడూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. గూడూరు రైల్వేస్టేషన్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో అడివయ్య కాలనీ సమీపాన రైలు పట్టా విరిగిపోయి ఉంది. రైలు ట్రాక్ సమీపంలో నివాసం ఉంటున్న బేల్దారి సునీల్‌తో పాటు సింహాచలం, మరికొందరు ఉదయాన్నే 6.30 గంటల సమయంలో మేకలను మేతకు తీసుకెళుతూ పట్టా విరిగి ఉండడాన్ని గమనించారు. అదే సమయంలో హౌరా నుంచి యశ్వంత్‌పూర్ వెళుతున్న హౌరా ఎక్స్‌ప్రెస్ వస్తున్నట్టు గమనించి, ఎర్రగుడ్డను పట్టాలకు అడ్డంగా కట్టి, బిగ్గరగా కేకలు వేయడంతో డ్రైవర్ ఆపారు. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో అరగంట తర్వాత రైలు బయలుదేరి వెళ్లింది.

మరణిస్తూ.. ముగ్గురికి ప్రాణదానం

» ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో మహిళ బ్రెయిన్ డెడ్

» అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం

» గ్రీన్ చానల్ ద్వారా సికింద్రాబాద్‌కు ఊపిరితిత్తులు తరలింపు




కొపనాతి వరలక్ష్మి

గుంటూరు మెడికల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన మహిళ కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించి ముగ్గురికి ప్రాణదానం చేశారు. బాపట్ల పట్టణం వివేకానంద నగర్ కాలనీకి చెందిన కొపనాతి వరలక్ష్మి(45) మెదడు సంబంధిత వ్యాధితో ఈ నెల ఆరో తేదీ గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో చేరారు. ఈ క్రమంలో ఆదివారం ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించగా అంగీకరించారు. దీంతో ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రికి, కాలేయం, మూత్రపిండాలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు కేటాయించారు. ఆదివారం రాత్రి పోలీసుల సహకారంతో గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి ఊపిరితిత్తులను గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు, అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు పంపారు.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కె.కామేశ్వరరావు

అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా కె.కామేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. 13 ఉమ్మడి జిల్లాల అధికారులు ఎన్నికల్లో ఓటు వేశారు. అధ్యక్షుడు మినహా మిగిలిన కార్యవర్గాన్ని ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రభాకర్‌రావు, కోశాధికారిగా సి.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బీవీ మురళీధర్, వి.వైకుంఠరావు, ఎం.యశోధరదేవి, ఈ.నరసానాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా సీహెచ్ఎస్ఎల్‌పీ కుమార్, ఎ.సతీష్, పోలూరి రాధాకష్ణమూర్తి, సి.నరేష్‌బాబు తదితరులు ఎన్నికయ్యారు.

ఎస్ఆర్ఎం-కార్నెజీ మెలన్ మధ్య ఒప్పందం




ఎస్ఆర్ఎం-కార్నెజీ

మంగళగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి గాంచిన కార్నెజీ మెలన్ యూనివర్సిటీ (యూఎస్ఏ), మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మధ్య విజ్ఞానాత్మక విద్యాబోధన, సంయుక్త పరిశోధనలతో కూడిన అవగాహనా ఒప్పందం కుదిరింది. కార్నెజీ మెలన్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌కు విశ్వవ్యాప్తంగా కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ పరిశోధనల్లో మంచి పేరుంది. అలాంటి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ సహకారం అవసరమని భావించిన ఎస్ఆర్ఎం యాజమాన్యం విద్యా బోధన, పరిశోధనా రంగాల్లో సమగ్ర అవగాహన కుదుర్చుకుంది. దీనివలన కార్నెజీ మెలన్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీ, పరిశోధకులతో కలిసి నేరుగా పనిచేసే అవకాశం ఎస్ఆర్ఎంకు లభిస్తుంది. ఏపీ ఎస్ఆర్ఎంలో పరిశోధనా సామర్థ్యాలను మరింత మెరుగు పరుచుకోవడానికి ఈ అవగాహన దోహదపడుతుందని ఎస్ఆర్ఎం అధ్యక్షుడు డాక్టర్ పి.సత్యనారాయణన్ పేర్కొన్నారు.

సహకార బ్యాంకుల సేవలు స్ఫూర్తిదాయకం: రామకృష్ణ

అమరావతి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం, రైతాంగం బలోపేతమే లక్ష్యంగా విశేష సేవలు అందిస్తున్న సహకార రంగ బ్యాంకుల సేవలు స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏప్రిల్ 13, 14 తేదీల్లో జరగబోయే ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వజ్రోత్సవాల లోగో, పోస్టర్‌ను ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఓవైపు వ్యవసాయ రంగానికి సేవలు అందిస్తూనే మరోవైపు ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం 60ఏళ్లుగా పనిచేయడం గర్వించాల్సిన విషయమన్నారు.

దిగంబర కవిత్వంపై గిన్స్‌బర్గ్ ప్రభావం



1960 నుంచి 1975 మధ్య కాలంలో ప్రపంచ సాహిత్యంలో దాదాపు పది తిరుగుబాటు ఉద్యమాలు సంభవించటానికి కారణం నాటి సామాజిక పరిస్థితులే. 'బీట్ జనరేషన్', 'గ్రే జనరేషన్', 'యాంగ్రీ యంగ్‌మెన్ మూమెంట్', 'ఫూండెడ్ యూత్', 'ప్రోవో మూమెంట్', 'హంగ్రీ జనరేషన్', 'ప్రొటెస్ట్ లిటరేచర్', 'దిగంబర కవిత్వం', 'బండయా కవిత్వం'... ఈ ఉద్యమాల్లోంచి ఉబికివచ్చిన కవిత్వమంతా ఒక బలమైన తాత్విక భూమికతో, విశ్వమానవ శ్రేయస్సు కోసం ఆవేదనతో రాసిన కవిత్వం.

సంక్లిష్టమైన ఇరవయ్యవ శతాబ్దపు ఆధునిక మనిషి ఆధ్యాత్మిక, మానసిక అణచివేతలను కవిత్వంలో వ్యక్తం చేసిన అత్యంత ఆధునిక అర్బన్ పొయెట్ అలెన్ గిన్స్‌బర్గ్. అమెరికాలో 1950ల బీట్ జనరేషన్‌లో అతను ఒక సాహిత్య సంచలనం. బీట్ కవిత్వ ఉద్యమంలోను, ఆ తర్వాత 1960ల హిప్పీ ఉద్యమంలోను కీలక పాత్ర పోషించాడు. తత్వశాస్త్రం, ముఖ్యంగా అస్తిత్వవాదం చేత ప్రభావితుడు. కవిత్వ అభివ్యక్తిలో మార్మికవాది.

మానవతావాదం, ఘాటైన పదజాలం, ఇతివృత్తపరంగా అధిక్షేపం... ఈ కోణాల్లోంచి చూసినపుడు అలెన్ గిన్స్‌బర్గ్ కవిత్వానికీ, తెలుగులో దిగంబరకవుల కవిత్వానికి కొంత సామ్యం కనిపిస్తుంది. గిన్స్‌బర్గ్ 1962లో ఇండియాలో పర్యటించి 'ఇండియన్ జర్నల్' అనే గ్రంథాన్ని వెలువరించడమే గాక, ఆ పర్యటనలో పశ్చిమ బెంగాల్ వెళ్ళి హంగ్రీ జనరేషన్ కవులైన మలయ్ రాయ్ చౌదరి, సమీర్ రాయ్ చౌదరి, ఉత్పల్ కుమార్ బసులకు ప్రేరణ అందించాడు.

తెలుగులో దిగంబరకవులుగా దూసుకొచ్చిన ఆరుగురు నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, మహస్వప్న, భైరవయ్యలు 1965లో మొదటి కవిత్వ సంపుటిని, 1966లో రెండవ, 1968లో మూడవ కవిత్వ సంపుటాలను వెలువరించారు. ఈ మూడు సంపుటాల్లోని కవిత్వం వెనుకా గిన్స్‌బర్గ్ స్ఫూర్తి కనిపిస్తుంది.


మొదటి సంపుటిలో దిగంబర కవితోద్యమ ఉద్దేశ్యాన్ని ఆ కవులు ఇలా చెబుతారు: "ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతిమనిషి ఉనికి కోసం తపనపడి అతడి భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చి ఎత్తి ప్రవచించిన కవిత. మేం 'దిగంబరులం'. మంచి కోసం, మనిషి లోని నిప్పు లాంటి నిజమైన మనిషి కోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం, అహోరాత్రులు ఆరని అగ్నిలో నడిచిన ఆత్మల లోంచి పలుకుతున్న గొంతుకలం."

బీట్ కవులు, దిగంబరకవులు ఒకే తాత్వికచింతనతో కవిత్వ సృజన చేసినప్పటికీ దిగంబర కవులు బీట్ కవులచే ప్రభావితులై కవిత్వం రాశారా లేదా అనేది చర్చనీయాంశం. బీట్ జనరేషన్ తర్వాతి కాలంలోనే దిగంబరకవిత్వోద్యమం వచ్చినందున ఎంతో కొంత ప్రభావం ఉండివుంటుందని భావించవచ్చు.

> **మానవతావాదం, ఘాటైన పదజాలం, ఇతివృత్తపరంగా అధిక్షేపం... ఈ కోణాల్లోంచి చూసినప్పుడు అమెరికన్ బీట్ కవి అలెన్ గిన్స్‌బర్గ్ కవిత్వానికీ, తెలుగులో దిగంబరకవుల కవిత్వానికి కొంత సామ్యం కనిపిస్తుంది.**

ఇతర బీట్ కవుల కంటే గిన్స్‌బర్గ్ కవిత్వం తీవ్రమైన poetic forceతో ఉండి పాఠకుల్ని, విమర్శకుల్ని షాక్‌కు గురి చేసింది. అమెరికన్ జీవితం లోని అవినీతిని, క్రూర విషాదకర అమానవీయ సంఘటనల్ని తన కవిత్వం ద్వారా వ్యక్తపరిచి బీట్ కవుల కొత్త డీన్ (గురువు) అని ప్రశంశలందుకున్నాడు గిన్స్‌బర్గ్. తన కాలపు ఆధునికులు దేవుడి మీదనే కాదు, తమ మీద తాము కూడా నమ్మకం కోల్పోయి ఎలాంటి ఆధ్యాత్మిక విలువల్లేని యంత్రాల్లా జీవిస్తున్నారని వాపోతూ 'హౌల్' (పొలికేక/ ఊళ) అనే ఒక దీర్ఘకవితను సృజించాడు. ఆ కవిత ఇలా మొదలవుతుంది:

"నేను చూశాను
పిచ్చితో నాశనమై, ఆకలితో, ఉన్మాదంతో నగ్నంగా
తెల్లవారుజామున నీగ్రో వీధుల్లో తిరిగే నా తరం మేధావుల్ని...
రాత్రియంత్రాల నక్షత్రపు వెలుగులో
పురాతన స్వర్గపు తలంపులతో
దేవదూతల ముఖాలతో తిరిగే అతిస్వేచ్ఛావాదుల్ని
పేదరికంతో, చిరిగిపోయిన బట్టలతో జీవంలేని కళ్ళతో...
ఎత్తయిన చల్లటి నీటిగదుల్లో అతీంద్రియచీకట్లో
ధూమపానం చేస్తున్నవారిని...
వెర్రితో కపాలాలకిటికీలపై అశ్లీలకవితల్ని ప్రచురించినందుకు అకాడెమీల నుండి బహిష్కరింపబడ్డవారిని...
అపరిశుభ్రమైన గదుల్లో అర్ధనగ్నంగా డబ్బును చెత్తబుట్టల్లో తగులబెట్టి, గోడల్లోంచి బీభత్సాన్ని వింటున్నవాళ్ళని..."


శ్రీశ్రీతో దిగంబర కవులు జ్వాలాముఖి, నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండ రాజు

1956లో 'హౌల్' మహాకావ్య ప్రచురణతో గిన్స్‌బర్గ్ అమెరికాను దిగ్భ్రమకు గురిచేశాడు. అమెరికా సమాజం తన యువతరాన్ని ఎలా నాశనం చేసిందో భావగర్భితంగా వ్యక్తం చేసే ఈ కవితను అమెరికా ప్రభుత్వం నిషేధించింది. 'హౌల్' కవిత అమెరికాలో వ్యవస్థీకృత యాంత్రిక నాగరికతకు వ్యతిరేకంగా రాసిన మొట్టమొదటి నిరసన కవిత.

గిన్స్‌బర్గ్ లాగే దిగంబర కవి నగ్నముని కూడా సమాజంలో రోజురోజుకు దిగజారిపోతున్న విలువలను, ఆధునిక మానవుని దుస్థితిని చూసి భరించలేని బాధతో 'జైల్లో సముద్రం' అనే అధివాస్తవిక కవిత రాశాడు. అందులో: "మనిషిని మనిషిగా/ ఈ కృత్రిమ దుస్తుల్ని విప్పేసి/ నగ్నంగా నిశ్చలంగా సజీవంగా సాక్షాత్తు మానవుడిగా మట్టిలో పుట్టి మట్టిలో ఎదిగే/ మానవతా నక్షత్రం..." అని అంటాడు. నగ్నముని భాషలోను, కవిత్వతీవ్రతలోను, సామాజిక సంఘటనలకు ప్రతిస్పందించే గుణంలోను గిన్స్‌బర్గ్‌ను పోలి ఉంటాడు. ఈ ఇరువురి కవిత్వంలో ప్రవాహగుణం ప్రస్ఫుటం. గిన్స్‌బర్గ్ లాగే నగ్నముని కూడా కవిత్వంలో అత్యంత జుగుప్సాకరమైన భాషను వాడి తీవ్ర విమర్శలకు గురయ్యాడు. 'కొజ్జాల కామకేళి చూస్తున్నాను' అనే కవితలో: "అశ్లీలం పలుకుతోంది దిగంబరాక్షరం అంటున్నావు సిగ్గులేకుండా/ నీ మెదడు పురుగు తినేసింది/ నీ చర్మం కుళ్ళిపోయింది/ నీ అవయవం పుచ్చిపోయింది..." అంటాడు.

సమాజమే వ్యక్తులను పనికిరానివాళ్ళుగా చేస్తుందని ఆరోపిస్తూ, యువత దిగజారడానికి కారణమైన సమాజంపై గిన్స్‌బర్గ్ లాగే దిగంబరకవులు తమ ఆగ్రహాన్ని, ఆవేదనను తీవ్రస్వరంతో వ్యక్తపరుస్తారు. మహస్వప్న 'గ్లానిర్భవతి భారతః' అనే కవితలో "మానవత రెండు కళ్ళు మూసుకు పోయినప్పుడు/ విప్పుకుంటున్న మూడో కన్నునై/ కాలం వాయులీనం మీద కమానునై/ చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫానునై/ నేను వస్తున్నాను దిగంబర కవిని..." అంటాడు. 'చెరచబడ్డగీతాన్ని' అనే కవితలో మరో దిగంబర కవి భైరవయ్య మనుషులు యాంత్రిక జీవన విధానాలకు దూరంగా ఉండాలని గిన్స్‌బర్గ్ లాగే ఉద్బోధిస్తాడు: "నేను చెరచబడ్డ గీతాన్ని/ నగ్నంగా నడివీధిలో కాటేసిన భూతాన్ని/ స్వార్థపు కాంక్రీటు తొడలమధ్య/ నలిపివేయబడ్డ రాగాన్ని." ఈ కవితలోని 'నేను' అన్న మాట మానవత్వాన్ని, సమాజాన్ని, కవిత్వాన్ని, మనిషిని సూచిస్తుంది. మానసిక దిగంబరత్వం కోసం నిత్యసచేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే ఆశయంగా చెప్పుకున్న దిగంబరులు గిన్స్‌బర్గ్ లాగే తమ కావ్యరచనలో జీవితంలోని నిజాయితీని, సరళత్వాన్ని, యుగసందేశాన్ని, అనుభూతుల అభివ్యక్తిని ఊపిరిగా పీల్చగల ఆధునికమానవుని అస్తిత్వాన్ని ఆవిష్కరిస్తారు. నిఖిలేశ్వర్ 'ఆత్మయోని' అనే కవితలో "దిగంబర కవితలో మరొకడు మరొకడు/ నిండుగా నిజంగా ఊపిరి పీల్చేవాడు/ ఆత్మయోని నుండి పుట్టుకొస్తాడు" అంటాడు. చెరబండరాజు 'నా మనుష్య ప్రపంచంలోకి' అనే కవితలో "మంచి చచ్చి పుచ్చిన మానవతలో/ శవాలుగా మిగిలిన మనుషుల ఆశల చరమశ్వాసలుగా చూసి జాలిపడి/ వారి వెన్నుపూసలుగా మారి వారిని నిలబెడుతున్నాయి" అంటూ కవిత్వ నిబద్ధతకి నిలువెత్తు నిదర్శనమౌతాడు.

అప్పటివరకు చెలామణీలో ఉన్న కవిత్వ నిర్మాణ సూత్రాలను చెరిపేసి పొడవైన వాక్యాలు రాసిన అధివాస్తవిక కవి గిన్స్‌బర్గ్. ఛందోబద్ధ వాక్యనిర్మాణానికి తిరుగుబాటుగా 'హౌల్' మొదటి భాగంలో 75 పంక్తుల సుదీర్ఘ వాక్యాన్ని రాస్తాడు. అశ్లీల పదాలను కూడా కవిత్వీకరిస్తాడు. గిన్స్‌బర్గ్ లాగే అశ్లీల పదాల్ని కవిత్వంలో విస్తారంగా ఉపయోగించి వివాదాస్పదమైనారు దిగంబరకవులు. జుగుప్స కలిగించే సమాజాన్ని ప్రతిబింబించాలంటే అలాంటి భాషను, ప్రతీకల్నే వాడాలన్న దిగంబరుల వాదనను ఆరుద్ర, కొడవటిగంటి లాంటి కొద్దిమంది ప్రముఖులు సమర్థించారు. మానవుని ఉనికి కోసం తపనపడుతూ రాసిన కవిత్వమే కానీ తమ భాషలో జుగుప్స లేదంటాడు భైరవయ్య. "బూతును అస్పృశ్యంగా చూడడానికి మనలో ఉన్న ఒక రకమైన పిరికితనం కారణం. దిగంబర కవితలోని బూతుపదాల స్పందన సెక్స్ వైపుకు వెళ్ళనీయదు. సమాజాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించడమే దిగంబర కవిత".

అంతిమంగా గిన్స్‌బర్గ్ గానీ, దిగంబర కవులు గానీ తమ లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేదు. బీట్ కవులు వ్యక్తిగత విభేదాల కారణంగా విడిపోగా, దిగంబరకవులు ఐదేళ్ల వరకు తమ నిరసన స్వరంతో కలిసి ప్రయాణం చేశారే కానీ ఆ తర్వాత ఆ ఉద్యమాన్ని కొనసాగించలేకపోయారు. వారు ఇతర తెలుగుకవుల్ని ప్రభావితం చేయలేక పోవడమే కాక, వారి అభిప్రాయాలతో, కవిత్వంతో పాఠకులు ఏకీభవించలేదని అర్థం చేసుకున్నారు. ఏ నిరసన కవైనా ప్రజల్లోకి చేరితే తప్ప ప్రభావవంతంగా ఉండలేడని గ్రహించి 1970లో విరసం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. దిగంబరోద్యమం దిగంబర కవులచే ప్రారంభించబడి వారితోనే ముగిసిందని చెప్పొచ్చు.

(మార్చి 12తో దిగంబర కవిత్వానికి 60 ఏళ్ళు)

■ బాణాల శ్రీనివాసరావు

✆ 94404 71423

మునిపల్లె రాజు సాహిత్య పురస్కారాలు

కథకుడు మునిపల్లె రాజు శతజయంతి సందర్భంగా 2023 సాహిత్య పురస్కారాన్ని సుధామ, 2024 సాహిత్య పురస్కారాన్ని పి. చంద్రశేఖర ఆజాద్‌లు స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఎం.వి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 17 సా.6గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

ఉష మునిపల్లె

నవలల పోటీకి ఆహ్వానం

జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీ - 2025కు రచనలను ఆహ్వానిస్తున్నాం. పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా: రూ.25వేలు, రూ.20వేలు. రచనలు చేరాల్సిన చివరి తేదీ ఏప్రిల్ 8. పూర్తి వివరాలకు: www.jagritiweekly.comలో జాగృతి వారపత్రిక తాజా సంచిక చూడండి. ఫోన్: 99599 91304.

జాగృతి సంపాదకులు

బీసీ వాద కవిత్వానికి ఆహ్వానం

బీసీ అస్తిత్వ, సాంస్కృతిక, రాజకీయవాదాన్ని బలపరుస్తూ బీసీ కవుల నుండి వచన కవితలకు ఆహ్వానిస్తున్నాము. కవితలను ఏప్రిల్ 15లోగా ఈమెయిల్: bcsahityavedika2025@gmail.com, వాట్సప్ నెంబర్: 94927 65358కు పంపాలి. బీసీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ జరిగే రాష్ట్ర స్థాయి బీసీ సాహిత్య సదస్సులో సంకలనంగా ప్రచురించి ఆవిష్కరిస్తాము.

వనపట్ల సుబ్బయ్య

ప్రపంచ సాహిత్యం సరసన తెలుగుకు గొప్ప అవకాశం

ఇటీవల 'అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్' తెలుగు అనువాదంపై ప్రారంభించిన వర్క్‌షాప్ గురించి చెప్పండి. ఈ వర్క్‌షాప్‌లో మెంటర్‌గా ఎంపికైన మీరు చేయాల్సిన పని ఏమిటి?

అమెరికాలో అనువాద సాహిత్యంపై దాదాపు యాభై యేళ్లుగా కృషి చేస్తున్న సంస్థ అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌టర్స్ అసోసియేషన్ (ఆల్టా – ALTA). ఈ సంస్థ వివిధ ప్రపంచ భాషల లోంచి ఇంగ్లీషులోకి వెళ్ళి తీరాల్సిన రచనల మీద దృష్టి పెడుతుంది. ఆయా భాషలకు సంబంధించి అమెరికాలో వున్న ప్రసిద్ధ రచయితలనీ, అనువాదకులనీ, అనువాదం పట్ల ఆసక్తి వున్న కొత్త తరం వాళ్ళనీ ఒక వేదిక పైకి తీసుకొచ్చి, వాళ్ళతో అనువాద శిబిరాలూ, ప్రచురణ కర్తలతో సమావేశాలూ, ఎడిటర్లూ, పత్రికల మధ్య సంభాషణలూ నిర్వహిస్తుంది. సంస్థ పనితీరు ప్రకారం ప్రతి ఏడాదిలో అనువాదకులు కనీసం ఒక పూర్తి రచనని ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యాలి. ఆయా భాషల్లో ఇప్పటికే నిష్ణాతులైన ప్రసిద్ధులని మెంటర్స్ (పర్యవేక్షకులు)గా తీసుకుంటారు. వాళ్ళ పర్యవేక్షణలో అనువాదం పని సాగుతుంది. ఆల్టా సంస్థ నుంచి పర్యవేక్షకునిగా ఆహ్వానం అందటం నాకూ ఆశ్చర్యమే! ఆ సంస్థ నుంచి నాకు వచ్చిన ఈమెయిల్‌లో తెలుగు భాషకి సంబంధించి అమెరికాలో విశేషంగా వినిపిస్తున్న పేరు కాబట్టి పరిశీలనలోకి తీసుకున్నామని రాశారు. తరవాత నాకు అర్థమైందేమంటే వాళ్ళు చాలా రకాలుగా సర్వేలు నిర్వహించి, అభిప్రాయాలూ సేకరించి ఈ పర్యవేక్షకులని నిర్ణయిస్తారని! వర్క్‌షాప్‌లో ఈసారి ఇద్దరు కొత్త అనువాదకులు ఎంపిక అయ్యారు. వారికి కావాల్సిన శిక్షణ ఇచ్చే బాధ్యతను ఈ సంస్థ నాకు అప్పజెప్పింది. ఈ ఇద్దరు కొత్త అనువాదకులు ఒక తెలుగు రచనని అనువాదం చేస్తారు. ప్రతి నెలా నేను వాళ్ళతో సమావేశమై, అనువాద సమస్యల్ని పరిష్కరించాలి. అలాగే, అనువాదం ఏడాదిలో పూర్తి చేయించే బాధ్యత నా మీద వుంటుంది.

> **'అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్' (ఆల్టా) తరఫున ఇంగ్లీషులోకి అనువాదమైన తెలుగు రచనలకు అమెరికాలోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ద్వారా పుస్తకంగా వెలువడే అవకాశం లభిస్తుంది. ఇది చిన్న విషయమేమీ కాదు. ఈ విధమైన కృషి కొనసాగితే కొత్త అనువాదకుల తరం తయారవుతుంది. అనేక తెలుగు రచనలు ఇంగ్లీషులోకి వెళ్తాయి. అట్లా అనువాదమైన రచనల్ని ప్రపంచ స్థాయి అవార్డులకు పంపించే వీలు కూడా ఈ సంస్థ ద్వారా లభిస్తుంది.**

3? మూడు ప్రశ్నలు

అఫ్సర్



తెలుగు నుంచి ఎలాంటి రచనలు అనువాదం కాబోతున్నాయి?

అరబిక్, హిందీ, ఫారసీ, బెంగాలీ, ఇండొనీషియా, చైనీస్, కొరియన్, జపనీస్ లాంటి అనేక భాషల నుంచి ఇప్పటికే ఈ సంస్థ ద్వారా ఎన్నో అనువాదాలు ఇంగ్లీషులోకి అందుబాటులోకి తెచ్చాయి. ఇన్నేళ్ల ఈ సంస్థ చరిత్రలో మొట్టమొదటిసారి తెలుగుని ఈ సంస్థ తమ జాబితాలోకి తీసుకుంది. కాబట్టి, ఈ సంస్థ కింద తెలుగు రచన అనువాదం ఇదే మొదటిసారి. కాని, మొదటి విడతలోనే కనీసం పది మంచి ప్రతిపాదనలు తెలుగు నుంచి అందాయి. అలా వచ్చిన అనువాద ప్రతిపాదనల్లో ముద్దుపళని పద్యాల నుంచి నగ్నముని విలోమ కథల దాకా వున్నాయి. అయితే ఆశ్చర్యంగా ఆధునిక తెలుగు కవిత్వం నుంచి దళిత కవిత్వం అనువాదాలు కూడా పరిశీలనకి వచ్చాయి. మిగిలిన ప్రతిపాదనల్లో మూడు పద్యకావ్యాలు, అయిదు కథల సంపుటాలూ, మరి కొన్ని ఆత్మకథలూ వున్నాయి. ఒక ప్రసిద్ధ సినిమా కవి గురించిన ప్రతిపాదన కూడా వుండడం భిన్నంగా అనిపించింది. ప్రతిపాదనలు వచ్చిన తర్వాత ఒక కమిటీ మౌలిక పరిశీలన చేసి, తుది జాబితా నాకు పంపిస్తుంది. ఆ జాబితా లోంచి నేను ఆ ఏడాది అనువాదం కావలసిన తెలుగు రచనని ఎంపిక చేస్తాను. ఈ విధంగా ఒక పెద్ద సంస్థ ద్వారా మన భాష రచనలు ఇంగ్లీషులోకి వెళ్ళి, అంతర్జాతీయ స్థాయి పబ్లిషర్లూ, ఎడిటర్ల దృష్టికి వెళ్ళడం నా మటుకు నాకు అపూర్వమే అనిపించింది. ప్రతిపాదనలతో పాటు అయిదారు పేజీల ఇంగ్లీషు అనువాదం కూడా అనువాదకులు పంపించాలి కాబట్టి అవి చదివే అవకాశం కూడా నాకు దక్కింది. వీటి నాణ్యత నాకు ఆశ్చర్యం కలిగించింది. చక్కని అమెరికన్ ఇంగ్లీషులో ఈ అనువాదాలు వున్నాయి. నిజానికి ఇవన్నీ అనువాదాలు చేయదగినవే. నెమ్మదిగా వాటిలో ఒక్కొకటీ తీసుకుంటాం.

ఈ వర్క్‌షాప్ నుంచి మనం ఎలాంటి ఫలితాలను ఆశించవచ్చు?

ప్రతి ఏడాదికి తెలుగు రచన ఒకటి మొత్తంగా ఇంగ్లీషులోకి అనువాదం అవుతుంది. అనువాద ప్రతి తయారైన తరవాత అనువాదకులనీ, పర్యవేక్షకులనీ అమెరికాలో ప్రతి ఏడాదీ ఒక్కో నగరంలో జరిగే లిటరరీ ఫెస్టివల్‌కి పిలిపిస్తారు. ఈ ఫెస్టివల్‌లో కేవలం రచయితలే కాకుండా అమెరికాలోని అంతర్జాతీయ స్థాయి ప్రచురణ కర్తలూ, వాటి ఎడిటర్లూ వస్తారు. అనువాదాల రీడింగ్ జరిగే సమయంలో వాళ్లందరినీ ఆహ్వానిస్తారు. రీడింగ్ తరవాత ఆ అనువాదం నచ్చితే ఎడిటర్లు, పబ్లిషర్లు, అనువాదకులతో పాటు నన్నూ చర్చలకి పిలుస్తారు. అనువాద రచన ప్రచురణ వైపు ఈ చర్చలు సాగుతాయి. అంటే, ఇలా ప్రతి ఏడాదీ ఒక తెలుగు రచన అమెరికాలోని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ప్రచురిస్తుందన్న మాట. ఇది చిన్న విషయమేమీ కాదు. ఈ విధమైన కృషి కొనసాగితే కొత్త అనువాదకుల తరం తయారవుతుంది. అనేక తెలుగు రచనలు ఇంగ్లీషులోకి వెళ్తాయి. అట్లా అనువాదమైన రచనల్ని ప్రపంచ స్థాయి అవార్డులకు పంపించే వీలు కూడా ఈ సంస్థ ద్వారా లభిస్తుంది. ■





ప్రియ పద్యం

ధ్యానం లాంటి అనుభూతినిస్తుంది!



మన శరీరాన్నీ, ఆలోచనలని, ఉద్వేగాలనీ, ఏకతాటిపైకి తీసుకురాగల శక్తి సృజన ప్రక్రియకు (అది ఏ కళారూపమైనా) ఉందని నమ్ముతాను. కళాసృజన ఏకాంతమైన ప్రక్రియ. కళలో నిమగ్నమైన మనిషి మానసిక స్థితి ఎలా ఉంటుందో, అతను ఎలాంటి ఎత్తులకు చేరుకోగలడో, ఈ కవిత చెబుతుంది. అనుభూతి ప్రధానమైన ఈ కవితలో, స్థలకాలాల ప్రస్తావనలు కవిత వాతావరణాన్ని సిద్ధపరచి ఉంచి, పాఠకుడిని అలవోకగా ఆ మహాబలిపురం వేకువ లోకి తీసుకుపోతాయి. కళ్ళులేని ఆ సంగీతకారుని ఎదుట కూర్చోబెడతాయి. కవితాత్మకంగా నడవడమొక్కటే కాదు, "చూశానా, కాదు కరుణించి కనబడ్డాడు" లాంటి లోతైన, సాంద్రమైన వాక్యాల ద్వారా, అతన్నీ, కళనీ, దైవాన్నీ కూడా ఒకేసారి స్ఫురింపజేస్తూ పొరలుపొరలుగా పరచుకున్నందుకు కూడా ఈ కవిత ప్రత్యేకం. "రగసియం సామీ, ఎనక్కు ఇంగెయే దరిసనమాగుం" అంటూ తమిళ పదాల్ని యథాతథంగా వాడడం ద్వారా నిర్దిష్ట సాంస్కృతిక నేపథ్యంలో నిలబడుతూనే, కళలోనే దైవాన్ని చూడడమనే ఒక సార్వత్రిక సందేశాన్నిస్తుందీ కవిత. వేణువుకున్న రంధ్రాలని అతని కళ్ళుగా పోలిక చేయడం ద్వారా కళ లోంచే అతడు ప్రపంచాన్ని చూస్తున్నట్టు చెప్పడం చాలా నచ్చింది. ఇంద్రియ సరిహద్దుల్ని దాటి, భౌతిక పరిమితుల్ని దాటి ఒక ఆధ్యాత్మిక శిఖరంపై పాఠకుడిని నిలిపినట్టయింది. ఒక అనుభవాన్నో, అనుభూతినో కవిత చేయడం సాధారణంగా చూసేదే గానీ, ఆ కవిత పుట్టిన స్థలకాలాల్లోకి, అనుభవంలోకి పాఠకుడిని సునాయసంగా తీసుకెళ్తూ, గాలిలో సంగీతం పరచుకున్నంత తేలికగా, తాను పొందిన ధ్యానం లాంటి అనుభూతినే పాఠకుడూ పొందగలిగేలా చేసింది కాబట్టి ఇది నాకు నచ్చిన కవిత.

■ నవీన్ కుమార్

✆ 89194 46717

ఊపిరిపాటకు చూపేదీ?

శిల్పాల్నీ, శిథిలాల్నీ
సాగరాన్ని, నగరాన్నీ
మేల్కొలుపుతూ వినబడ్డాడతను
వేకువల్ని వణికించే వేణువుగా.

గాలి మడుగులో
రాగాల జాడలు పట్టుకుని
వెదుక్కుంటూ వెళ్ళి చూశానతన్ని
చూశానా? కాదు కరుణించి కనబడ్డాడు

పాట ఆపినపుడు
మురళితోబాటు మహాబలిపురాన్నే
సంచిలో పెట్టుకున్నాడా అని?
జలదరించిన ఉదయాలను
సంగీతానికి వదిలి
రాత్రుల్ని కళ్లుగా చేసుకున్నాడా అని?
అడగలేదు... ధ్యానానికి కొనసాగింపు
మౌనమే కావాలని.

బాగా రాత్రయింది, తోడొస్తాను
ఇంటిదాకా అంటే
నిశ్శబ్దంగా నవ్వాడు
చీకటి నా తోబుట్టువని
మీకు తెలీదా? అన్నట్టు

వీడ్కోలు వేళ మాటల్లో మాటగా
రోజూ అడిగినా గుళ్ళోకి రావేమంటే?
పంచేంద్రియాలకు అందని
పరవశంతో గుసగుసగా
'రగసియం స్వామీ!
ఎనక్కు ఇంగెయే దరిసనమాగుం'
(రహస్యం స్వామీ!
నాకు ఇక్కడే దర్శనమౌతుంది.)
అని నమస్కార ముద్రలో
తడుముకున్నాడు
వేణువు వొంటిపైన తన ఏడు కళ్ళనీ...

■ స్వాతికుమారి

తెగిన గొలుసుల చప్పుడు

పాత కాగితాలపై
ఎప్పుడో రాసిన పద్యాలు
ఛందస్సులో తెగిన
గొలుసుల చప్పుడు
తుప్పుపట్టిన తీగలపై
మోగుతున్న సంగీతం

చెదలు పట్టిన
పుటల్లో

అరిగిపోయిన శబ్దాలు
సడలిపోతున్న పిడికిళ్లపై
పెరిగిపోతున్న ముడతలు

బావుల్లాంటి కళ్లలో
ఇంకిపోయిన అశ్రువులు
రాలిపడుతున్న ఆకులతో
పోటీపడుతున్న శవాలు

ఎవరంతటవారు బూడిద
రాసుకుంటే
ఎవరికో ఎందుకు
తన్మయత్వం
ఎవరో ఆత్మాహుతి
చేసుకున్నారని తెలిస్తే
ఇంకెవరికెందుకో
దగ్ధ విషాదం

ప్రతి ముఖంలో ఉన్మాదం
ప్రతి కళ్లలో రక్తరేఖలు

చితుల వెలుగులో
సూర్యుడ్ని
చూడాలనుకోవడం భ్రమ
అస్తమయాలన్నీ
ఉదయాలు
అవుతాయనుకోవడం

అశాస్త్రీయం

ఎవరి తలపై
ఆకాశం వారిదే
పయనించే మేఘాలే
గగనాన్ని
శోభితం చేస్తాయి

■ కృష్ణుడు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 10 మార్చి 2025









● విజయదరహాసం

విజయవాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : న్యూజిల్యాండ్‌తో జరిగిన వరల్డ్ చాంపియన్ ట్రోఫీ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించటాన్ని పురస్కరించుకుని నగరంలో ఆదివారం రాత్రి క్రికెట్ అభిమానుల సంబరాలు జరుపుకున్నారు. బెంజ్ సర్కిల్, ఎంజీ రోడ్డులో కారులను రోడ్డుపై నిలిపి జాతీయ పతాకాలు చేతబూని సందడి చేశారు. భారత జట్టు సభ్యులను అభినందిస్తూ నినాదాలు చేశారు. భారీగా బాణసంచా కాల్చారు. యువకులు బుల్లెట్ల సైలెన్సర్లు తొలగించి అల్లరి చేశారు. యువత పెద్ద ఎత్తున రోడ్లపై చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు తమ లాఠీలకు పనిచెప్పి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కొండపల్లి, తాగడం అక్కడే!

బార్‌లను తలపిస్తున్న వైన్‌షాపులు

యథేచ్ఛగా అనధికారిక పర్మిట్ రూమ్‌లు

మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



కొండపల్లిలో వైన్‌షాపు వెనుక ఏర్పాటు చేసిన షెడ్‌లో కూర్చుని తాగుతున్న మందుబాబులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నం, దావులూరు, జూపూడి డొంకరోడ్డు, గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్, కాచవరం తదితర ప్రాంతాల్లోని వైన్స్ షాపులు బార్‌లను తలపిస్తున్నాయి. మందుబాబులు వైన్ షాపు వద్దే మందు కొనుగోలు చేసి, అక్కడే తాగి వెళ్తున్నారు. ప్రధానంగా విజయవాడ-చత్తీస్‌గఢ్ జాతీయ రహదారి-30 పక్కనే కొండపల్లి ఏపీహెచ్ఎమ్ఈఎల్ రోడ్డు పక్కన రెండు మద్యం షాపులు ఉన్నాయి. వాటి వెనుక రేకుల షెడ్లు వేసి అందులో మందు బాబులు తాగేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని అక్కడే లభిస్తుండటంతో వైన్ షాపులకు వచ్చే మందుబాబులు వారి ద్విచక్రవాహనాలను రహదారి మార్జిన్‌పై అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. ఆటోల్లో వచ్చే వారు ఆటోలను సైతం రహదారి మీదే ఆపి వైన్‌షాపులోకి వెళుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం ఈ రెండు వైన్‌షాపుల వద్ద ఇదే పరిస్థితి. పండుగ, సెలవు రోజులు, ఆదివారాల్లో అయితే ఒక జాతరను తలపిస్తోంది. వైన్‌షాపుల వద్దే తాగిన వారు ద్విచక్ర వాహనాలతో ఒకే సారి రోడ్డు మీదకు వచ్చేస్తూ, ఇష్టానుసారం రాంగ్ రూట్‌లో నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. జి.కొండూరు మెయిన్ సెంటర్లో ఉన్న వైన్ షాపు వద్ద మందు బాబులు చేస్తున్న వికృత చేష్టలతో పులివాగు వంతెనపై నడిచి వెళ్లే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం షాపుల వద్ద నడుస్తున్న అనధికార బార్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రయోజనాలు ఆగిపోతాయ్

జలవనరుల శాఖ ఉద్యోగి కుటుంబానికి బెదిరింపులు!

వేధింపులు భరించలేక ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గుమస్తా వినోద్

- సూసైడ్ నోట్‌లో ముగ్గురి పేర్లు రాసిన గుమస్తా
- కేసు నీరుగార్చేందుకు కుట్రలు



వినోద్(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) 'జరిగిందేదో జరిగింది. ఇక ఇక్కడితో ఆగిపోండి. కేసులు, కోర్టులు అంటూ ముందుకు వెళ్లకండి. అలా కాదని అడుగు ముందుకు వేశారో మీకే నష్టం. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలన్నీ ఆగిపోతాయి' అంటూ జలవనరుల శాఖ నది పరిరక్షణ విభాగంలో రాయ్యూరు సెక్షన్‌లో పనిచేసే గుమస్తా కుటుంబానికి పలువురి నుంచి బెదిరింపులు వచ్చాయి. వివరాల్లోకి వెళితే... రాయ్యూరు నుంచి ఘంటసాల మండలం పాపనాశనం వరకు నది పరిరక్షణ విభాగానికి చెందిన సెక్షన్‌లో పనిచేసే గుమస్తా కన్నేటి వినోద్ కొద్దిరోజుల క్రితం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చనిపోవడానికి ముందు ఆయన ఒక కాగితంపై తన చావుకు కారుకుల పేర్లను రాశాడు. అందులో నది పరిరక్షణ విభాగం జేఈ శ్రీరామ జనార్ధన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాత పేర్లు ఉన్నట్లు సమాచారం. దీనితోపాటు తన అత్త కనకదుర్గ పేరునూ వినోద్ రాసినట్లు తెలిసింది. వినోద్ ఆత్మహత్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తామంతా పని నిబంధనల ప్రకారమే వ్యవహరించామని ఈ పేర్లు ఉన్న వారు చెబుతూ వచ్చారు. వినోద్ ఆత్మహత్య విషయంలో తెర ముందు ఒకటి చెబుతుంటే, తెర వెనుక మరొకటి జరుగుతున్నట్టు జలవనరుల శాఖ ప్రాంగణంలో చర్చ నడుస్తోంది. వాస్తవానికి ఘటన జరిగిన రోజున వినోద్‌ను ముందుగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తర్వాత అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి మిగతా 6లో..

ఎటూ తేల్చుకోలేని స్థితిలో కుటుంబ సభ్యులు


వినోద్ పదోన్నతుల జాబితాలో ఉన్నాడని సమాచారం. జలవనరుల శాఖలో పదోన్నతుల ప్రక్రియ పట్టాలు ఎక్కితే అతడికి ఇంజనీర్ హోదా దక్కుతుంది. ఆయన ప్రేమవివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు ఎలాంటి కేసు, దర్యాప్తులు, విచారణలు అవసరం లేదని వినోద్ కుటుంబ సభ్యులతో పోలీసులకు చెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసును ఉపసంహరించుకుంటే శాఖ తరఫు నుంచి రావాల్సిన ప్రయోజనాలను చకచకా ఇప్పిస్తామని వారికి భరోసా ఇస్తూనే కేసును మనుగడలో ఉంచితే ఎలాంటి ప్రయోజనాలు అందవని బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం వినోద్ కుటుంబ సభ్యులు విషాదంలో ఉండడంతో వారు ఏమీ తేల్చుకో లేకపోతున్నారు. పటమట పోలీసులు మాత్రం కేసును దర్యాప్తు చేసి తీరతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ లేఖలో పేరు ఉన్న ఒకరు నది పరిరక్షణ విభాగంలో విధులకు నిత్యం హాజరవుతూ జోక్‌లు వేస్తూ గడుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వినోద్ కాగితంపై పేరు రాసినంత మాత్రాన తనకేమీ కాదన్న ధీమాను ఆయన ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

మెగాసిటీ 2.0

న్యూ విజయవాడగా రూపుదిద్దుకుంటున్న నగరం

విస్తరిస్తున్న ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు

- నిన్నటి వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు చుట్టూనే..
- ఇప్పుడు విజయవాడ వెస్ట్ బైపాస్ దాటి విస్తరణకు అడుగులు
- గొల్లపూడి, జక్కంపూడి, నున్న ప్రాంతాల వైపు వేగంగా..
- గుణదల రెవెన్యూ గ్రామం నుంచి ఇన్నర్ వరకు..
- వెదురుపావులూరు ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్స్
- కేసరపల్లి ఐటీ కంపెనీల వైపు మెగా హౌసింగ్ నిర్మాణం
- కానూరు - నిడమానూరు దిశగా నగరీకరణ
- జాతీయ రహదారి ప్రాజెక్టులన్నీ ఈ ప్రాంతాల్లోనే ఉండటంతో మరింత అభివృద్ధి



రామవరప్పాడు పై ఓవర్ వైపు పెరుగుతున్న నగరం

> నగరం విస్తరిస్తోంది. న్యూ విజయవాడగా రూపుదిద్దుకుంటోంది. విజయవాడ 2.0గా శివారు ప్రాంతాల వైపు నగరాభివృద్ధి చురుగ్గా సాగుతోంది. ఈ మార్పులు గ్రేటర్ విజయవాడ తక్షణ అవసరాన్ని గట్టిగా సూచిస్తున్నాయి. విజయవాడను అనుకుని ప్రధానంగా ఉత్తర భాగంలో గుణదల రెవెన్యూ గ్రామానికి అనుసంధానంగా ఉన్న వెదురుపావులూరు నుంచి కేసరపల్లి వరకు, అలాగే జక్కంపూడి నుంచి నున్న వరకు, గొల్లపూడి - ఇబ్రహీంపట్నం - కొండపల్లి వరకు, కానూరు నుంచి నిడమానూరు వరకు నగరం మరింత విస్తరిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు నగరంతో సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం విజయవాడ నగరంలో జనాభా పెరగడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో విజయవాడ శరవేగంగా అభివృద్ధి చెందటానికి, విస్తరించటానికి శివారు ప్రాంతాలే వనరులుగా మారాయి. విజయవాడ భౌగోళిక పరిస్థితుల రీత్యా దక్షిణ భాగాన కృష్ణానది ఉంది. దీంతో అటు వైపు విస్తరించటానికి అవకాశం లేదు. విజయవాడ నగరం రెండున్నర దశాబ్దాలుగా ఎన్‌హెచ్ - 65 వెంబడి సరళరేఖలా విస్తరిస్తూ పోతోంది. విజయవాడ నగరం ఒక ప్రణాళికా బద్ధంగా విస్తరించాలంటే.. చతురస్రాకారంగా అభివృద్ధి చెందటం ముఖ్యమన్న వాదనలు అప్పట్లో వచ్చాయి. దశాబ్దంన్నర కాలంలో ఎన్‌హెచ్ - 16 వెంబడి కూడా విజయవాడ నగరం విస్తరిస్తోంది. ఎన్‌హెచ్ - 65 వెంబడి విస్తరించినంత వేగంగా అయితే లేదు.

గ్రేటర్ ఆశలను చిదిమేసిన గత వైసీపీ ప్రభుత్వం

రాష్ట్ర విభజన నేపథ్యంలో అమరావతి రాజధాని ప్రాంతంలో అంతర్భాగంగా ఉన్న విజయవాడ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెయ్యటానికి గత టీడీపీ ప్రభుత్వం గ్రేటర్ అంశాన్ని తెరమీదకు తెచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 18 గ్రామాలను గ్రేటర్ విలీన జాబితాలో చేర్చాలని పెట్టినా.. ఆ తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గ్రేటర్ విజయవాడలో కదలిక మిగతా 6లో..

జాతీయ రహదారి ప్రాజెక్టులతో వేగం

జాతీయ రహదారి ప్రాజెక్టులు సరికొత్త విజయవాడ నగరానికి అడుగులు వేయిస్తున్నాయి. జక్కంపూడి నుంచి విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు అతి త్వరలో జరగనున్నందున ఈ ప్రాంతానికి మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అలైన్‌మెంట్ పరిధిలో పెద్ద సంఖ్యలో భూముల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు నేపథ్యంలోనే విజయవాడ ఈ ప్రాంతం వైపు విస్తరిస్తుందనుకుంటే.. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణంతో మరింత విస్తరణకు దోహదపడింది. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లు కూడా ప్రతిపాదనలో ఉండటంతో రానున్న రోజుల్లో అవి కూడా కార్యరూపం దాల్చితే విజయవాడ అభివృద్ధి విజయవాడ వెస్ట్ బైపాస్ పరిధి దాటి కూడా ఇంకా ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జాతీయ రహదారులన్నింటి కారణంగా.. విజయవాడ ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు శరవేగంగా విస్తరించనున్నాయి.



ఉత్కంఠగా ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ క్రీడా పోటీలు

● చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహణ 6లో

థియేటర్లలో క్రికెట్ మ్యాచ్ ప్రదర్శన

నేరుగా హోంశాఖ నుంచి అనుమతి తెచ్చుకున్న ఓ నిర్మాణ సంస్థ

సమాచారం ఇవ్వకపోవడంపై జిల్లా అధికారుల అసహనం

విజయవాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వరల్డ్ చాంపియన్ ట్రోఫీలో ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలో రెండు థియేటర్లలో ప్రదర్శించారు. పటమట, గాంధీనగర్‌లో ఉన్న థియేటర్లలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ థియేటర్ల యాజమాన్యం జిల్లా అధికారులతో సంబంధం లేకుండా నేరుగా హోంశాఖ నుంచి అనుమతి తెచ్చుకోవడం చర్చనీయాంశమైంది. థియేటర్లలో ఇలాంటి ప్రదర్శనలు చేయాలనుకున్నప్పుడు, బహిరంగ ప్రదేశాలు, స్టేడియంల్లో లైవ్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు ముందుగా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. పోలీసులు, రెవెన్యూ అధికారులు అన్ని అంశాలను పరిశీలించి అనుమతి ఇస్తారు. ఇలా జిల్లా అధికారులకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోకుండానే హోం శాఖ కార్యదర్శి నుంచి అనుమతి తెచ్చుకున్నారు. ఇలా అనుమతి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రదర్శనలు చేసిన థియేటర్ల యాజమాన్యం ఆ పని చేయలేదు. ఈ థియేటర్లలో ప్రదర్శనలు జరుగుతున్నాయని బయట వ్యక్తులు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు తమ సిబ్బందిని పంపి విచారణ చేయించగా హోం శాఖ కార్యదర్శి ఇచ్చిన అనుమతి కాపీని ఆ సంస్థ మేనేజర్ చూపించాడు. ఇదే విషయాన్ని సిబ్బంది అధికారులకు తెలియజేశారు. దీనిపై అధికారులు ఆ సంస్థ వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

తొలి విడతలో నిరాశే!

ఐదుగురు ఆశావహుల్లో ఏ ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ

నేతలకు అధిష్ఠానం నుంచి బుజ్జగింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎమ్మెల్సీ పదవులు ఆశించిన వారిలో ఎవరికీ తొలి విడతలో చోటు దక్కలేదు. పరిమిత స్థానాలు మాత్రమే ఉండటం, ఆశావహులు జాబితా ఎక్కువగా ఉండటంతో అధిష్ఠానానికి ఈ వ్యవహారం కత్తిమీద సాముగా మారింది. దీనికి తోడు కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలకు కూడా కేటాయించాల్సి రావటంతో.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆశించిన ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు దక్కలేదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి బుద్దా వెంకన్న, దేవినేని ఉమామహేశ్వరరావు, వంగవీటి రాధాకృష్ణ, నెట్టెం రఘురామ్‌తో పాటు కృష్ణాజిల్లాకు చెందిన పరుచూరి అశోక్‌బాబు ఎమ్మెల్సీ స్థానాలను ఆశించారు. వీరిలో బుద్దా వెంకన్న, దేవినేని ఉమా, వంగవీటి రాధాకృష్ణల్లో ఒకరికి ఖచ్చితంగా చాన్స్ దక్కవచ్చన్న ఊహాగానాలు నడిచాయి. ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా విడుదల చేయనుండటంతో ఆశావహులంతా నరాలు తెగే మిగతా 6లో..



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-16 (సోమ)
సహర్ (ఉదయం) : 5-07 (మంగళ)

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

● గ్రామ సర్వేయర్ల ధర్నా 6లో

జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలి

● రంగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో పలువురు డిమాండ్

పీ4 కార్యాచరణలో భాగస్వాములు కండి..!

- ఆలోచనలు పంచుకోండి.. మార్పునకు నాంది పలకండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

6

గీత దాటితే బుక్కే..!

- నగరంలో కఠినంగా ట్రాఫిక్ నిబంధనలు

6లో



నోటీసును తిరస్కరించిన వైసీపీ కౌన్సిలర్లు

తిరువూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అజెండాను తిరస్కరించిన కొందరు కౌన్సిలర్లు తమ అసమ్మతిని మరింత బహిర్గతం చేశారు. అధికారులు ఈనెల 11న మంగళవారం కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన అజెండా నోటీసులు కౌన్సిలర్లకు సిబ్బంది ద్వారా పంపించారు. 17 మంది వైసీపీ కౌన్సిలర్లలో సుమారు ఏడుగురు అజెండా కాపీలు తీసుకునేందుకు నిరాకరించడంతో, రిజిస్టర్ పోస్టులో పంపినట్టు సమాచారం. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు అసమ్మతిస్వరం వినిపిస్తుండటంతో గతంలో వలే ఈ సమావేశానికి తక్కువమంది సభ్యులు హాజరైతే కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదాపడుతుందనే యోచనలో కొందరు కౌన్సిలర్లున్నారు.

'ఆసుపత్రి బయటే వైద్యం'పై నివేదిక ఇవ్వండి

● డీఎంహెచ్‌వోకు ఉన్నతాధికారుల ఆదేశాలు

జగ్గయ్యపేట రూరల్, మార్చి (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తగాయాలతో వచ్చిన వ్యక్తికి ఆరోగ్య కేంద్రం బయటే వైద్యం పేరుతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై వైద్యశాఖలో ప్రకంపనలు సృష్టించింది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కమిషనర్ స్పందించి నివేదిక అందించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించినట్టు సమాచారం. వైద్యులు అందుబాటులో లేకపోవటంతో ఆరోగ్య సిబ్బంది వైద్యం అందించటంలో నిర్లక్ష్యంపై ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

గురుకుల ఎంట్రన్స్‌కు దరఖాస్తుల గడువు 13

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై. యశోదలక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఏపీ బీఆర్ఏజీ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తుకు ఈ నెల 13 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు 91216-14398 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



ధర్నాలో పాల్గొన్న సర్వేయర్లు

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

● గ్రామ సర్వేయర్ల ధర్నా

ధర్నాచౌక్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు బూరాడ మధుబాబు విమర్శించారు. ఈ మేరకు స్థానిక ధర్నాచౌక్‌లో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన గ్రామ సర్వేయర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వేయర్లకున్న ప్రత్యేక ఇబ్బందులను పరిగణలోకి తీసుకోకుండా అధికారులు తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మాతృశాఖ సర్వే, భూరికార్డులశాఖలో యాజమాన్య హక్కులు నిర్ధారించే అధికారాలను సర్వే శాఖ తరుపున నియమించేలా శాఖాపరమైన సంస్కరణలు తేవాలన్నారు. సోర్స్‌లెస్‌గా ఉన్న 4722 మంది సర్వేయర్లను అర్హతగల ఇతర ప్రభుత్వశాఖలో తీసుకోవాలని కోరారు. వాస్తవ పరిస్థితిని మానిటరింగ్ చేసేందుకు మొబైల్ అప్లికేషన్ ఇవ్వాలన్నారు. తీవ్ర పని ఒత్తిడితో సతమతమవుతున్న తమకు సెలవులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్లు అయ్యప్పలనాయుడు, అంకయ్య, ఓంకార్, పలు జిల్లాల అధ్యక్షులు లోకేష్, శ్రీనివాస్, సాయికిరణ్, అధిక సంఖ్యలో గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

మెగాసిటీ 2.0

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. అప్పట్లో ఏకంగా 45 గ్రామాలను గ్రేటర్ విలీన జాబితా పరిధిలోకి చేర్చి గ్రామ పంచాయతీల తీర్మానాలను తీసుకోవటం జరిగింది. నూటికి 90 శాతం పైగా గ్రామ పంచాయతీలు సానుకూలంగా తీర్మానాలు చేసి పంపాయి. నిర్ణయం తీసుకునే క్రమంలో ఎన్నికలు రావటంతో ఆగింది. గత వైసీపీ ప్రభుత్వం గ్రేటర్ ఆశలను చిదిమేసింది. విజయవాడ గ్రేటర్ పరిధిలో ఉన్న గ్రామాలను మునిసిపాలిటీలుగా మార్చింది. దీంతో విజయవాడ విస్తరణకు బ్రేక్ పడింది.

అయినా ఆగని అభివృద్ధి, విస్తరణ

అయినప్పటికీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ జాబితాలో చేర్చిన గ్రామాలు విజయవాడకు సమాంతరంగా కొత్త విజయవాడగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన గ్రేటర్ గ్రామాల వైపు విజయవాడ నగర విస్తరణ అంతకంతకూ పెరిగిపోతోంది. రామవరప్పాడు నుంచి ప్రారంభమయ్యే ఇన్నర్ రింగ్ రోడ్డు ఆవల వైపు సరికొత్త నగరమే తయారవుతోంది. పూర్తి నగరీకరణ దిశగా వేగంగా విస్తరించుకుంటూ పోతోంది. విజయవాడ పశ్చిమ బైపాస్‌ను దాటుకుని ఆవల వైపు కూడా విజయవాడ విస్తరిస్తోంది. వెదురుపావులూరు ఇంటర్నేషనల్ స్కూల్, భారీ పరిశ్రమలు, పబ్లికేషన్స్ సంస్థలు, తయారీ రంగ పరిశ్రమలు, గోడౌన్లు, షోరూమ్‌లు, సర్వీసు సెంటర్స్, ఎంఎస్ఎంఈ యూనిట్స్ వంటివి ఏర్పాటవుతున్నాయి.

వెలుస్తున్న భారీ అపార్ట్‌మెంట్లు

గుణదల రెవెన్యూ గ్రామంలో నివాస ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భారీ అపార్ట్‌మెంట్ల నిర్మాణం జోరుగా జరుగుతోంది. ఇప్పటికే అపార్ట్‌మెంట్ శ్రేణితో ఈ ప్రాంతం విస్తరణ బాట పట్టింది. గుణదల రైల్వే స్టేషన్ శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి జరుగుతోంది. ఇక్కడ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు అనుసంధానం కావటానికి వీలుగా క్రమేణా రెసిడెన్షియల్ కట్టడాలు విస్తరిస్తున్నాయి. వెదురుపావులూరు ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్ విశ్రమంగా విస్తరణ జరుగుతోంది. వెదురుపావులూరు నుంచి కేసరపల్లి వరకు అనేక రియల్ వెంచర్లు వెలుస్తున్నాయి. ప్రధానంగా కేసరపల్లి వైపు భారీగా విల్లాలు, అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌లు విస్తరిస్తున్నాయి. కేసరపల్లిలో ఐటీ పార్కులు, హెచ్‌సీఎల్ ఐటీ టెక్నాలజీస్ పార్కుల వైపు అయితే భారీగా విల్లాలు, గ్రూప్ హౌస్‌ల నిర్మాణం జరిగింది.

జోరుగా భూముల క్రయ విక్రయాలు

జక్కంపూడి, కండ్రిక, పాతపాడు, నున్న, అంబాపురం, పి.నైనవరం ప్రాంతాలు ఇప్పుడిప్పుడే విస్తరణ బాట పట్టాయి. విజయవాడ పశ్చిమ బైపాస్ కారణంగా ఈ ప్రాంతాల్లో భారీగా భూముల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. కండ్రిక ప్రాంతం విజయవాడ బైపాస్‌కు దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతంలో నిర్మాణ రంగం శరవేగంగా జరుగుతోంది. విజయవాడ బైపాస్ కారణంగా నున్న, సూరంపల్లి వరకు అనూహ్యంగా నిర్మాణ రంగం విస్తరిస్తోంది. గొల్లపూడి ఇప్పటికే విజయవాడతో సమాంతరంగా విస్తరించింది. విజయవాడ బైపాస్ కారణంగా ఆవల వైపు కూడా విస్తరణ దిశగా ముందుకు వెళుతోంది. నగరం ఈశాన్య దిక్కున కానూరు ఇప్పటికే విస్తరించిన ప్రాంతం. ఇది మరింత విస్తరిస్తోంది. నిడమనూరు దిశగా ఈ ప్రాంతం విస్తరిస్తోంది. తూర్పు బైపాస్ ఆశలతో ఈ ప్రాంత అభివృద్ధి ముందుకు వెళ్లింది. తూర్పు బైపాస్ ఇక లేనప్పటికీ.. ఇన్నర్‌రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ ఆశలతో ఈ ప్రాంతం మరింత విస్తరణ దిశగా కదులుతోంది.

తొలి విడతలో నిరాశే!

(5వ పేజీ తరువాయి)

ఉత్కంఠతను అనుభవించారు. బుద్దా వెంకన్న తన నివాసంలో ఉండగా, ఆయన అభిమానులంతా సమీపంలోని కార్యాలయంలో టీవీకి అతుక్కుపోయారు. గొల్లపూడిలో దేవినేని ఉమా ఆఫీసు దగ్గర కూడా ఆయన అభిమానులు శుభవార్త కోసం ఎదురు చూశారు. ఉమాకు సీటు వస్తే బాణసంచా కాల్చటానికి రంగం సిద్ధం చేసుకున్నారు. వంగవీటి రాధా అనుయాయులు కూడా ఉత్కంఠగా ఎదురు చూశారు. అభ్యర్థులను ఖరారు చేయకముందే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆశావహులకు ఫోన్లు చేసి ఈసారికి కొన్ని సమీకరణాల కారణంగా ఇవ్వలేకపోతున్నామని, తర్వాత దశలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఇలా చెప్పిన వారిలో అశోక్‌బాబు, నెట్టెం రఘురామ్ ఉన్నారు. మిగిలిన వారికి సోమవారం ఫోన్ చేసి చెప్పే అవకాశం ఉంది.

గీత దాటితే బుక్కే..!

కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాన్ని ఏదో ఒకలా ఆపుతున్నారా? సరిగ్గా జీబ్రా క్రాసింగ్ గీతపై ఆగుతున్నారా? దీనికి వెనుకుండే స్టాప్‌లైన్ల దాటేస్తున్నారా? ఇక నుంచి ఇలాంటి చిత్రాలు కూడళ్లలో కుదరవు. ట్రాఫిక్ పోలీసుల జాబితాలో ఉల్లంఘనులుగా ఉండిపోతారు. నగరంలో ఎక్కడెక్కడ తిరిగినా ఇంటికి వెళ్లేసరికి చలానా సందేశం మీ ఫోన్ నంబర్‌కు వస్తుంది. ఇలాంటి ఉల్లంఘనలను గుర్తించడానికి కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతి, విజయవాడ



మిలియన్ సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐటీఎంఎస్ (ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం) ఏర్పాటు చేశారు. విజయవాడలో మొత్తం 20-25 కూడళ్లలో ఈ ఐటీఎంఎస్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తొలి దశ పనులు పూర్తయ్యాయి. కూడళ్లలో సిగ్నల్ లైట్లతోపాటు ఆ స్తంభాలపై సీసీ కెమెరాలుంటాయి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను గుర్తించి రికార్డు చేసుకుంటాయి. ఆ డేటా మొత్తం ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. దీన్ని పరిశీలించి అక్కడి సిబ్బంది వాహనదారులకు చలానా విధించి సందేశం పంపుతారు. ప్రస్తుతం డీసీపీ బంగ్లా, అప్సర కూడలితోపాటు మరో రెండు కూడళ్లలో ఐటీఎంఎస్ అమల్లోకి వచ్చింది.

వాహనదారులతో వాదనలు లేకుండా..

పోలీసులు నగరంలో ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయడం మొదలుపెట్టినప్పటి నుంచి వాహన తనిఖీల్లో నిత్యం వివాదాలు జరుగుతున్నాయి. ముందుగా హెల్మెట్లను తలపైకి ఎక్కించడం మొదలుపెట్టారు. ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేశారు. దీంతో హెల్మెట్ ధారణ 90 శాతానికి పెరిగినట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈనెల 1 నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలను భారీగా పెంచారు. కేంద్ర రవాణా శాఖ రూపొందించిన ఈ చట్టాన్ని 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. కూడళ్లలో వాహనదారులు, పాదచారుల్లో ఒక క్రమశిక్షణ తెచ్చేందుకు పోలీసులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. కొంతమంది జీబ్రా క్రాసింగ్ పైకి వచ్చి వాహనాలను ఆపుతున్నారు. మరికొంతమంది వెనుక ఉండే స్టాప్‌లైన్‌పైకి వస్తారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలన్నీ స్టాప్‌లైన్‌కు ముందుగానే ఆగిపోవాలి. కాస్మోపాలిటన్ నగరాల్లో స్టాప్‌లైన్‌ను తాకితే అక్కడుండే సీసీ కెమెరాలు రికార్డు చేస్తాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ పోలీసులు వీడియోవాల్‌పై గుర్తించి నేరుగా వాహనదారులకు జరిమానాల సందేశాలను పంపుతారు. ఇదే విధానాన్ని విజయవాడలోనూ అమలు చేస్తున్నామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలు స్టాప్‌లైన్‌కు ముందు ఆగాలి. ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్లే పాదచారులు జీబ్రాక్రాసింగ్ గీతలపై నడవాలి. స్టాప్‌లైన్ ఉల్లంఘనతో పాటు హెల్మెట్ ధరించకపోయినా, ఆటోడ్రైవర్లు ఖాకీ చొక్కా ధరించకపోయినా, నిషేధిత ప్రదేశంలో వాహనాలను నిలుపుదల చేసినా ఇక నుంచి కూడళ్లలోని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తామని సీపీ వెల్లడించారు. ఈ తరహా జరిమానాలను కాస్మోపాలిటన్ నగరాల్లో కాంటాక్ట్‌లెస్ చలాన్లుగా వ్యవహరిస్తారు.



క్యూఆర్ కోడ్ ఉపయోగించి అభిప్రాయాలు తెలపాలంటున్న కలెక్టర్

పీ4 కార్యాచరణలో భాగస్వాములు కండి..!

● ఆలోచనలు పంచుకోండి.. మార్పునకు నాంది పలకండి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సీఎం దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లోని 10 సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్యపేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని, ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని వివరించారు. సామాజికంగా, ఆర్థికంగా పైనున్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగునున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమన్నారు. దీనిపై ప్రజల సూచనలు తీసుకుంటామన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా హెచ్‌టీటీపీఎస్://స్వర్ణాంధ్ర.ఏపీ.జీఓవీ.ఇన్/పీ4 లింక్ ద్వారా ఈనెల 25లోగా అభిప్రాయాలు తెలియజేస్తే మీ సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఉత్కంఠగా క్రీడాపోటీలు

● 26వ ఇంటర్ పురుషుల కబడ్డీలో సెమిస్‌కు చేరిన పలు జట్లు

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిన అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 26వ ఇంటర్ పురుషుల క్రీడా పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఆదివారం కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. కబడ్డీలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడాకారులు గాయత్రి విద్య పరిషత్ మెడికల్ కళాశాలపై గెలిచి సెమీ ఫైనల్స్‌కు వెళ్లారు. నారాయణ డెంటల్ కళాశాల, కర్నూలు మెడికల్ కళాశాలపై, ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల ఎన్నారై విశాఖపట్నంపై, నారాయణ మెడికల్ కళాశాల మహారాజ్ మెడికల్ కళాశాలపై గెలుపొంది సెమిస్‌కు చేరారు. బాల్ బ్యాడ్మింటన్‌లో ఆంధ్ర మెడికల్ కళాశాల ఎన్నారై వైజాగ్‌పై గెలుపొందారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల కాటూరు మెడికల్ కళాశాలపై, పిన్నమనేని సిద్ధార్థ కళాశాల కర్నూల్ మెడికల్ కళాశాలపై గెలుపొందారు. వాలీబాల్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల కాటూరి మెడికల్ కళాశాలపై గెలుపొందగా, గౌతమ్ డెంటల్ కళాశాల ఎస్వీఎంసీ మెడికల్ కళాశాలపై పరాజయం పొందారు. రంగరాయ మెడికల్ కళాశాల ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలపై గెలుపొందారు. సిద్ధార్థ మెడికల్ కళాశాల జీఎంసీ మెడికల్ కళాశాలపై విజయం సాధించారు. నంద్యాల జీఎంసీ, ఒంగోలు జీఎంసీపై గెలిచారు. చిత్తూరు అపోలో కళాశాల, జీఎంసీ శ్రీకాకుళం కళాశాలపై గెలుపొందారు. కర్నూల్ మెడికల్ కళాశాల కోనసీమ కళాశాలపై గెలుపొందారు. సిద్ధార్థ కళాశాల జీఎస్ఎల్ డెంటల్‌పై గెలిచారు. వైజాగ్ ఎన్నారైపై ఆశ్రమం మెడికల్ కళాశాల గెలుపొందింది. గాయత్రి మెడికల్ కళాశాల పై గుంటూరు మెడికల్ కళాశాల విజయం సాధించింది. జీఎంసీ శ్రీకాకుళంపై రాజమండ్రి జీఎస్ఎల్ గెలుపొందింది. చెస్‌లో రంగరాయ మెడికల్ కళాశాల క్రీడాకరులు ఐదు రౌండ్లలో గెలిచి విన్నర్‌గా నిలిచారు. అనంతపురం మెడికల్ కళాశాల రెండో స్థానం, పిన్నమనేని సిద్ధార్థ 3వ స్థానంలో నిలిచింది. బాస్కెట్ బాల్‌లో ఎన్నారై మెడికల్ కళాశాలపై తిరుపతి ఎస్వీఎంసీ విజయం సాధించారు. నెల్లూరు ఏసీఎస్ఆర్ పై సిద్ధార్థ మెడికల్ కళాశాల గెలుపొందింది. ఆశ్రం కళాశాల గాయత్రి కళాశాలపై, కాటూరి మెడికల్ కళాశాల, విష్ణు డెంటల్ కళాశాలపై, కడప జీఎంసీ, మహారాజ్ మెడికల్ కళాశాలపై విజయం సాధించారు. అపోలో మెడికల్ కళాశాల, పిన్నమనేని సిద్ధార్థపై, మహారాజ్ మెడికల్ కళాశాల, ఆశ్రం మెడికల్ కళాశాలపై గెలుపొందారు. కోనసీమ కళాశాల, కాటూరి మెడికల్ కళాశాలపై, రాజమండ్రి జీఎస్ఎల్, వైజాగ్ ఏఎంసీపై విజయం సాధించారు.



కబడ్డీలో తలబడుతున్న క్రీడాకారులు

రమణయ్యనాయుడు నేటితరానికి స్ఫూర్తి

● మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బుద్దప్రసాద్ ● ఘనంగా కేవీఆర్ 135వ జయంతి వేడుకలు

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం తొలితరం రాజకీయాలకు ఆద్యుడైన కేవీ రమణయ్యనాయుడు నేటి యువ రాజకీయ నేతలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రావుబహద్దూర్, మాజీ ఎమ్మెల్యే, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రమణయ్య నాయుడు 135వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రమణయ్యనాయుడు కుటుంబ సభ్యులు విగ్రహ పునరుద్ధరణ చేపట్టిన నేపథ్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు కేవీ రమణయ్య నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బ్రిటీష పాలకులను ఎదురించిన న్యాయవాదిగా కేవీ రమణయ్యనాయుడు పేరు పొందారన్నారు. ఆయన విగ్రహం ఉండే సెంటర్‌కు ఆయన పేరు పెట్టేందుకు మునిసిపాలిటీలో తీర్మానం చేయిస్తామన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కేవీ రమణయ్య నాయుడు స్మృతి చిహ్నంగా ఒక ప్రాజెక్టును రూపకల్పన చేస్తే అందుకు కావాల్సిన స్థలం, నిధులు అందిస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు మాట్లాడుతూ ఆగస్టు 16న గౌతులచ్చన్న జయంతితో పాటు కేవీ రమణయ్య నాయుడు జయంతి కూడా ఏటా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అప్పట్లో రమణయ్య నాయుడుకు మంత్రి పదవి వచ్చినా జన్మభూమి బందరుకే సేవ చేస్తానని చెప్పారన్నారు. జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ రమణయ్య నాయుడు అందరికీ ఆదర్శమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ఈ కూడలికి రమణయ్య నాయుడు పేరు పెట్టాలని ప్రతిపాదించగా మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా అనుకూలంగా మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రమణయ్యనాయుడు 30 ఏళ్ల పాటు న్యాయవాదిగా ఉంటూ ఏ కేసునైనా అనర్గళంగా గెలిచేవారన్నారు. రమణయ్య నాయుడు కుటుంబ సభ్యులు కేవీ రమణమూర్తి, కొనకళ్ల బుల్లయ్య, డా. బీ ధన్వంతరీ ఆచార్య, పంతం గజేంద్ర, గోపు సత్యనారాయణ, వాలిశెట్టి మల్లి, న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు, బుల్లెట్ ధర్మారావు, గడ్డం రాజు, లంకిశెట్టి నీరజ, హసీంబేగ్, వీవీ ఫణికుమార్, సోడిశెట్టి బాలాజీ, పేర్ని కృష్ణమూర్తి, మాదివాడ రాము, పల్లపాటి సుబ్రహ్మణ్యం, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి రవీంద్ర చిత్రంలో ఎంపీ బాలశౌరి తదితరులు

ప్రయోజనాలు ఆగిపోతాయ్

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లారు. అప్పటికే వినోద్ ఊపిరి ఆగిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై వైద్యులు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) రాశారు. దీని ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేస్తారు. వినోద్ ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి పోలీసు కేసు లేకుండా చేయాలని కొంతమంది సతవిధాలా ప్రయత్నించారు. చివరికి పటమట పోలీసులు ఎమ్మెల్సీ ఆధారంగా కేసు నమోదు చేశారు. వినోద్ రాసిన లేఖను పోలీసులకు చేరకుండా జలవనరుల శాఖలో కొంతమంది చక్రం తిప్పారు.

ప్లాన్ 'బి' అమలు!

వినోద్ ఆత్మహత్య వ్యవహారం జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన గురించి రవ్వంత సమాచారాన్ని కూడా బయటకు పొక్కనీయకుండా చేయాలని కొంతమంది ప్రయత్నించారు. చివరికి ప్రభుత్వాసుపత్రి నుంచి విషయం బయటకు పొక్కింది. ఆ రోజునే ఈ ఘటనను కోల్డ్ స్టోరేజ్‌లోకి పంపాలన ప్రణాళిక వేశారు. ఇది విఫలమవ్వడంతో జలవనరుల శాఖలోని ఒక వర్గం ప్లాన్ 'బి' అమలు చేస్తోంది. పోలీసులు కేసు నమోదు చేయడంతో లేఖలో పేర్లు ఉన్న వాళ్లంతా కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సి ఉంది. ముఖ్యంగా జేఈ శ్రీరామ జనార్ధన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాతను పిలిపించి విచారించడానికి పటమట పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో వినోద్ కుటుంబానికి సుతిమెత్తని బెదిరింపులు వెళ్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కృత్రిమ మేథ పోటీల్లో 'పేట' విద్యార్థి ప్రతిభ

● 5వేల యూరోల క్యాష్‌ప్రైజ్ సొంతం

జగ్గయ్యపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఆర్సీ కళాశాల పూర్వ విద్యార్థి తిక్కిశెట్టి ధృతి స్పెయిన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నిర్వహించిన పోటీల్లో తన బృందంతో కలిసి రెండో స్థానం నిలిచి 5వేల యూరోల నగదు బహుమతిని గెలుపొందింది. సోప్రా స్టెరియా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ మన దేశంలోని నోయిడాలో నిర్వహించిన ప్రిలిమినరీ పోటీల్లో 512 టీంల నుంచి ధృతి టీం అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. అక్కడ రెండోస్థానం సాధించింది. సోప్రా కంపెనీ ధృతి బృందానికి, గైడ్ ప్రొఫెసర్లకు స్పెయిన్‌కు రానుపోను ఖర్చులు, వసతి అందజేసింది. ధృతి టెన్త్ వరకు చేగు విద్యాలయం, ఇంటర్ జేఆర్సీలో పూర్తి చేసింది. హైదరాబాద్ మహేంద్ర- ఇకోల్ వర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా ధృతిని, ఆమె కుటుంబసభ్యులను జేఆర్సీ విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ/కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, ప్రిన్సిపాల్స్ అబ్బులు, కే.ఎస్ రమేష్, పాలకవర్గం అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి

● రంగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో పలువురి డిమాండ్

గాంధీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని ఆయన పేరును కృష్ణాజిల్లా లేదా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పెట్టాలని వంగవీటి మోహనరంగా సోషల్ ఆర్గనైజేషన్ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రంగా అభిమానుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగా-రాధా మిత్రమండలి నేత ముళ్లపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోహనరంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజానేతగా పేదల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. గన్నవరం విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రంగా తనయుడు టీడీపీ నేత రాధాకు ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి ఇవ్వాలని వంగవీటి మోహనరంగా సోషల్ ఆర్గనైజేషన్ నేతలు డిమాండ్ చేశారు. త్వరలో సీఎం, డిప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కలిసి వినతిపత్రాలు అందించేలా కార్యచరణ చేపడతామన్నారు. ఆర్గనైజేషన్ నేత అడపా ప్రతాప్‌చంద్, న్యాయవాదులు రాంపిళ్ల శ్రీనివాసరావు, పిల్లా రవి, చంద్రమౌళి, కాపునేతలు పచ్చిపల్ల రాజా, జయప్రకాష్, గెడ్డేటి జయ, విశ్వకర్మ సంఘం నేత పట్నాల హరి, బీజేపీ నేత గోపాలకృష్ణ, కాంగ్రెస్ నేత నరహరిశెట్టి నరసింహారావు, రంగిశెట్టి పార్వతీ పాల్గొన్నారు.

యువతను నమ్మించి మోసం చేసిన కూటమి

వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్

గుణదల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యువతకు ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి కూటమి నేతలు అధికారంలోకి వచ్చారని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. యువతకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నగరంలో ఫీజు పోరు పేరుతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు అవినాష్ తెలిపారు. మేరకు పోస్టర్ ఆవిష్కరణ గుణదలలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ నేత పోతిన మహేశ్ పలు అభ్యంతరకర వాఖ్యలు చేశారు. జగన్మోహన్ రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తున్నారంటే వారి నాలికకు కొవ్వుపట్టిందని అర్థమని అలాంటి నాలికపైనున్న కొవ్వును కరిగిస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	160
చికెన్ స్కిన్‌లెస్	170

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఎంఎస్‌ఎంఈ రుణాలపై అవగాహన ఉండాలి

విద్యాధరపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రుణాల పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంఎస్‌ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎం.గురునాథం అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పశ్చిమ నియోజకవర్గంలోని కొత్త అమ్మవారి గుడి వద్ద నగరాల సామాజిక వర్గ సంఘాలకు, విశ్వ బ్రాహ్మణులకు ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద ఎంఎస్‌ఎంఈ రుణాలపై అవగాహన సదస్సు జరిగింది.

ఎల్‌ఐసీ కాలనీలో సమస్యల తిష్ఠ

- పూడుకుపోయిన డ్రెయిన్లు
- ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు
- గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- పట్టించుకోని నాయకులు.. అధికారులు
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు


వాటర్ ట్యాంక్ సమీపంలో ఖాళీస్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, పచ్చగడ్డి

(భారతీనగర్ - ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజక వర్గంలోని నాలుగో డివిజన్ పరిధిలో ఎల్‌ఐసీ కాలనీలో సమస్యలు కొలువై యున్నాయి. ఐటీఐ కాలేజీ సమీపంలో ఐదో నెంబరు రోడ్డును అనుకుని ఉన్న ఈ కాలనీలోని ప్రధాన సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో డ్రెయిన్‌ల లో మురుగు ప్రవహించకపోవడంతో దుర్గంధం వెద జల్లుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, ఇతర వ్యర్థాలు, గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు, దుర్వాసన వెదజల్లుతున్న ప్రధాన డ్రెయినేజీలు వంటి సమస్యలు కాలనీలోని ప్రజలను పట్టి పీడిస్తున్నాయి.

ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగునీరు చేరడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల గురించి యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాటిలో పిచ్చి మొక్కలు, పచ్చగడ్డి పెరిగి ప్రమాదకరంగా మారాయి. కొంత కాలంగా కాలనీలో ఉన్న సైడ్ కాల్వలు మొత్తం పూడికతో నిండిపోవడం వల్ల, చిన్నపాటి వర్షంపడినా అంతర్గతరోడ్లు నీటితో మునిగిపోతున్నాయి. కాలనీలోని ఖాళీ స్థలాలను వీధికుక్కలు ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకున్నాయి. రాత్రి సమయంలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి.


పూడుకుపోయిన డ్రెయిన్లు

రూరల్ గ్రామాల్లో గోకులాలు ప్రారంభం

విజయవాడ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధులతో విజయవాడ రూరల్ గ్రామాల్లో నిర్మించిన గోకులాలను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ప్రారంభించారు. అప్పారావుపేట, మంగళాపురం, పాతపాడు గ్రామాల్లో ముగ్గురికి స్వయం ఉపాధి కింద పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ. 2.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న గోకులాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణప్రసాద్, టీడీపీ నేతలు గుజ్జర్లపూడి బాబురావు, గొడ్డళ్ల చిన్న రామారావు, కొండేటి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 8.30 నుంచి 12 వరకు కనకదుర్గ కాలనీ, పంట కాల్వ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, రైతుబజార్ రోడ్డు, వంద అడుగుల రోడ్డు, మారుతీకాలనీ, పోలీస్ స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


సాధికార సాధకుల సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

కుటుంబ సాధికార సాధకుల నియామకంపై దృష్టి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికార సాధకుల నియామకంపై రాష్ట్ర నాయకత్వం అధిక ప్రాధాన్యతనిచ్చి అమలు చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సారథుల నియామక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారథులు ఎంతో కీలకమన్నారు. ప్రతి 60ఓట్ల రేంజ్‌కు ఇద్దరు ఉండాలన్నారు. అలాగే స్టేట్ కమిటీ, పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ కమిటీ, డివిజన్ కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జి ఉండాలన్నారు. వారికి కేటాయించని ఓటర్లకు వారు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. మంత్రి నారా లోకేశ్ దీనిని నిచితంగా పరిశీలిస్తున్నారన్నారు. సందేహాలుంటే పార్టీ కార్యా లయంలో సంప్రదించాలన్నారు. చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, చెన్నుపాటి కాంతిశ్రీ, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కార్మికుల జీవనోపాధిని కాపాడండి

పటమట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల అడ్డా వద్ద నగర సుందరీకరణ పేరుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయటాన్ని సీఐటీయూ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి రోజు వారి కూలి పనుల కోసం పిల్లర్ 10, 11 వద్ద వేలాది మంది కార్మికులు నిలబడి ఉంటారు. ఆ ప్రాంతాన్ని చుట్టూ కంచె వేసి క్లోజ్ చేసేందుకు మున్సిపాలిటీ ప్రయత్నం చేస్తుందని, ఇది తగదని కార్మిక నాయకులు అంటున్నారు. ఆ మేరకు కార్మికుల జీవనోపాధిని కాపాడాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ నగర అధ్యక్షుడు వి.బి.రాజు మాట్లాడుతూ గతంలో అధికారులతో మాట్లాడి కార్మికులకు ఇక్కడ కనీస వసతులు ఏర్పాటు చేయాలని అనుమతులు తెచ్చుకున్నామన్నారు. ప్రభుత్వం ఇక్కడ కంచె వేయాలని చూడటం బాధకరమన్నారు. మాజేటి మల్లేశ్వరరావు, బి.దుర్గారావు, వి.రాంబాబు, డి.వెంకన్న, నరిసింహారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులకు ఆశీర్వాచనం అందజేస్తున్న సజ్జా రత్నకుమార్, ప్రిన్సిపాల్ జ్యోతి

డిప్లమో సర్టిఫికెట్ల ప్రదానం

ఆటోనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మానవత్వ విలువల బోధన మెస్సీయ బైబిల్ కాలేజీ లక్ష్యమని మెస్సీయ ఫెలోషిప్ చైర్మన్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ బైబిల్ కాలేజీ డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులు ప్రజల్లో ఆధ్యాత్మిక పరివర్తన తీసుకురావాలని సూచించారు. మెస్సీయ ఫెలోషిప్ వ్యవస్థాపక చైర్మన్ ఎలియాజర్ మాట్లాడుతూ, బైబిల్ విద్యను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. డిప్లమో కోర్సుకు ఇంటర్మీడియెట్ విద్యార్హత, సర్టిఫికెట్ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులన్నారు. బైబిల్ కాలేజీ ప్రిన్సిపాల్ సజ్జా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేపై వెల్‌కమ్ జట్టు విజయం

విజయవాడ(స్పోర్ట్స్)మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బీ లీగ్ పోటీల్లో భాగంగా ఆదివారం రైల్వే, వెల్‌కమ్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన రైల్వే జట్టు 40.2ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 161పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెల్‌కమ్ జట్టు 24.3ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 164పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో భాను వరప్రసాద్ 52పరుగులు, వరణ్ సాత్విక్ 54పరుగులు చేశారు.


సున్నపుబట్టీల సెంటర్ శ్మశానంలో కాటికాపరులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, క్రాంతికుమార్

కాటికాపరుల సమస్యల పరిష్కారం కోసం 11న ధర్నా

మొగల్రాజపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వాటికలోని పనిచేసే కాటి కాపరులు, పనివాళ్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న ధర్నా చేయనున్నట్టు కులవివక్షపోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, నగర అధ్యక్షుడు గుండిమెడ క్రాంతికుమార్ తెలిపారు. సున్నపు బట్టీల సెంటర్‌లోని దళిత క్రైస్తవ శ్మశాన వాటికలను ఆదివారం సందర్శించి అక్కడ పని చేస్తున్న వారితో మాట్లాడారు. వృత్తి సామగ్రితోపాటు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

పీపీపీ మోడల్ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి

ప్రభుత్వాసుపత్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కొత్త వైద్య కళాశాలల్లో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) నమూనా అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎంవీ రమణయ్య, టి.కామేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్య సంరక్షణలో ముఖ్యమైన వైద్యవిద్యను పీపీపీ నమూనా ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ఏపీలో పౌరులకు ఆరోగ్య లభ్యత, వైద్య ఖర్చులను భరించే సామర్థ్యం, ప్రాథమిక హక్కు గురించి తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని గతంలోనే వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. గతంలో ప్రభుత్వం ప్రారంభించిన 17 వైద్య కళాశాలల్లో పదింటిని పీపీపీ మోడల్‌లోకి మార్చడం, ఈ చట్టం కింద కొత్త కళాశాలలను స్థాపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయాలని వారు పేర్కొన్నారు. ప్రజల వైద్య ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారిద్దరూ కోరారు.

కృష్ణానదిలో యువకుడి మృతదేహం

వన్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన యువకుడు కృష్ణానదిలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎనికేపాడు ట్యాంక్ బజార్‌కు చెందిన పొట్నూరు జగదీశ్వర్‌రావు కుమారుడు వెంకట రమణ (23) వన్‌టౌన్ ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చి అదృశ్యమైనట్లు శనివారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కృష్ణానదిలో గాలించగా 48వ ఖానా వద్ద వెంకట రమణ మృతదేహం లభించింది. పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, డాక్టర్ బత్తిన ప్రవీణ, చలపాటి జయంత్ తదితరులు

సేఫ్ విజన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

భారతీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో అన్ని వర్గాలవారికి అత్యాధునిక సౌకర్యాలతో సేవలు అందించనున్నట్టు సేఫ్ విజన్ మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బత్తిన ప్రవీణ, చలపాటి జయంత్, స్వర్ణ తెలిపారు. మహానాడు రోడ్డు సమీపంలో నాగార్జునర్ నగర్ కాలనీలో సేఫ్ విజన్ మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బత్తిన ప్రవీణ, చలపాటి జయంత్, స్వర్ణ మాట్లాడుతూ, ఆసుపత్రిలో కేటరాక్ట్, లాసిక్, రెటీనా, పీఆర్‌కే వంటి పలు రకాల పరీక్షలకు లాబోరేటరీ వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. వచ్చేనెల 9వతేదీ వరకు ఉచిత కన్సల్టేషన్ కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రాధికారెడ్డి, ఆసుపత్రి వైద్యులు, పారిశ్రామికవేత్తలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణలంక 21వ డివిజన్‌లో ప్రజాచైతన్య యాత్రలో ప్రసంగిస్తున్న సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్

కృష్ణలంకలో సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

కృష్ణలంక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 21వ డివిజన్‌లో సీపీఎం ప్రజా చైతన్యయాత్రను ఆదివారం ప్రారంభించింది. రాష్ట్రంలోని స్థానిక సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడేందుకు మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు ఈ ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికై పోరాడేందుకు కృషి చేస్తామన్నారు. కృష్ణలంక ఒకనాడు మోడల్ డివిజన్‌గా, నగరంలోనే అభివృద్ధి చెందిన డివిజన్‌గా అనేక అవార్డులు పొందిందన్నారు. ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కుకొందన్నారు. అంతర్గత రోడ్డు తవ్వేసి తిరిగి వేయకుండా పాచ్ వర్క్‌లు చేశారన్నారు. రోడ్లలోని మ్యాన్ హోల్స్ రోడ్డు కంటే ఎత్తు తక్కువగా వుండటం, కొన్ని చోట్ల ఎత్తుగా రావడం వలన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీర్ఘకాలంగా ఈ సమస్య ఉన్నా పాలకులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రిటైనింగ్ వాల్ పూర్తి అయినా ఈ ప్రాంత డ్రెయినేజీ వెళ్లేందుకు రిటైనింగ్ వాల్ పక్కన అవుట్‌పాల్ నిర్మించడంలో పాలకులు విఫలమయ్యారని కాశీనాథ్ అన్నారు. జీవో 119 రివర్ కన్వర్షన్ యాక్ట్ కింది 100 మీటర్ల లోపు ఇళ్లకు బిల్డింగ్ ప్లాన్‌లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేంతవరకు ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని కాశీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ రమణ, శివాజీ, శ్రీరాములు, నాగరాజు, చెన్నకేశవ పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

వన్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చంద్రబాబు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ బి.సత్యబాబు అన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తపేట పరిధిలోని 51, 52 డివిజన్‌లలో కార్మికుల జనరల్ బాడీ సమావేశం సర్కిల్ వన్ కార్యదర్శి వి.సాములు అధ్యక్ష తన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయకుండా కాంట్రాక్ట్‌లకు కట్టబెట్టే విధానం కార్మికులు తిప్పికొట్టాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పించన్లు అమలు చేయాలన్నారు. మహిళా కార్మికులను మోసంచేసే ముఖ్యమంత్రి మహిళా దినోత్సవం పొగడ్తలు, నాటకాలు ఆపాలన్నారు

దిక్సూచి DIKSUCHI

విదేశీ భాషా కోర్సులు ఇక్కడ చదవొచ్చు



భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదు. ఆధునిక కాలంలో అది కెరీర్ కూడా. మాతృభాషతోపాటు విదేశీ భాషలు నేర్చుకుని అద్భుతమైన కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎక్కువ భాషలు వస్తే అన్ని అవకాశాలు పెరుగుతాయి కూడా. భారతదేశంలో విదేశీ భాషలను ప్రైవేటు సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా అందిస్తున్నాయి. ఇందులో బిగినర్ కోర్సులు, ఇంటర్మీడియెట్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు, స్పెషలైజ్డ్ కోర్సులు ఉంటాయి. బిగినర్ కోర్సులు కొంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తే ఇంటర్మీడియెట్ కోర్సులు భాషా పరిజ్ఞానాన్ని పెంచుతాయి. అడ్వాన్స్‌డ్, స్పెషలైజ్డ్ కోర్సులు అయితే కెరీర్‌కు కావాల్సిన భాషా సంపదను కలిగిస్తాయి. మన దేశంలో భాషకు సంబంధించి కోర్సులు అందించే ప్రభుత్వ వర్సిటీల్లో కొన్ని....

ఢిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, పర్షియన్, మోడరల్ అరబిక్, పాలీ, టిబెటన్ భాషా - సాహిత్యంలో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. https://www.du.ac.in/

బనారస్ హిందూ యూనివర్సిటీ: పలు విదేశీ భాషలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను బనారస్ హిందూ యూనివర్సిటీ అందిస్తోంది. ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, చైనీస్ భాషలు ఇందులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. https://www.bhu.ac.in/

గురునానక్‌దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్: ఈ వర్సిటీలో ఫ్రెంచ్‌లో ఫుల్‌టైమ్ డిప్లొమాలు, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్ భాషల్లో పార్ట్‌టైమ్ డిప్లొమాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్రెంచ్‌లో పార్ట్‌టైమ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కూడా అందుబాటులో ఉంది. వీటికి దరఖాస్తు చేయడానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. https://www.gndu.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ: భాషలకు సంబంధించిన పలు కోర్సులను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. జర్మన్, రష్యన్, స్పానిష్, జపనీస్, కొరియన్, చైనీస్ తదితర భాషలకు సంబంధించిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ ఉన్నాయి. www.jnu.ac.in/main/

సీఫెల్, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఉన్న 'సీఫెల్' పలు యూరోపియన్ భాషలకు సంబంధించిన కోర్సులను అందిస్తుంది. ఇందులో ఫ్రెంచ్, ఫ్రాన్సోఫోన్ స్టడీస్, జర్మనిక్ స్టడీస్, హిస్పానిక్ స్టడీస్, లాటిన్, రష్యన్‌కు స్టడీస్ తదితరాలపై పలు కోర్సులు ఉన్నాయి. https://www.efluniversity.ac.in

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో డిప్లొమా అడ్మిషన్లు

హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్'(సీఐటీడీ)లో 2025-26 సంవత్సరానికి కింది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. 1968లో ఏర్పాటైన కేంద్రప్రభుత్వ సంస్థ ఇది. ఇందులో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఎంఈ, ఎంటెక్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సులు	సీట్లు
• డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)	60
• డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)	60
• డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)	60
• డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)	60

(డీటీడీఎం కోర్సు నాలుగు సంవత్సరాలు - మిగిలిన కోర్సు మూడు సంవత్సరాలు)

విద్యార్హతలు: డీటీడీఎం కోర్సు చేయాలంటే కనీసం 50 శాతం మార్కులతో పదిపాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

వయోపరిమితి: 2025 మే 22 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో చేయవచ్చు.

పరీక్ష విధానం: పదో తరగతి స్థాయిలో మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతోపాటు, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 22. **ప్రవేశ పరీక్ష:** 2025 మే 25

Contact Details: Admission Desk at Diploma Block

Ph: 9502405170, 040-29561795 **E-Mail:** training@citdindia.org,

Website: https://www.citdindia.org

ఐఐఐటీ శ్రీసిటీలో ఎంటెక్



వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్

గ్లోబల్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ 2026 నాటికి 64 బిలియన్ డాలర్లు చేరుకుని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని మెకిన్సే కంపెనీ అంచనా వేసింది. అందువల్ల వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుందని చెబుతోంది. అలాగే 2025 సంవత్సరం చివరి నాటికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) మార్కెట్ రెండు బిలియన్ డాలర్లు ఉండవచ్చని నాస్కామ్ చెబుతోంది. అటానమస్ వెహికిల్స్ డ్రోన్లు తదితరాల కారణంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, అటానమస్ టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్నాయి. ఇక సైబర్ సెక్యూరిటీ గురించి చెప్పాల్సిన పని లేదు. 2025 చివరి నాటికే ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో తమ కంపెనీ సైబర్ సెక్యూరిటీ బడ్జెట్‌ను అన్ని కంపెనీలు రెండింతలు చేయనున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని శ్రీసిటీలో ఉన్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'(ఐఐఐటీ) ఎడ్ కంపెనీ టీమ్ లీజ్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. వీఎల్ఎస్ఐ, ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీల్లో ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఎంటెక్ - వీఎల్ఎస్ఐ: సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్, అనలాగ్ సర్క్యూట్ డిజైన్, సిస్టమ్ ఆన్ చిప్ డెవలప్‌మెంట్‌పై కోర్సు ఉంటుంది. దీనితోపాటులో పవర్ వీఎల్ఎస్ఐ, నానో స్కేల్ డివైజెస్, మిక్స్‌డ్ సర్క్యూట్ డిజైన్‌లపై ఫోకస్ ఉంటుంది. సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ రోల్స్ కోసం పనిచేసేలా విద్యార్థులను తయారు చేస్తారు.

ఎంటెక్ - ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్: ఐవోటీ ఆర్కిటెక్చర్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అటానమస్ డెసిషన్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, 5జీ/6జీ టెక్నాలజీస్, డిజిటల్ ట్విన్ అప్లికేషన్స్ తదితరాల్లో ప్రావీణ్యం ఉండేలా రూపొందిస్తున్నారు.

ఎంటెక్-సైబర్ సెక్యూరిటీ: క్రిప్టోగ్రఫి, ఎథికల్ హాకింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, ఏఐ ఆధారిత థ్రెట్ డెసిషన్ తదితరాల్లో నాలెడ్జ్ ఉండేలా రూపొందించారు. బ్లాక్‌చైన్ అప్లికేషన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ లాంటి వాటిలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్ వచ్చేలా చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితరాల సైబర్ సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ పరిష్కరించేలా ఉంటారు. 2025 జూలై నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయి. సంవత్సరంలో ఒక వారం క్యాంపస్‌కి రావాల్సి ఉంటుంది. మిగిలిన క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ డిగ్రీని పూర్తిచేయాలి. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులకు 50 శాతం చాలు. అభ్యర్థులకు గేట్ స్కోరు తప్పనిసరి కాదు.

ఫీజు: సెమిస్టరుకు రూ. 65000/- చొప్పున నాలుగు సెమిస్టర్లకి కలిపి రూ. 2,60,000/- అవుతుంది.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్, ఫోన్‌లను సంప్రదించవచ్చు.

040-49170726, admission@iiitsricityonline.com

https://cep.digivarsity.com/iiit-sricity/

SCHOLARSHIP ALERT

Narotam Sekhsaria Scholarships for Higher Studies

Description: Narotam Sekhsaria Scholarships for Higher Studies 2025-26 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation that aims to provide financial assistance to outstanding Indian students aspiring to pursue higher education at prestigious institutions in India and abroad.

Eligibility: Applicants must be an Indian national residing in India and a graduate from an accredited Indian university. They should be under 30 years old as of 31st January 2025. They must plan to pursue a postgraduate degree in top-ranking institutions in India or abroad, starting in the Fall 2025.

Prizes & Rewards: The scholarship offers interest-free loans as financial assistance including mentorship support.

Last Date: 17-03-2025 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/NSSP1

India High Fliers Undergraduate



Description: India High Fliers Undergraduate Scholarships 2025 is provided by the University of Birmingham to students pursuing selected full-time undergraduate programs at the university. A total of 20 scholarships will be available for the academic year 2025-26.

Eligibility: Applicants must be a domiciled resident of India holding an offer for a full-time undergraduate program. They must be classified as overseas fee-payer student.

Prizes & Rewards: The scholarship offers an amount of GBP 5,000 for the first year of undergraduate studies.

Last Date to Apply: 31-05-2025

Application mode: Offline applications via local representatives and partnered schools

Short Url: www.b4s.in/aj/IHFS1

Vahani Scholarship

Description: The Vahani Scholarship for 2025-26 is offered by the Vahani Group to Class 12 students. This scholarship aims to support students from economically disadvantaged backgrounds in India to pursue their higher education.

Eligibility: Open to Indian citizens currently studying in Class 12 and appearing for the final board examination next year. Applicants must have secured at least 85% marks in Class 10. The applicant's annual family income must be less than 300,000 from all sources.

Prizes & Rewards: Full tuition fees, stipend, and other benefits. ***Last Date:*** 01-12-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/VAHS1

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

షూటింగ్ పూర్తి



కంగనా రనౌత్, మాధవన్ జంటగా మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రధారులుగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిత్రబృందంతో సెట్‌లో దిగిన ఫొటోలను షేర్ చేశారు. త్వరలోనే టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రం తర్వాత కంగన, మాధవన్ కలసి నటించిన చిత్రమిది. అలాగే 'తలైవి' చిత్రం తర్వాత మరోసారి ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగన నటించారు. తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కొత్త ప్రయాణం మొదలు



నటి అభినయ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించాననీ, త్వరలో అతన్ని పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె తెలిపారు. ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినయ తెలిపారు. కాబోయే భర్తతో కలసి ఆలయంలో గంట కొడుతున్న ఫొటోను షేర్ చేసి, 'కొత్త ప్రయాణం మొదలైంది' అని చెప్పారు. అయితే కాబోయే భర్త వివరాలు, పెళ్లి ఎప్పుడు జరగబోతోంది అనే విషయాలను ఆమె తెలపలేదు. పలు దక్షిణాది సినిమాల్లో నటించిన అభినయ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివ శంభో' తదితర చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్నారు.

భయానక అనుభవాల కథ



యదార్థ సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ - ఆర్వీ ప్రొడక్షన్స్ బేనర్‌పై గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో రవిశంకర్ వర్మ నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్యదేవి జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పలు భారతీయ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఎదుర్కొన్న భయానక అనుభవాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఓ మంచి సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని రవిశంకర్ చెప్పారు.



శ్రీలీలకు చిరంజీవి కానుక

నటి శ్రీలీలకు చిరంజీవి ఓ విలువైన కానుకను బహూకరించారు. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా సెట్స్‌లో శ్రీలీల సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుర్గాదేవి ప్రతిమ ఉన్న ఓ వెండి శంఖాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు చిరంజీవి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు శ్రీలీల. భారీ బడ్జెట్‌తో వంశీ, విక్రమ్, ప్రమోద్ 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కూడా ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు.

చరిత్రలో నిలిచిపోయే చిత్రం...



'మల్లేశం', '8 ఏఎమ్ మెట్రో' చిత్రాల దర్శకుడు రాజ్ రాచకొండ. ఆయన దర్శకత్వంలో కొత్త చిత్రం రాబోతోంది. నటుడు రానా దగ్గుబాటి సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా, స్టూడియో 9తో కలసి నిర్మిస్తోంది. తేజ, తన్మయి, ఝాన్సీ, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1990ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు '23' అనే టైటిల్‌ను ఖరారు చేసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ "ఈ సినిమా మానవ హక్కుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి గురైన వారికి అండగా ఉంటుంది. తప్పు చేయడం తప్పని చెప్పడంతో పాటు హింసకు వ్యతిరేకంగా ఉంటుంది" అని అన్నారు. "ఈ సినిమాను ప్రేక్షకులు వెతుక్కుంటూ వచ్చి చూస్తారు. చరిత్రలో నిలబడిపోతుంది" అని నటి ఝాన్సీ చెప్పారు.

స్పెషల్ సాంగ్‌తో సిద్ధమా?

సినిమాల్లో కథానాయిక పాత్రల్లో అలరించడమే కాదు, అప్పుడప్పుడూ రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తుంటారు తారామణులు. జనాల్లో క్రేజ్ పెంచడమే కాకుండా సినిమా విజయానికీ దోహదపడుతుంటారు. తాజాగా అగ్రహీరోలతో ప్రత్యేక గీతాలు చేస్తున్నారంటూ కొంతమంది హీరోయిన్ల పేర్లు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. వారెవరో తెలుసుకుందాం.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజాసాబ్'. ఈ హారర్ థ్రిల్లర్‌లో మాంచి జోష్‌తో నిండిన ప్రత్యేక గీతం ఉందట. ఈ పాటలో స్టెప్పులేసేందుకు ఓ స్టార్ హీరోయిన్ అయితే బావుంటుందని భావించిన చిత్రబృందం నయనతారని సంప్రదించారని టాక్. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో ప్రభాస్‌కు జంటగా 'యోగి' సినిమాలో హీరోయిన్‌గా నటించారు నయనతార. ఇక 'యానిమల్' సినిమాలో అందాల ఆరబోతతో అలరించిన త్రిప్తి డిమ్రీని సైతం మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీరిలో ఎవరు ఫైనల్‌గా పాటలో కనపడతారనేది తెలియాల్సి ఉంది.

ఎన్టీఆర్.. హృతిక్‌తో

2022లో వరుణ్‌ధావన్ హీరోగా నటించిన 'భేడియా' చిత్రంలో 'తుమ్‌కేశ్వరీ' అనే ప్రత్యేక గీతంలో మెరిశారు శ్రద్ధా. 'పుష్ప 2'లో 'కిస్సిక్' సాంగ్ కోసం మొదట శ్రద్ధాని సంప్రదించినా పారితోషికం తక్కువని ఆమె అంగీకరించలేదు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'లో ఆమె స్పెషల్ సాంగ్ చేయబోతున్నారట. 2019లో విడుదలై సూపర్ హిట్ సాధించిన 'వార్'కు ఇది కొనసాగింపు. ఈ సినిమాపై తారస్థాయిలో ఉన్న అంచనాలను మరింత పెంచేలా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందుకోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నారు. 'స్త్రీ 2'తో ఇండస్ట్రీ హిట్ కొట్టిన శ్రద్ధా కపూర్‌ను ఈ పాట కోసం సంప్రదించారని టాక్. మంచి డ్యాన్సరైన శ్రద్ధా తన స్టెప్పులతో.. ఎన్టీఆర్, హృతిక్ ఎనర్జీని పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేస్తారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారట.

ఒకేసారి రెండు చిత్రాల్లో..

'గేమ్ ఛేంజర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కియారా అడ్వాణీ. యశ్ కథానాయకుడిగా 'ముఝూన్' ఫేమ్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'సలార్' చిత్రానికి సీక్వెల్‌లో కీలక పాత్రతో పాటు ప్రత్యేక గీతంలో కియారా తళుక్కున మెరవనున్నారనే టాక్ నడుస్తోంది. 2022లో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'గోవింద్ మేరా నామ్' చిత్రంలో 'బిజిలీ' అనే ప్రత్యేక గీతంలో నటించారు కియార.

సీక్వెల్‌లోనూ ఛాన్స్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్' సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో తమన్నా భాటియా చేసిన 'నువ్వే కావాలయ్యా' ప్రత్యేక గీతం పెద్ద హిట్ అయింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌లో తమన్న పాత్ర నిడివిని పెంచడంతో పాటు ఆమెతో ప్రత్యేక గీతం ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవలే తమన్న 'స్త్రీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేయడం.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. ఆ సెంటిమెంట్ కలిసొస్తుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారట మేకర్స్.

ఓజీ కోసం రాధిక

'డీజే టిల్లు' చిత్రంతో యువతరాన్ని ఆకట్టుకున్న కథానాయిక నేహా శెట్టి. ఆ చిత్రంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ భామకు ఓ సూపర్ ఆఫర్ వచ్చింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ప్రత్యేక గీతం కోసం నేహా శెట్టిని ఎంపిక చేశారు. అయితే, ఇందులో ఆమె కేవలం ఓ పాటకే పరిమితమవుతారా లేదా కీలక పాత్రలో నటిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

మరోసారి ప్రత్యేక గీతంలో

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'రెట్రో'. మే 1న విడుదలవనున్న ఈ సినిమాలో శ్రియ ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేశారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పవన్‌కల్యాణ్ నటించిన 'పులి'.. వెంకటేశ్ నటించిన 'తులసి'.. తరుణ్ నటించిన 'సోగ్గాడు'.. ప్రభాస్ నటించిన 'మున్నా' వంటి పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్నారు శ్రియ.



వన్డే చరిత్రలో అత్యధికంగా 15 సార్లు వరుసగా టాస్ ఓడిన జట్టుగా భారత్. 2011-13 మధ్య నెదర్లాండ్స్ 11సార్లు వరుసగా టాస్ కోల్పోయింది.

1 

చాంపియన్స్ ట్రోఫీ ఓ ఎడిషన్‌లో అత్యధిక స్కోరు సాధించిన కివీస్ ప్లేయర్‌గా రచిన్ రవీంద్ర. మొత్తం 263 పరుగులు చేసిన రచిన్.. 2017 టోర్నీలో విలియమ్సన్ 244 పరుగుల రికార్డును అధిగమించాడు. కాగా, ఓవరాల్‌గా ఓ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా వెస్టిండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ (474 పరుగులు) టాప్‌లో ఉన్నాడు.

2 భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రెండో ఆటగాడిగా కోహ్లీ. మూడు ఫార్మాట్లలో కలిపి విరాట్ 550 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కాగా, సచిన్ 664 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. 538 మ్యాచ్‌లతో ధోనీ, 509 మ్యాచ్‌లతో ద్రవిడ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.



చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక పరుగులు సమర్పించుకొన్న రెండో భారత బౌలర్‌గా షమి. 9 ఓవర్లు బౌల్ చేసిన షమి 8.20 ఎకానమీతో 74 పరుగులిచ్చి.. ఓ వికెట్ పడగొట్టాడు. 2013 టోర్నీలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఉమేశ్ యాదవ్ 10 ఓవర్లలో 1/75 టాప్‌లో ఉన్నాడు.

5 టోర్నీలో ఎక్కువ జీవనదానాలు లభించిన ఆటగాడిగా రచిన్. అతడు ఐదుసార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్నాడు. ఫైనల్ మ్యాచ్‌లోనే షమి, అయ్యర్ రెండుసార్లు రచిన్‌కు లైఫ్ ఇచ్చారు.

దుబాయ్‌లో ధూంధాం

ప్రైజ్‌మనీ భారత్‌కు - రూ. 19.4 కోట్లు
న్యూజిలాండ్‌కు - రూ. 9.7 కోట్లు

మనమే చాంపియన్స్



గతేడాది టీ20 వరల్డ్‌కప్.. తాజాగా మన ఖాతాలో మరో ఐసీసీ టైటిల్. ఎప్పుడో పుష్కర కాలం కింద దక్కిన చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) తిరిగి టీమిండియా గూటికి చేరింది. అజేయ ఆటతీరుతో, అన్ని విభాగాల్లోనూ అదరగొడుతూ వహ్వా అనిపించుకున్న రోహిత్ సేన మూడో సీటీని సగర్వంగా అందుకుంది. అయితే ప్రమాదకర న్యూజిలాండ్ ఫైనల్లో అంత సులువుగా పట్టు వీడలేదు. భారత స్పిన్నర్ల ధాటికి ఆ జట్టు చేసింది 251 పరుగులే. ఛేదనలో రోహిత్ ధనాధన్ ఆటతీరుతో 17 ఓవర్లలోనే భారత్ స్కోరు 100కి చేరింది. ఈ దశలో సునాయాస విజయం ఖాయమనిపించినా.. మధ్య ఓవర్లలో పోటీలోకి వచ్చిన కివీస్ ఆటను రసవత్తరంగా మార్చింది. 31-40 ఓవర్ల మధ్య 55 పరుగులే ఇచ్చి గుబులు రేపింది. కానీ శ్రేయాస్, రాహుల్ సంయమన ఆటతీరు చూపారు. చివరికి జడేజా విన్నింగ్ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించిన భారత్.. కోట్లాది మంది అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది.

4 ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లను చేజార్చారు. ఓ నాకౌట్ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాళ్లు ఇన్ని క్యాచ్‌లు వదిలేయడం చాలా అరుదు. రచిన్ ఇచ్చిన క్యాచ్‌లను షమి, అయ్యర్ నేలపాలు చేశారు. అయితే, అయ్యర్ క్యాచ్‌ను వదిలేసినప్పుడు స్టాండ్స్‌లో అనుష్క శర్మ రియాక్షన్ నెట్‌లో వైరల్‌గా మారింది. 38 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మిచెల్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను మిడ్‌వికెట్‌లో రోహిత్ అందుకోలేక పోయాడు. ఇక, ఫిలిప్స్ కొట్టిన క్యాచ్‌ను గిల్ చేజార్చాడు.

12 కెప్టెన్‌గా వన్డేల్లో రోహిత్ వరుసగా కోల్పోయిన టాస్‌లు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో హిట్‌మ్యాన్ చివరిసారి టాస్ గెలిచాడు. 1998-99 మధ్య వెస్టిండీస్ సారథి బ్రియాన్ లారా 12 సార్లు వరుసగా టాస్ ఓడాడు. ఈ రికార్డును రోహిత్ సమం చేశాడు.

కన్నీళ్లు పెట్టుకొన్న హెన్రీ..



గాయంతో ఫైనల్‌కు దూరమైన కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీ కన్నీళ్లు పెట్టుకొన్నాడు. భుజం నొప్పితో అతడు బాధపడుతున్నాడు. మ్యాచ్ సమయానికి కోలుకొంటాడని భావించారు. కాగా, ఉదయం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో హెన్రీ విఫలం కావడంతో అతడికి తుదిజట్టులో చోటుదక్కలేదు. దీంతో అతడు భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేక పోయాడు.

రోహిత్‌కు కోహ్లీ సలహా



న్యూజిలాండ్ ఓపెనర్లు యంగ్, రచిన్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పైగా ఏడో ఓవర్‌లో రచిన్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను షమి చేజార్చాడు. దీంతో రోహిత్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. షమి చేతికి బంతి బలంగా తగలడంతో అతడు నొప్పితో విలవిల్లాడు. ఈ సమయంలో ఫిజియో చికిత్స చేస్తుండగా.. రోహిత్‌తో కోహ్లీ మాట్లాడుతూ కనిపించాడు. ఫీల్డింగ్‌లో మార్పుచేర్పులు చేయాలని సూచించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో వరుణ్‌ను రంగంలోకి దించగా.. అతడు యంగ్‌ను ఎల్బీ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు.

వరుణ్‌కు గాయం



కీలక సమయంలో యంగ్, ఫిలిప్స్‌ను అవుట్ చేసిన వరుణ్.. కెప్టెన్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొన్నాడు. అయితే, మ్యాచ్ మధ్యలో అతడు కుంటుతూ కనిపించాడు. తన కోటా ఓవర్లు పూర్తి చేసుకొన్న తర్వాత కానీ అతడు మైదానం వీడలేదు. ఇన్నింగ్స్ బ్రేక్‌లో తన కాలు నొప్పిగా ఉందని.. పెయిన్ కిల్లర్ తీసుకోవాలని వరుణ్ చెప్పాడు.



కళ్లు చెదిరే రీతిలో గిల్ క్యాచ్‌ను పట్టేసిన గ్లెన్ ఫిలిప్స్

- ఫైనల్లో కివీస్‌పై భారత్ విజయం
- స్పిన్నర్ల విజృంభణ ● సత్తా చాటిన రోహిత్

మూడోసారి ట్రోఫీ కైవసం



రోహిత్ (76)

దుబాయ్: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలిచింది. ఆశించిన రీతిలోనే నలుగురు స్పిన్నర్లు ప్రత్యర్థిని కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో కెప్టెన్ రోహిత్ (76), శ్రేయాస్ (48) నిలకడ చూపారు. దీంతో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 2000లో ఇదే టోర్నీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టయ్యింది. అలాగే భారత్ ఖాతాలో ఇది మూడో (2002, 2013, 2025) చాంపియన్స్ ట్రోఫీ. మరోవైపు తాజా టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలవడం విశేషం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 251 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (63), బ్రేస్‌వెల్ (53 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించగా రచిన్ (37), ఫిలిప్స్ (34) సహకారం అందించారు. కుల్దీప్, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు చేసి గెలిచింది. గిల్ (31), అక్షర్ (29) రాణించారు. స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రోహిత్, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా రచిన్ రవీంద్ర నిలిచారు.

శతక భాగస్వామ్యంతో..: ఓ మాదిరి ఛేదనలో భారత్‌కు మెరుపు ఆరంభమే దక్కింది. కానీ కివీస్ బౌలర్ల పోరాటంతో ఈ పోరు దాదాపు ఆఖరి ఓవర్ వరకు సాగి కాస్త ఉత్కంఠను రేకెత్తించింది. మొదటి నుంచీ రోహిత్ తన సహజశైలిలోనే చెలరేగాడు. ఈసారి చక్కగా క్రీజులో కుదురుకొని ఎక్కడా తగ్గకుండా బౌండరీలతో బెదరగొట్టాడు. గిల్‌కన్నా ఎక్కువగా తనే స్ట్రయికింగ్ తీసుకుంటూ స్కోరును పరిగెత్తించాడు. తొలి ఓవర్‌లోనే సిక్సర్ బాదిన అతడు రెండో ఓవర్‌లో రెండు ఫోర్లతో మరింత ఒత్తిడి పెంచాడు. ఇక ఎనిమిదో ఓవర్‌లో రోహిత్ 6,4,4తో 14 పరుగులు వచ్చాయి. ఈ జోరుతో హిట్‌మ్యాన్ ఫిఫ్టీ 41 బంతుల్లోనే పూర్తయ్యింది. అలాగే జట్టు స్కోరు 17 ఓవర్లలోనే 100 పరుగులకు చేరింది. కానీ ఈ దశలో కివీస్‌కు కాస్త ఊరట లభించింది. నిలకడగా సహకరిస్తున్న గిల్‌ను 19వ ఓవర్‌లో శాంట్నర్ అవుట్ చేశాడు. అతడి క్యాచ్‌ను ఎక్స్‌ట్రా కవర్‌లో ఫిలిప్స్ అమాంతం గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో పట్టేయడం హైలైట్‌గా నిలిచింది. దీంతో తొలి వికెట్‌కు 105 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే విరాట్ (1)ను బ్రేస్‌వెల్ అవుట్ చేయడంతో స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. విరాట్ రివ్యూకు వెళ్లినా ఫలితం లేకపోయింది. రెండు వికెట్లు వేగంగా కోల్పోవడంతో జట్టు ఆటతీరులోనూ మార్పు కనిపించింది. బ్రేస్‌వెల్ పకడ్బందీ బంతులకు రోహిత్-శ్రేయాస్ అతి జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. ఓ దశలో 12 బంతుల్లో ఒక్క పరుగే రావడంతో ఓపిక నశించిన రోహిత్ రచిన్ ఓవర్‌లో ముందుకొచ్చి భారీషాట్ కొట్టే యత్నంలో స్టంపౌటయ్యాడు. అటు స్పిన్నర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేయడంతో సాధించాల్సిన రన్‌రేట్ ఆరు దాటింది. అక్షర్ సహాయంతో అడపాదడపా శ్రేయాస్ బౌండరీలు సాధించినా కివీస్ బౌలర్లదే పైచేయి అయ్యింది. ఈ దశలో జేమిసన్ అతడి సులువైన క్యాచ్‌ను వదిలేసినా... స్వల్ప వ్యవధిలోనే రచిన్ అద్భుత క్యాచ్‌కు శ్రేయాస్ వెనుదిరగాల్సి వచ్చింది. అప్పటికే ఈ జోడీ మధ్య నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. మరోవైపు బ్రేస్‌వెల్ విసిరిన చివరి ఓవర్‌లో అనవసర షాట్‌కు వెళ్లి అక్షర్ పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో మ్యాచ్ నువ్వానేనా అన్న రీతికి చేరింది. అయితే ఆఖర్లో రాహుల్‌కు జతగా హార్దిక్ (18) జోరు చూపాడు. 24 బంతుల్లో 21 రన్స్ కావాల్సిన వేళ హార్దిక్ ఓ సిక్స్, ఫోర్‌తో పరిస్థితి తేలిక చేశాడు. 48వ ఓవర్‌లో తను క్యాచ్ అవుటైనా అప్పటికే ఫలితం తేలిపోయింది. తర్వాతి ఓవర్‌లో ఓ ఫోర్‌తో జడేజా మ్యాచ్‌ను ముగించాడు.

కివీస్ జోరుకు స్పిన్నర్ల బ్రేక్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభం, ముగింపుల్లో అదరగొట్టినా.. మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్ల ధాటికి కుదేలైంది. లేదంటే 300 స్కోరు దాటేదే. అయితే ఫీల్డింగ్‌లో రోహిత్ సేన నాలుగు క్యాచ్‌లు జారవిడిచినా స్కోరు అతికష్టంగా 250కి చేరింది. చివర్లో బ్రేస్‌వెల్ వేగంగా ఆడాడు. సెమీస్‌లో శతకం సాధించి ఊపుమీదున్న ఓపెనర్ రచిన్ కళ్లుచెదిరే షాట్లతో ఆకట్టుకున్నాడు. నాలుగో ఓవర్‌లో 6,4,4.. ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో వణికించాడు. అతడికి యంగ్ (15) సహకరించడంతో స్కోరు 7 ఓవర్లలోనే 50 దాటింది. కానీ ప్రమాదకరంగా మారిన ఈ జోడీని స్పిన్నర్ వరుణ్ విడదీశాడు. యంగ్‌ను ఎల్బీ చేయడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తొలి పవర్‌ప్లేలో 69/1 స్కోరుతో జోరు మీదున్న కివీస్‌కు కుల్దీప్ తన వరుస ఓవర్లలో గట్టి ఝలక్ ఇచ్చాడు. ముందుగా ఓ గూగ్లీతో రచిన్‌ను క్లీన్ బౌల్డ్ చేయగా, తర్వాత వెటరన్ విలియమ్సన్ (11)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. అక్కడి నుంచి స్పిన్నర్ల హవా ఆరంభం కావడంతో కివీస్ పరుగుల కోసం చెమటోడ్చింది. 15-26 ఓవర్ల మధ్య కనీసం ఫోర్ కూడా సాధించకపోగా లాథమ్ (14) వికెట్‌ను కూడా కోల్పోయింది. చివరకు 81 బంతుల తర్వాత ఫిలిప్స్ ఓ సిక్సర్‌తో మురిపించాడు. 38వ ఓవర్‌లో ఫిలిప్స్‌ను వరుణ్ బౌల్డ్ చేయడంతో మిచెల్‌తో కలిసి ఐదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వికెట్లు పడుతున్నా మిచెల్ మాత్రం ఓపికగా ఆడుతూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 46వ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాక అతను వెనుదిరిగినా, బ్రేస్‌వెల్ ధాటికి ఆఖరి ఐదు ఓవర్లలో జట్టు 50 రన్స్ రాబట్టడం విశేషం.

1 చాంపియన్స్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్‌లో కూడా టాస్ నెగ్గకుండా టోర్నీ విజేతగా నిలిచిన ఏకైక జట్టుగా భారత్.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: యంగ్ (ఎల్బీ) వరుణ్ 15; రచిన్ (బి) కుల్దీప్ 37; విలియమ్సన్ (సి అండ్ బి) కుల్దీప్ 11; మిచెల్ (సి) రోహిత్ (బి) షమి 63; లాథమ్ (ఎల్బీ) జడేజా 14; ఫిలిప్స్ (బి) వరుణ్ 34; బ్రేస్‌వెల్ (నాటౌట్) 53; శాంట్నర్ (కోహ్లీ/రోహిత్-రనౌట్) 8; స్మిత్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 50 ఓవర్లలో 251/7. వికెట్ల పతనం:** 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239; **బౌలింగ్:** షమి 9-0-74-1; హార్దిక్ 3-0-30-0; వరుణ్ 10-0-45-2; కుల్దీప్ 10-0-40-2; అక్షర్ 8-0-29-0; జడేజా 10-0-30-1.

భారత్: రోహిత్ (స్టంప్-లాథమ్) (బి) రచిన్ 76; గిల్ (సి) ఫిలిప్స్ (బి) శాంట్నర్ 31; విరాట్ (ఎల్బీ) బ్రేస్‌వెల్ 1; శ్రేయాస్ (సి) రచిన్ (బి) శాంట్నర్ 48; అక్షర్ (సి) ఓరౌర్కీ (బి) బ్రేస్‌వెల్ 29; రాహుల్ (నాటౌట్) 34; హార్దిక్ (సి అండ్ బి) జేమిసన్ 18; జడేజా (నాటౌట్) 9; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 49 ఓవర్లలో 254/6; వికెట్ల పతనం:** 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241.**బౌలింగ్:** జేమిసన్ 5-0-24-1; ఓరౌర్కీ 7-0-56-0; స్మిత్ 2-0-22-0; శాంట్నర్ 10-0-46-2; రచిన్ 10-1-47-1; బ్రేస్‌వెల్ 10-1-28-2; ఫిలిప్స్ 5-0-31-0.



'టాప్'లో నిలిపే వైదొలగాలి

ఇదో అద్భుత విజయం. ఆసీస్ టూర్‌లో దారుణ పరాభవం తర్వాత తిరిగి పుంజుకోవాలని గట్టిగా భావించాం. అందుకే చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ ప్రత్యేకమైంది. యువ ఆటగాళ్లతో నేనెక్కువగా మాట్లాడుతూ అనుభవాలను పంచుకుంటా. ఒకవేళ ఎవరైనా కెరీర్ నుంచి వైదొలగితే జట్టును అత్యున్నత స్థానంలో నిలిపాకే వెళ్లాలి. ఇప్పుడు మా జట్టులో 8-10 ఏళ్ల కాలానికి ప్రపంచ క్రికెట్‌ను శాసించగల ఆటగాళ్లు ఉన్నారు.

-విరాట్ కోహ్లీ

దూకుడుగా ఆడాలనుకుంటా..

టోర్నీ ఆసాంతం మా ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఇక దూకుడుగా ఆడడం నా నైజం కాదు. కానీ అలా ఆడాలని కోరుకునే వాణ్ని. అయితే విభిన్నంగా ఆడాలంటే టీమ్ మేనేజ్‌మెంట్ ప్రోత్సాహం తప్పనిసరి. అప్పటి కోచ్ ద్రవిడ్, తాజాగా గంభీర్‌తోనూ ఇదే విషయం చర్చించి ఫలితం సాధించా. నేను వన్డేల నుంచి రిటైరవుతున్నట్టు వస్తున్న వార్తలు నిజం కావు.

- కెప్టెన్ రోహిత్ శర్మ

అసాధారణం.. అపూర్వం..

చాంపియన్స్ ట్రోఫీని మూడుసార్లు గెలిచిన ఏకైక జట్టుగా నిలిచిన టీమిండియాకు శుభాకాంక్షలు.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అసాధారణమైన ఆట.. అపూర్వమైన విజయం.. భారత క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడం గర్వంగా ఉంది. టోర్నమెంట్ ఆద్యంతం అద్భుతంగా ఆడారు. మన ఆటగాళ్లకు అభినందనలు.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ఈ గెలుపుతో భారత జట్టులోని సభ్యులంతా కోట్లాది మంది హృదయాలను గర్వంతో ఉప్పొంగేలా చేశారు.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

అద్భుతమైన విజయంతో భారత జట్టు మరోసారి మనల్ని గర్వపడేలా చేసింది. జట్టు చూపిన అంకితభావం, సాధించిన ఘనతకు అభినందనలు.

- ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు

టోర్నీ ఆసాంతం అజేయమైన ఆటతీరుతో చాంపియన్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు అభినందనలు.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి



రాహుల్, జడేజా విజయానందం

ఆల్‌రౌండ్ షో

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తొమ్మిది నెలల్లో రెండో ఐసీసీ ట్రోఫీతో ప్రపంచ క్రికెట్‌లో తనకు తిరుగు లేదని భారత జట్టు నిరూపించింది. గత జూన్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌ను రోహిత్ సేన సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలోనూ విజేతగా అవతరించింది. ముచ్చటగా మూడోసారి ఈ ట్రోఫీని ముద్దాడింది. గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. ఫైనల్లోనూ ఆ జట్టును చిత్తు చేసింది.

ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టి..: చాంపియన్స్ ట్రోఫీకి ముందు స్వదేశంలో వన్డే సిరీస్‌లో టీమిండియా 3-0తో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. దాంతో సాధించిన ఆత్మవిశ్వాసంతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టారు. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలుపొందడం ద్వారా మొదలైన రోహిత్ సేన విజయ యాత్ర తుదిపోరులో న్యూజిలాండ్‌ను ఓడించే వరకు అప్రతిహతంగా సాగింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆరు వికెట్ల విజయం భారతీయులందరికీ గర్వకారణం. క్రికెట్ సమష్టి ఆట. జట్టులోని పదకొండు మంది తలోచేయి వేస్తేనే మ్యాచ్‌లు గెలుచుకోగలుతారు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ అదే సమష్టితత్వాన్ని ప్రదర్శించింది. ఒకరిద్దరు బ్యాటర్లు, ఇద్దరు ముగ్గురు బౌలర్లుకాకుండా అందరూ తమ సత్తా మేరకు రాణించారు. రోహిత్ నాయకత్వ బాధ్యతలను చక్కగా నిర్వర్తించాడు. ఎందుకు వచ్చిందో తెలియదుకానీ..చాంపియన్స్ ట్రోఫీ అనంతరం రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలుకుతాడన్న వార్త బయటకొచ్చింది. కీలకమైన ఫైనల్‌కు ముందు చక్కర్లు కొట్టిన ఈ వార్త.. ఎంతలేదన్నా రోహిత్‌పై ఒత్తిడి తెచ్చేదే. కానీ ఆ ఒత్తిడిని దరిచేరనీకుండా తుదిపోరులో జట్టును రోహిత్ అద్భుతంగా నడిపించాడు. ఈ పిచ్‌పై క్లిష్టమైన లక్ష్య ఛేదనలో 76 పరుగులతో జట్టు విజయానికి రోహిత్ పునాది వేశాడు. తీవ్ర ఒత్తిడిలో టోర్నమెంట్ బరిలోకి దిగిన మరో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పాకిస్థాన్‌పై సెంచరీ, ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో 84 పరుగుల ఇన్నింగ్స్‌తో తానెంత విలువైన ఆటగాడినో చాటి చెప్పాడు. బౌలింగ్ విభాగంలో..పేస్ దళపతి బుమ్రా లేకపోవడంతో వెటరన్ షమిపై ఎంతో బాధ్యత నిలిచింది. గాయంతో సుదీర్ఘ విరామం అనంతరం..అందునా చాంపియన్స్ ట్రోఫీ లాంటి పెద్ద టోర్నీలో పేస్ బౌలింగ్ భారాన్ని మోయడం ఆషామాషీ కాదు. కానీ తన అనుభవాన్ని రంగరించిన షమి అంచనాలను 100 శాతం నిలబెట్టుకున్నాడు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, జడేజా ప్రత్యర్థులను స్పిన్ ఉచ్చులో బిగిస్తే..బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆల్‌రౌండర్లుగా హార్దిక్, అక్షర్ పటేల్ జట్టు విజయాలలో తమ పాత్రను సమర్థంగా పోషించారు. వైస్-కెప్టెన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ బ్యాటర్లుగా సత్తా చాటి భవిష్యత్‌లో భారత జట్టులో తాము ఎంత కీలకమో చాటి చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేస్తూ టీమిండియా సిగలో మరో ఐసీసీ ట్రోఫీని చేర్చారు.

ఆ విమర్శలు తిప్పికొట్టారు..: భద్రతా కారణాలతో భారత జట్టు పాకిస్థాన్ వెళ్లకపోవడంతో..టీమిండియా మ్యాచ్‌లకు దుబాయ్‌ను ఎంపిక చేసింది ఐసీసీ. అలాంటప్పుడు భారత్ తన మ్యాచ్‌లన్నీ ఒకే చోట ఆడుతోందని, అది ఆ జట్టుకు అదనపు ప్రయోజనం చేకూరుస్తోందని ప్రస్తుత, మాజీ క్రికెటర్లు చేసిన ఆరోపణలు అర్థ రహితం. దుబాయ్ టీమిండియాకు హోమ్ గ్రౌండ్ కాదు. పైగా రోహిత్ సేన మ్యాచ్‌లన్నీ భిన్న పిచ్‌లపై ఆడింది. ఈనేపథ్యంలో 'అదనపు ప్రయోజనం' ఎక్కడిది? టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసి చాంపియన్‌గా నిలవడం ద్వారా భారత జట్టు ఆ విమర్శలకు దీటైన బదులిచ్చింది.

ఐసీసీ ఫైనల్స్‌లో టీమిండియా

టోర్నీ	స్థానం	కెప్టెన్
1983 వన్డే వరల్డ్‌కప్	విజేత	కపిల్ దేవ్
2000 చాంపియన్స్ ట్రోఫీ	రన్నరప్	గంగూలీ
2002 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	గంగూలీ
2003 వన్డే వరల్డ్‌కప్	రన్నరప్	గంగూలీ
2007 టీ20 వరల్డ్‌కప్	విజేత	ధోనీ
2011 వన్డే వరల్డ్‌కప్	విజేత	ధోనీ
2013 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	ధోనీ
2014 టీ20 వరల్డ్ కప్	రన్నరప్	ధోనీ
2017 చాంపియన్స్ ట్రోఫీ	రన్నరప్	కోహ్లీ
2021 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్	రన్నరప్	కోహ్లీ
2023 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్	రన్నరప్	రోహిత్
2023 వన్డే వరల్డ్‌కప్	రన్నరప్	రోహిత్
2024 టీ20 వరల్డ్‌కప్	విజేత	రోహిత్
2025 చాంపియన్స్ ట్రోఫీ	విజేత	రోహిత్

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 10 మార్చి 2025

దిండు లేకుండా పడుకోవడమే మేలు..!

రాత్రిపూట తల కింద దిండు పెట్టుకోకుండా పడుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తీరుతాయని చెబుతున్నారు.

- దిండు మీద తల పెట్టి నిద్రించడం వల్ల మెడపై ఒత్తిడి పెరుగుతుంది. మెడనొప్పి, మెడ పట్టేయడం లాంటివి ఎదురవుతూ ఉంటాయి. అదే దిండు లేకుండా పడుకుంటే మెడ సరైన స్థితిలో ఉండి విశ్రాంతి పొందుతుంది.
- దిండు వేసుకోకుండా పడుకుంటే వెన్నెముక సరైన ఆకృతిలో ఉంటుంది. వీపు నొప్పి, నడుము నొప్పి తగ్గుతాయి.
- దిండు లేకుండా పడుకోవడం వల్ల తల నుంచి పాదాల వరకూ రక్తప్రసరణ ఒక క్రమ పద్ధతిలో వేగంగా జరుగుతుంది. దీనివల్ల శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె పని తీరు మెరుగుపడుతుంది.
- దిండు వేసుకుని పడుకుంటే ముఖభాగాలన్నీ రాపిడికి గురై నుదుటి మీద చెంపలపై ముడుతలు వస్తాయి. మొటిమలు, గుల్లల సమస్య కూడా పెరుగుతుంది.



- దిండు వల్ల కురుల సమస్యలు ఏర్పడతాయి. తలలో చుండ్రు పెరుగుతుంది. సమతలంగా లేని దిండు వేసుకోవడం వల్ల శిరోజాలకు రాపిడీ పెరిగి అవి చిక్కు పడడమే కాకుండా రాలిపోతాయి.
- దిండు లేకుండా పడుకుంటే మానసిక ఒత్తిడి, అలసట తగ్గుతాయి. ప్రశాంతమైన నిద్ర లభిస్తుంది. ఉదయం లేవగానే ఉత్సాహంగా ఉంటుంది.

పిల్లలకు ఎలాంటి పనులు చెప్పాలి?

పిల్లలతో వారి వయసుకు తగ్గట్టు చిన్నచిన్న పనులు చేయించడం వల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లల చేత ఎటువంటి పనులు చేయించాలో తెలుసుకుందాం.

- చిన్న పిల్లలకు వారు తేలికగా చేయ గలిగే పనులు చెప్పాలి. మొక్కలకు నీళ్లు పోయడం, పెంపెడు జంతువులకు ఆహారం పెట్టడం, చెప్పులు-షూలను స్టాండ్‌లో పెట్టడం, బొమ్మలను చక్కగా సర్దడం లాంటి పనులు చెప్పవచ్చు. ఇలాంటి పనులను పిల్లలు ఇష్టంగా చేస్తారు కూడా.
- పెద్ద పిల్లలకు ఉదయం లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు-దిండ్లు సర్దడం, భోజనం చేసేటప్పుడు టేబుల్ సిద్ధం చేయడం, భోజనం తరవాత టేబుల్ శుభ్రం చేయడం, తిన్న కంచం కడగడం లాంటి పనులు చెప్పవచ్చు. దీనివల్ల పిల్లలకు కుటుంబంలో బాధ్యతగా మెలగడం అలవడుతుంది.



- యుక్తవయసులోకి అడుగుపెట్టిన పిల్లలకు బజారు నుంచి కిరాణా సరుకులు తేవడం, కూరగాయలు కొనడం, ఆరిన బట్టలు మడత పెట్టడం లాంటి పనులు చెప్పవచ్చు.
- పిల్లలు పనులు చేసిన తరవాత వారిని తల్లిదండ్రులు ప్రశంసించాలి. చిన్నపాటి తప్పులున్నప్పటికీ వాటిని ఎత్తిచూపకూడదు. పిల్లలు చేసిన సహాయం తమకు ఎంత బాగా ఉపయోగపడిందో చెబుతూ ఆ పనులను మరింత బాగా చేసే విధానాన్ని వివరించి చెప్పాలి. అప్పుడే పిల్లలు కొత్తవాటిని నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు.

ఇలా చేస్తే పగుళ్లు రావు!

దంతాలు ఎంత బలంగా ఉన్నప్పటికీ కొన్ని పొరబాట్ల వల్ల వాటిపై పగుళ్లు ఏర్పడుతూ ఉంటాయి. క్రమం తప్పకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ దంతాలను సంరక్షించుకుకోవచ్చు.

- నోటిని పరిశుభ్రంగా ఉంచుకుంటే దంతాల దృఢత్వం చెదరదు. రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.
- నిద్రలో కొంతమంది... ముఖ్యంగా పిల్లలు... పళ్లు కొరుకుతూ ఉంటారు. ఇలా చాలాకాలం కొనసాగితే దంతాలపై పగుళ్లు ఏర్పడతాయి. వైద్యుని సంప్రతించి పళ్లు కొరికే సమస్యను పరిష్కరించుకోవడం మంచిది.
- శరీరంలో కాల్షియం, డి విటమిన్ లోపించినప్పుడు దంతాలు బలహీనమై విరిగిపోతుంటాయి. నిత్యం పాలు, పాల పదార్థాలు, చేపలు, గుడ్లు, ఆకుకూరలు లాంటి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ఉదయాన్నే లేత సూర్యకిరణాలు శరీరానికి తాకేలా చూసుకోవాలి.
- పుల్లని పదార్థాలు, దంతాలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి. దంతాలను సంరక్షించే ఎనామిల్ పొరను దెబ్బతీస్తాయి. దీంతో దంతాలు విరిగిపోవచ్చు. ఊరగాయలు, పండ్ల రసాలు, పుల్లని పండ్లు, టమాటా కెచప్ లాంటివి తీసుకున్న తరవాత మంచి నీటితో నోటిని పుక్కిలించాలి. శీతల పానీయాలు, కాఫీ, టీలు తాగడాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి.





ఆ హాలీవుడ్ సూట్లు మనవే

పై ఫొటోలో సూట్ కుడుతూ బిజీగా కనిపిస్తున్న మహిళ పేరు మేకల కీర్తి. చదివింది నాలుగో తరగతే. అయితేనేం.. ఆమె చేత్తో కుడుతున్న సూట్లు ధరించేది మాత్రం హాలీవుడ్ హీరోలు. తిరుపతి సమీపంలోని శ్రీసిటీలో ఇలాంటి వారు ఎంతో మంది కనిపిస్తారు..

శ్రీసిటీలో ఎమ్మెస్సార్ గార్మెంట్స్ అనే సంస్థ 2010లో తన కార్యకలాపాలు ప్రారంభించింది. దీనిలో ప్రస్తుతం 148 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 120 మంది మహిళలే కావటం ఒక విశేషం. పైగా వీరిలో చాలా మంది ఐదు క్లాసు వరకే చదువుకున్నారు. ఈ సంస్థలో పనిచేసేవారు తమ చేతితో శ్రద్ధగా సూట్లను కుడతారు. వీరు తయారుచేసే సూట్లు మన దేశంలో అందుబాటులో ఉండవు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ఇటలీ, స్వీడన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. వీటి ఖరీదు 2.5 లక్షల నుంచి 11 లక్షల వరకూ ఉంటుంది. "మా దగ్గర తయారయిన సూట్లను ఎక్కువగా హాలీవుడ్ సినిమాల్లో వాడుతూ ఉంటారు.." అని సంస్థ ప్రతినిధి వివరించారు.

> కీర్తికి చిన్నప్పుడే పెళ్లి చేసేశారు. భర్త లారీ డ్రైవర్. ముగ్గురు పిల్లలు. భర్త తెచ్చే డబ్బులతో ఆమెకు ఇల్లు గడవటం చాలా కష్టమయ్యేది. అందుకే కీర్తి కూలిపనికి వెళ్లేది. ఆ సమయంలో తనకు కుట్టు వచ్చని కూడా ఆమెకు తెలియదు. కానీ తనతో పాటు కూలీకి వెళ్లేవారు కొందరు శ్రీసిటీలో చేరితే తాను కూడా వెళ్లింది. అక్కడ సంస్థలో చేరింది. ప్రత్యేకమైన శిక్షణ పొందింది. ప్రస్తుతం నెలకు కీర్తికి నెలకు 20 వేలు వస్తుంది. శ్రీ సిటీలో కీర్తిలాంటి వారు మనకు ఎంతో మంది కనిపిస్తారు.

అంత సులభం కాదు..

సాధారణంగా మనకు మార్కెట్లో లభించే సూట్లు మన శరీర కొలతలకు తగినట్లుగా ఉండవు. చేతితో కుడితే మాత్రం శరీర కొలతలకు అనుగుణంగా ఉంటాయి. ఈ విధంగా కుట్టాలంటే విదేశాలలో



చాలా ఎక్కువ ఖరీదు అవుతుంది. అందువల్ల వారు తమ కొలతలను ఈ సంస్థకు పంపిస్తారు. దీనికి అనుగుణంగా ఇందులో పనిచేసే సిబ్బంది సూట్లను కుడతారు. అయితే ఇది సులభమైన పని కాదు. "దీనికి ప్రత్యేక నైపుణ్యం అవసరం. అందుకే మేము ముందు కొద్ది మందిని ఎంపిక చేసుకున్నాం. వారికి సుమారు ఆరేళ్ల పాటు శిక్షణ ఇచ్చాం. వారు బాగా ఆరితేరారని నమ్మకం వచ్చిన తర్వాత ఆర్డర్లు తీసుకోవటం ప్రారంభించాం. మా సంస్థ 2010లో ప్రారంభమయినా - 2016లోనే సూట్లను ఎగుమతి చేయటం ప్రారంభించాం. ప్రస్తుతం మాకు ఏడాదికి 12 కోట్ల టర్నోవర్ ఉంది" అని సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. ఒక మిషన్ ద్వారా తయారుచేసిన సూట్లలో ఎన్ని కుట్లు ఉంటాయో తెలియదు. కానీ చేతితో కుట్టేడప్పుడు కొన్ని వేల కుట్లు వేయాల్సి వస్తుంది. "ఒక మిషన్‌తో సూటు కుడితే ఎనిమిది గంటలు పడుతుంది. మా దగ్గర ఎనిమిది రోజులు పడుతుంది. కానీ ఒక సెంటీమీటర్ కూడా తేడా ఉండదు" అని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

> శ్రీసిటీలో ప్రస్తుతం 34 వేల మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏడాదికి 60 వేల కోట్లకు పైగా ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. వీటిలో ఎక్కువ శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. బరువులు ఎత్తే ఫోర్క్ లిఫ్టలను నడపటం దగ్గర నుంచి మెయింటినెన్స్ ఇంజినీర్ల వరకు రకరకాల హోదాల్లో పనిచేస్తున్నారు.

• కవరకుంట్ల శివప్రసాద్
ఫొటోలు: సాయికుమార్

'విల్ పవర్'తో గెలుపే లక్ష్యంగా



పోలియోతో రెండేళ్ళ వయసు నుంచి ఇంటికే పరిమితమైనా... ఏనాడూ నైరాశ్యాన్ని ఆమె దగ్గరకు రానీయలేదు. 41 ఏళ్ళ వయసులో ఎదురైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పట్టుదలతో సాధన చేసి విజయాలు అందుకుంటున్నారు. పారా పవర్‌లిఫ్టింగ్‌లో కేరళ తరపున ఎన్నో ఘనతలు సాధించిన పి.వి. లతిక వచ్చేవారం జరగబోయే జాతీయ పోటీల్లో మరోసారి పతకాల వేటకు సిద్ధమవుతున్నారు.

"కొన్నాళ్ళ క్రితం కన్నూర్‌లోని ఒక పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాను. కార్యక్రమం ముగిసిన తరువాత ఒక విలేకరి 'ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పతకాలు సాధించారు కదా! మీ జీవితంలో అత్యుత్తమంగా అనిపించిన సందర్భం ఏది?' అని అడిగారు. 'ఇదే... ఈ కార్యక్రమానికి హాజరు కావడమే' అని చెప్పాను. అది అక్షరాలా నిజం. ఎన్నడూ బడి ముఖం కూడా చూడని నేను రెండువేల మంది విద్యార్థులున్న పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావడం కన్నా గుర్తుండిపోయే సందర్భం ఇంకేం ఉంటుంది? నా మాటలు అందరూ శ్రద్ధగా విన్నారు. వారిలో కొందరికైనా నా ద్వారా ప్రేరణ కలిగి ఉండే ఉంటుంది. అది ఎంతో సంతృప్తి కలిగిస్తోంది" అని అన్నాను.

పాకుతూ తిరిగేదాన్ని...

అందరిలా బడికి వెళ్ళాలి. బాగా చదువుకోవాలి... ఇది నా తీరని కోరిక. కానీ రెండేళ్ళ వయసులో పోలియో వచ్చి, నా కాళ్ళు చచ్చుబడిపోవడంతో అది నెరవేరలేదు. మాది కేరళలోని పయ్యన్నూర్ సమీపంలో ఉన్న మాతమంగళం అనే ఊరు. మా నాన్న పోర్టర్. అమ్మ వ్యవసాయ కూలీ. నాకు ఒక అక్క, ఒక చెల్లి. మాది నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మా అక్కని మా అమ్మమ్మ ఇంట్లో ఉంచి చదివించారు. "నాకు కనీసం సైకిలైనా ఉంటే నిన్ను బడికి తీసుకువెళ్ళేవాణ్ణి" అనేవాడు నాన్న. ఒకే గది ఉన్న ఇంట్లోనే రోజంతా ఉండలేక... నేల మీద నుంచి పాకుతూ... వీధిలో ఉన్న చెట్ల కింద కూర్చొని, వచ్చీపోయేవారిని చూస్తూ గడిపేదాన్ని. మా చెల్లెలు స్కూల్ నుంచి వచ్చేవరకూ ఎదురుచూసేదాన్ని. తను వచ్చి బడి కబుర్లు చెప్పేది. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. నా తోబుట్టువులకు పెళ్ళయ్యాక అత్తవారిళ్ళకు వెళ్ళడంతో... పూర్తి ఒంటరితనంలో మునిగిపోయాను. అయితే నేను ఎన్నడూ కుంగిపోలేదు. నాకు ఏదో మంచి జరుగుతుందనే ఎప్పుడూ అనుకొనేదాన్ని. తొమ్మిదేళ్ళ క్రితం అలాంటి రోజు వచ్చింది.

మా రాష్ట్రం నుంచి మొదటి మహిళను నేనే...

అంగవైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ చేస్తోందని తెలుసుకొని... దరఖాస్తు చేశాను. కొన్నాళ్ళలోనే నాకు స్కూటర్ మంజూరైంది. నా సోదరి కుమారుడి సహకారంతో... మూడు రోజుల్లోనే దాన్ని నడపడం నేర్చుకున్నాను. దాంతో నాకు కొత్తగా రెక్కలొచ్చినట్టు అనిపించింది. అప్పటివరకూ ఇంటికే పరిమితమైన నేను... ఆ స్కూటర్ మీద ఊరంతా తిరిగేదాన్ని. ఆలయాలకు, ఉత్సవాలకు వెళ్ళేదాన్ని. కొన్నిసార్లు మావాళ్ళతో దూర ప్రాంతాలకు కూడా వెళ్ళొచ్చాను. కాలం ఇలా గడుస్తూ ఉండగా... మా పొరుగున ఉన్న అబ్దుల్ బషీర్ అనే పెద్దాయన ఒక రోజు మా ఇంటికి వచ్చారు. ఆయన నాకు చిన్నప్పటినుంచీ తెలుసు. రోడ్డు ప్రమాదంలో నడుము వరకూ ఆయనకు చచ్చుబడింది. "ఈ రోజు సాయంత్రం ఒక చోటుకు వెళ్దాం వస్తావా?" అని అడిగారు. సరేనన్నాను. మా ఊరుకు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండోర్ స్టేడియంకు నన్ను తీసుకువెళ్ళారు. అక్కడ పారా పవర్ లిఫ్టింగ్‌లో ఎంపికలు జరుగుతున్నాయి. 'వాటిని చూపించడానికి ఆయన తీసుకువచ్చారేమో?' అనుకున్నాను. నిర్వాహకులతో బషీర్ మాట్లాడారు. నా దగ్గరకు వచ్చి... "నువ్వు పవర్ లిఫ్టింగ్‌కు ప్రయత్నిస్తే బాగుంటుంది కదా!" అన్నారు. అంతకుముందు ఆ క్రీడను నేను కనీసం చూడనైనా లేదు. కానీ 'ప్రయత్నిస్తే తప్పేముంది?' అనిపించింది. మొదటి ప్రయత్నంలోనే ముప్ఫై కిలోలు అవలీలగా ఎత్తగలిగాను. జాతీయ పారా పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాను. కేరళ తరపున ఈ క్రీడలో క్వాలిఫై అయిన మొదటి మహిళను నేనని తెలిసినప్పుడు... ఆశ్చర్యం, ఆనందం నన్ను ముంచెత్తాయి. కేరళ పారా పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జోబీ మాథ్యూ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు. "నీకు సామర్థ్యం ఉంది, కానీ శిక్షణ లేదు. జాతీయ పోటీలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. కాబట్టి శిక్షణ తీసుకో" అని చెప్పారు. మా ఊరుకు దగ్గర్లోని టౌన్‌లో చక్కటి సౌకర్యాలున్న జిమ్‌ల పేర్లను ఆయన సూచించారు. అయితే అవన్నీ పై అంతస్తుల్లోనే ఉన్నాయి. నేను పైకి ఎక్కడం కష్టం. చివరకు, ఇంట్లో జిమ్ నడుపుతున్న పుష్ప అనే మహిళా శిక్షకురాలు దొరికారు. ఆ సమయంలోనే నా గురించి తెలుసుకున్న 'ఇన్‌స్పైర్' అనే స్వచ్ఛంద సంస్థ నా ప్రయాణ ఖర్చులను స్పాన్సర్ చేసింది. నా చెల్లెలిని సాయం తీసుకొని జాతీయ పోటీల కోసం నాగపూర్ వెళ్ళాను. నేను విమానం ఎక్కడం అదే తొలిసారి.



> బరువు పెరగడంతో... 2023లో ఢిల్లీలో నిర్వహించిన పోటీల్లో 67 కిలోల కేటగిరీలో పాల్గొనాల్సి వచ్చింది. అందులో రజత పతకం దక్కింది. కానీ మరిన్ని స్వర్ణాలు గెలవాలనేది నా ఆశ. కానీ హఠాత్తుగా అనారోగ్యం పాలయ్యాను. వైద్యులు విశ్రాంతి అవసరమని చెప్పడంతో.. కిందటి ఏడాది పోటీలకు వెళ్ళలేకపోయాను. కోలుకున్న వెంటనే మళ్ళీ అభ్యాసం కొనసాగించాను. ఈనెల (మార్చి) 16 నుంచి 18 వరకూ నోయిడాలో జరగబోయే 22వ సీనియర్ నేషనల్ పారా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్నాను. నేను పవర్ లిఫ్టింగ్ ప్రారంభించి ఏడేళ్ళయింది. ఇప్పటికీ కేరళ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళను నేనే.

ఆ కల నెరవేర్చుకున్నా...

పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాను. కానీ ఇతర పోటీదారుల ముందు నా నైపుణ్యం సరిపోలేదు. నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాంతో నాలో పట్టుదల పెరిగింది. మరిన్ని ఎక్కువ సౌకర్యాలున్న జిమ్‌లో చేరాను. రోజూ మెట్ల మీద పాక్కుంటూ పైకి వెళ్ళేదాన్ని. మా ట్రైనర్ మోహనన్ నా దగ్గర డబ్బులేవీ తీసుకోలేదు. అయితే "పవర్ లిఫ్టింగ్‌లో రాణించాలంటే దారుఢ్యం ఎంతో అవసరం. తగిన ప్రోటీన్ కోసం రోజూ పదిహేను గుడ్లు, చికెన్ తినాలి. తీపి పదార్థాలు, వేపుళ్ళు మానేయాలి" అంటూ సూచనలు చేశారు. ఆయన వద్దన్నవి తీసుకోలేదు, కానీ అవసరమన్నవి తీసుకొనే స్థోమత మాకు లేదు. కాబట్టి వీలైన మేరకే పాటించేదాన్ని. పూర్తిగా సిద్ధమైన దశలో... కొవిడ్ విజృంభించింది. పోటీలు వాయిదా పడ్డాయి. ఆ సమయాన్ని నేను శిక్షణ కోసం వినియోగించుకున్నాను. తరువాత... 2021లో... బెంగళూరులో జరిగిన నేషనల్స్‌లో పాల్గొని, రెండో స్థానంలో నిలిచాను. కానీ నా లక్ష్యం స్వర్ణ పతకం సాధించడం. అందుకోసం తీవ్రంగా సాధన చేశాను. 2022లో... అరవై ఒక్క కిలోల కేటగిరీలో బంగారు పతకం సాధించి నా కల నెరవేర్చుకున్నాను. పారా పవర్‌లిఫ్టింగ్‌లో ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా నిలిచాను. ఒకప్పుడు ఇల్లు దాటని నాకు ఇప్పుడు సమాజంలో గుర్తింపు లభించింది. నా కథ ఏ ఒక్కరిలో స్ఫూర్తి కలిగించినా... నా జీవితం సఫలమైనట్టే. రాబోయే పోటీల్లో రాణించాలి. అంతర్జాతీయ పోటీల్లో కూడా నా ప్రతిభ కనబరచాలి. ప్రస్తుతం ఇదే నా ఆకాంక్ష"

రక్తదానం చేస్తే...

రక్తదానం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా రక్తదాతకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

- రక్తదానం చేస్తున్నప్పుడు శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. వీటివల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- రక్తదానం చేసినవెంటనే శరీరంలో కొత్త రక్తకణాల ఉత్పత్తి ప్రారంభమౌతుంది. మెదడు నుంచి పాదాల వరకూ రక్తప్రసరణ వేగంగా జరుగుతుంది.
- రక్తదానం చేయడం వల్ల మనసులో ప్రతికూల ఆలోచనలు తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒంటరితనం అనే భావన తొలగిపోతుంది. మానసిక సంతృప్తి లభిస్తుంది.



- రక్తదానం చేస్తే శరీరంలో పేరుకున్న అదనపు ఇనుము బయటికి వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది దీనివల్ల అవయవాల పనితీరు సక్రమంగా మారుతుంది.
- రక్తదానం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు రావు. గుండె, రక్తనాళాల పని తీరు మెరుగుపడుతుంది.
- పద్దెనిమిది నుంచి అరవై ఏళ్ల వయసు ఉన్న ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చు. చెడు అలవాట్లు, హెపటైటిస్- బి/సి, హెచ్ఐవీ, అధిక రక్తపోటు ఉన్నవారు రక్తదానం చేయడానికి వీలు లేదు. ఒకసారి రక్తదానం చేస్తే దాంతో ముగ్గురికి ప్రాణదానం చేసే వీలుంది.
- రక్తదానం చేసేటప్పుడు గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు స్వల్పంగా పెరగవచ్చు. కాబట్టి వదులుగా ఉండే దుస్తులు ధరించడం మంచిది. రక్తదానం చేసిన తరవాత రెండు రోజుల వరకూ వ్యాయామం చేయకూడదు.

ఇంటికి శోభనిచ్చే మనీ ప్లాంట్!

చాలామంది ఇళ్లలో మనీ ప్లాంట్ పెంచుకుంటూ ఉంటారు. ఈ తీగ అందంగా అల్లుకోవాలంటే ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

- మనీ ప్లాంట్‌ని ఏ సైజు కుండీలోనైనా పెంచవచ్చు. పెద్ద కుండీ అయితే ఆకులు వెడల్పుగా వస్తాయి.
- గాజు సీసాలో నిండుగా నీరు పోసి అందులో ఈ మొక్కను ఉంచినా కూడా బాగా పెరుగుతుంది. పదిహేను రోజులకు ఒకసారి నీళ్లు మారిస్తే చాలు.
- ఈ మొక్కకు ఎక్కువగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుతురు ఉంటే చాలు తీగలా చక్కగా పెరుగుతుంది.
- కుండీలో తరచూ నీళ్లు పోయకూడదు. మట్టి తేమగా ఉంటే చాలు. ఆకులపై కొన్ని నీళ్లు పిచికారీ చేస్తూ ఉంటే అవి పచ్చగా మెరుస్తూ కనిపిస్తాయి.
- కుండీలో మట్టికి మూడు నెలలకు ఓసారి ఆవుపేడతో తయారుచేసిన సేంద్రీయ ఎరువు కలపాలి.
- మొక్క మొదళ్లలో నాచుకర్రలు పాతితే వేళ్లకు నిరంతరం తేమ అందుతూ ఉంటుంది. మొక్క పొడవుగా పెరుగుతుంది.
- ఎండిన, పండిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేస్తూ తీగను అందంగా అమరుస్తూ ఉంటే మొక్క పెరుగుతూనే ఉంటుంది. కుండీ మధ్యలో పొడవాటి కర్రను ఉంచి దాని చుట్టూ తీగను చుడుతూ ఉంటే మొక్క గుబురుగా పెరుగుతుంది. చూడడానికి అందంగా కనిపిస్తుంది.



రోజూ తలస్నానం మంచిదేనా?

వాతావరణ కాలుష్యం వల్ల కురులలో మురికి చేరుతూ ఉంటుంది. దీనిని తొలగించి శిరోజాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే తలస్నానం తప్పనిసరి. తలస్నానానికి సంబంధించి నిపుణుల సూచనలు ఇవి....

- మాడు మీద ఉత్పత్తి అయ్యే జిడ్డుకు దుమ్ము, ధూళి తోడై తలలో కురుపులు ఏర్పడవచ్చు. కాబట్టి తలలో జిడ్డు చర్మం ఉన్నవారు వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయాలి. వీరు ప్రతిరోజూ చేసినా కూడా మంచిదే.
- తలలో పొడి చర్మం ఉన్నవారు తరచూ తలస్నానం చేయకూడదు. దీనివల్ల మాడుమీద సహజనూనెల ఉత్పత్తి తగ్గిపోయి శిరోజాలు పొడిబారి నిర్జీవంగా కనిపిస్తాయి. వీరు వారానికి రెండుసార్లు తలస్నానం చేస్తే చాలు.
- పది రోజులకు ఒకసారైనా తలస్నానం చేయని పక్షంలో కుదుళ్ల దగ్గర బ్యాక్టీరియా వృద్ధి పొందుతుంది. దీనివల్ల చుండ్రు సమస్యలు వస్తాయి శిరోజాలకు రక్తప్రసరణ జరగక అవి రాలిపోతాయి.



- స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టాక తప్పనిసరిగా తలస్నానం చేయాలి. పూల్‌లో నింపిన నీటిలో క్లోరిన్ కలుపుతారు. ఇది శిరోజాలకు హాని కలిగిస్తుంది.
- దుమ్ము, ధూళి, కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివశించేవారు; ఎక్కువ దూరాలు ప్రయాణం చేసేవారు ప్రతిరోజూ తలస్నానం చేయడం మంచిది. లేదంటే తలలో ఫంగస్ పెరిగే అవకాశం ఉంది.
- వేసవికాలంలో తలలో ఎక్కువగా చెమట పడుతూ ఉంటుంది. దీనివల్ల మాడు మీద చెమటకాయలతోపాటు శిరోజాల సమస్యలు వస్తూ ఉంటాయి. అందుకే వేసవిలో వారానికి నాలుగుసార్లు తలస్నానం చేయడం మంచిది.



బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు

- సిమెంట్‌రోడ్లకు కేంద్రం నుంచి రావాల్సిన 700 కోట్లు
- ఈ నెలలోనే విడుదలవుతాయంటున్న అధికారులు
- నెలాఖరులోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచన
- ఏప్రిల్ మొదటి వారంలో బిల్లులు పొందవచ్చని భరోసా
- ఇప్పటికే కేంద్ర అధికారులను కలిసిన కమిషనర్ కృష్ణతేజ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పల్లె పండుగ సిమెంట్‌రోడ్లుకు బిల్లుల చెల్లింపు ఆలస్యం కావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన మెటీరియల్ నిధులు రూ.700 కోట్లు ఫిబ్రవరి చివరి వారంలోనే విడుదల కావాల్సి ఉంది. ఆ నిధుల కోసం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఢిల్లీ వెళ్లి అధికారులకు విజ్ఞప్తి కూడా చేశారు. ఈనెల 15 లోపు ఆ నిధులు విడుదలవుతాయని అధికారులు ఎదురు చూస్తున్నారు. 15 లోపు నిధులొస్తే ఈ నెలాఖరుకు మరిన్ని సిమెంట్‌రోడ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. ఈ నెలాఖరుకు కేంద్రం నుంచి నిధులు విడుదల కాకపోతే ఏప్రిల్‌లో కచ్చితంగా బడ్జెట్ అనంతరం ఎప్పటిలాగే నిధులు విడుదల చేసే అవకాశముంది. సుమారు రూ.2 వేల కోట్ల నిధులు అందే అవకాశముండటంతో నిధులకు ఇబ్బంది ఉండదు. ఈ లోపు నిధులందితే సిమెంట్‌రోడ్లతోపాటు మినీ గోకులాలు మరిన్ని నిర్మించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పల్లె పండుగలో రూ.2,882 కోట్ల పనులు మంజూరు

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల కింద పల్లె పండుగ కార్యక్రమంలో రూ.2,882 కోట్ల పనులు మంజూరుచేశారు. ఇందులో రూ.2,405 కోట్లతో 4,287 కి.మీలు సిమెంట్‌రోడ్లు, రూ.477 కోట్లతో 734 కి.మీ తారురోడ్లు నిర్మించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే, ఇప్పటి వరకు రూ.1,513 కోట్లతో 3,145 కి.మీ సిమెంట్‌రోడ్లు, రూ.138 కోట్లతో 180 కి.మీ తారు రోడ్లు పూర్తి చేశారు. ఇంకా 1,141 కి.మీ సిమెంట్‌రోడ్లు, 548 కి.మీ తారు రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికి 53 శాతం పనులు పూర్తయ్యాయి. క్యూరింగ్ పీరియడ్ పూర్తి కాకపోవడం తదితర కారణాల వల్ల ఇంజనీర్లు ఎంబుక్ రికార్డు చేయకపోవడంతో అధికారికంగా కొన్ని పనులు పూర్తయినట్లు నివేదికల్లో చూపించలేదు. కొంత మంది కాంట్రాక్టర్లు బిల్లులు వస్తాయో లేదో చూసి చేద్దామన్న యోచనతో పనులు చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. మరికొందరు మార్చి నెలాఖరులో బిల్లులొస్తాయన్న నమ్మకంతో పనులు వేగవంతం చేస్తున్నారు. మార్చి నెలాఖరులో కేంద్రం నుంచి నిధులు వచ్చినా ఏప్రిల్ మొదటి వారంలో చెల్లించే అవకాశముందని అధికారులు అంటున్నారు. వీలైనంత వరకు ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఇంజనీర్లకు సూచిస్తున్నారు. మెటీరియల్ నిధులు మార్చి నెలాఖరుకు డెడ్ అవుతున్నందున చెల్లింపులు జరిగినా, జరగకపోయినా నెలాఖరుకు పనులు పూర్తి చేయాలంటున్నారు. ఈ నెలాఖరుకు పూర్తి కాని పనులకు బిల్లులు మరో రెండు నెలల ఆలస్యం అయ్యే అవకాశముందని, అందుకే మార్చి నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మంజూరైన విసీ గోకులాలు కూడా నెలాఖరుకు పూర్తి చేసి ఎఫ్‌టీఓలు అప్‌లోడ్ చేస్తే ఏప్రిల్ మొదటి వారంలో బిల్లులు పొందవచ్చని చెబుతున్నారు.

బీసీలకు పెద్దపీట!



బీద రవిచంద్రకు స్వీట్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు

(మొదటి పేజీ తరువాయి)

బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ ఉన్నారు. ప్రస్తుతం 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాగా పొత్తులో భాగంగా జనసేనకు 1, బీజేపీకి 1 కేటాయించగా, 3 స్థానాలు టీడీపీ తీసుకుంది.

కలిసొచ్చిన కలుపుగోలు

కావలి నియోజకవర్గానికి చెందిన బీద రవిచంద్ర యాదవ్ టీడీపీకి తొలినుంచీ విధేయుడిగా ఉంటున్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన రవిచంద్ర ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా చేశారు. జిల్లాలో నాయకుల మధ్య ఎన్ని విభేదాలున్నా రవిచంద్ర విషయంలో అందరి నడుమ ఏకాభిప్రాయం ఉంటుంది. అందరినీ కలుపుకొని వెళ్లడం.. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా పనిచేయడం బీద రవిచంద్రను ఎమ్మెల్సీ రేసులో విజయం సాధించేలా చేశాయి. 2015లో ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన రవిచంద్రకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.

బలమైన గళం వినిపించేందుకు

పార్టీలో యువరక్తాన్ని తీసుకురావాలన్న ఆలోచనతోపాటు ఎస్సీ మహిళకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో శ్రీకాకుళానికి చెందిన కావలి గ్రీష్మకు ఎమ్మెల్సీ అవకాశం దక్కింది. మండలిలో వైసీపీకి ఆధిక్యం ఉండటం.. వారి తరఫున గట్టిగా మాట్లాడే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ధీటుగా ఎదుర్కోవాలంటే టీడీపీ నుంచి బలమైన గళాన్ని వినిపించే వారు ఉండాలన్న ఉద్దేశంతో ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. గ్రీష్మ గత ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం టికెట్ ఆశించారు. గ్రీష్మ తల్లి ప్రతిభా భారతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పని చేశారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులపై గ్రీష్మ విరుచుకుపడిన తీరు.. ఒంగోలులో నిర్వహించిన మహానాడులో వైసీపీ నాయకులను సవాల్ చేస్తూ తొడకొట్టిన తీరు ఆమెను పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా నిలిపాయి. 2017లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన గ్రీష్మ రాజాం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా చేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రీష్మను ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. తాజాగా ఆమెకు ఎమ్మెల్సీ అవకాశాన్ని ఇచ్చారు.

ఆశావహులకు బుజ్జగింపులు

ఎమ్మెల్సీ టికెట్ల కోసం ఈసారి భారీ సంఖ్యలో ఆశావహులు క్యూ కట్టారు. అయితే 3 స్థానాలే అందుబాటులో ఉండటంతో అందరికీ అవకాశం కల్పించడం సాధ్యం కాలేదు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ద్వారా ఆశావహులకు చెప్పించారు. ఆదివారం సాయంత్రమే ఆయన పిఠాపురానికి చెందిన ఎస్వీఎస్ఎన్ వర్మకు ఫోన్ చేసి పరిస్థితిని అర్థం చేసుకోవాలని, 2027లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని పార్టీ అధినేత మాటగా చెప్పమన్నారని తెలిపారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్, సీనియర్ నేతలు దువ్వారపు రామారావు, టీడీ జనార్దన్, గురజాల మాల్యాద్రి, తదితరులకు కూడా పల్లా ఫోన్ చేసి ఈసారికి సర్దుబాటు చేయలేకపోతున్నట్లు చంద్రబాబు మాటగాచెప్పారు. పొత్తు ధర్మంలో భాగంగా జనసేన, బీజేపీలకు 2 సీట్లు సర్దుబాటు చేసిన నేపథ్యంలో 2027 వరకు వేచి ఉంటే తప్పకుండా న్యాయం చేస్తామని వివరించారు. కాగా, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, బుద్దా వెంకన్న, కొమ్మాలపాటి శ్రీధర్ వంటి నేతలు కూడా ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. వారందరినీ పార్టీ పెద్దలు బుజ్జగించనున్నారు.

ఎమ్మెల్సీ టికెట్‌పై బీజేపీ నేతల పట్టు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూటమి మిత్ర పక్షం బీజేపీకి టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఒక సీటు కేటాయించారు. ఆ స్థానానికి అభ్యర్థిని ఎంపిక చేయడం బీజేపీకి పెద్ద పరీక్షగా మారింది. మాకంటే మాకే ఇవ్వాలంటూ నలుగురు సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారు. వీరిలో మాజీ ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ సహా.. గత ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన తపన్ చౌదరి, పాకా సత్యనారాయణ ఉన్నారు. వీరంతా ఆర్ఎస్ఎస్‌కు వీరవిధేయులు కావడంతో ఎవరికి టికెట్ కేటాయించాలన్న విషయంపై పార్టీ రాష్ట్ర చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం అర్ధరాత్రి వరకు భారీ కసరత్తు చేశారు. అయితే.. ఎవరికివారు పట్టుదలగా ఉండడంతో ఈ విషయాన్ని బీజేపీ అధిష్ఠానానికి నివేదించారు. దీంతో నామినేషన్లకు చివరి రోజైన సోమవారం ఉదయం ఈ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని, ఆ వెంటనే టికెట్ దక్కించుకున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చేస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే, పార్టీ వర్గాల కథనం మేరకు సోము వీర్రాజు, మాధవ్ ఇప్పటికే ఒకసారి ఎమ్మెల్సీలుగా పనిచేసినందున ఈసారి తపన్ చౌదరి, లేదా శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు పాకా సత్యనారాయణలలో ఒకరికి అవకాశం దక్కొచ్చని సమాచారం.

మాది బీసీ పక్షపాత పార్టీ: అచ్చెన్న

ఎస్సీ, బీసీలకు పదవులు ఇవ్వడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టీడీపీ అంటే బీసీల పక్షపాత పార్టీ అని మరోసారి రుజువైందని తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. కాగా, టీడీపీలో బీసీలకు, ఎస్సీలకు ఎలాంటి ప్రాధాన్యం ఉంటుందో మరోసారి రుజువైందని ఎమ్మెల్సీ అభ్యర్థి బీద రవిచంద్రయాదవ్ అన్నారు. విజయవాడలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. టీడీపీ తొలి నుంచీ బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఆనాడు ఎన్టీఆర్, ఇప్పుడు చంద్రబాబు దీనికి నిదర్శనమని తెలిపారు. పార్టీకి కొన్ని పరిమితులు ఉంటాయని, కూటమిలో ఉన్నాం కాబట్టి కొన్ని త్యాగాలు చేయాల్సి వస్తోందన్నారు. సీనియర్లకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తప్పకుండా న్యాయం చేస్తారని తెలిపారు.

విధేయతకు వీరతాడు!

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి ఒక్కొక్కరిని పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. రాయలసీమలోని కర్నూలు జిల్లాకు చెందిన బీసీ సామాజికవర్గానికి(బోయ) చెందిన బెందుల తిరుపతి నాయుడు(బీటీ నాయుడు)కి మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. రాయలసీమ ప్రాంతంలో బోయలు బలమైన సామాజికవర్గంగా ఉన్నారు. ఈ సామాజికవర్గంలో బీటీ నాయుడికి గట్టి పట్టుండటం కలిసి వచ్చింది. బీటీ నాయుడు 2009, 2014లో రెండు సార్లు కర్నూలు ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా పార్టీ పట్ల విధేయతతో పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల కారణంగా చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో అన్ని రోజులూ బీటీ నాయుడు ఆయనను కలిశారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన బీటీ నాయుడు ఆ సమయంలో చంద్రబాబు తరఫున న్యాయపోరాటానికి సలహాలు సూచనలు కూడా ఇచ్చారు. 2019లో ఎమ్మెల్సీగా పంపిన పార్టీ మరోసారి ఆయనకు అవకాశం కల్పించింది.

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా

అద్దంకి, శంకర్‌నాయక్, విజయశాంతి

ఒక సీటు మిత్రపక్షం సీపీఐకి కేటాయింపు



హైదరాబాద్/న్యూఢిల్లీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం 5 సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి 4 సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది. వీరిలో ఇద్దరిని కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచిన ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే ఎంపిక చేయడం గమనార్హం.

రేవంత్‌రెడ్డి సూచించిన అభ్యర్థులకే!

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా తనకు కావాల్సిన వారికి దక్కించుకున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అద్దంకి దయాకర్‌కు సరైన సమయంలో అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. మిగిలిన ఇద్దరు అభ్యర్థుల ఎంపికలోనూ ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని అంటున్నారు. కాగా, ఈ దఫా ఓసీలకు సీటు కేటాయించొద్దని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్సీ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. ఆయనతోపాటు రేసులో చివరివరకూ నిలిచిన వేం నరేందర్‌రెడ్డి, జెట్టి కుసుమ్‌కుమార్‌కూ నిరాశే ఎదురైంది. తొలుత వెండితెరపై, ఆ తర్వాత రాజకీయాల్లోనూ ఫైర్‌బ్రాండ్‌గా కొనసాగిన విజయశాంతి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల రేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. బీసీ మహిళ కోటాలో విజయశాంతిని అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ(యాదవ) సామాజిక వర్గానికి చెందిన నేత.. నెల్లికంటి సత్యం పేరును సీపీఐ ఖరారు చేసింది. కాగా, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరఫున.. బీసీ వర్గానికి చెందిన నేత దాసోజు శ్రవణ్ పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ఖరారు చేశారు. సోమవారం దాసోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు.



ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్‌తో సమావేశమైన కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మలబాబు, తమ్మయ్యబాబు

నేనెవరో తెలీదా..!?

- ఏం గాడిదలు కాస్తున్నారా..
- ప్రభుత్వ వైద్యురాలిపై జనసేన నేత దుర్భాషలు
- ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ తమ్మయ్యబాబు ఓవరాక్షన్
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సీరియస్
- వైద్యురాలికి క్షమాపణలు చెప్పించి.. సస్పెన్షన్

ప్రత్తిపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆయన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్.. వరుపుల తమ్మయ్యబాబు. ప్రభుత్వ వైద్యురాలిపై ఆగ్రహంతో ఊగిపోయారు. 'నేనెవరో తెలీదా ?' అంటూ వేలు చూపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గాడిదలు కాస్తున్నారా.. గడ్డి తింటున్నారా.. చదువుకున్న వాళ్లేనా?' అంటూ దుర్భాషలాడారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. తమయ్యబాబుతో ఆ వైద్యురాలికి క్షమాపణలు చెప్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాకినాడ జిల్లా లింగంపర్తి గ్రామానికి చెందిన కె.చంద్రకళ శనివారం తన తండ్రి చంద్రరావు, కొడుకు చంద్రశేఖర్‌తో కలిసి జగ్గంపేట నుంచి ఆటోలో వస్తుండగా బూరుగుపూడివద్ద ఆ ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెతోపాటు కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. రాత్రి డ్యూటీలో ఉన్న వైద్యురాలు సాయి శ్వేత వారికి వైద్యం అందించారు. ఈ క్రమంలో బాధితుల తరుపున ఆస్పత్రికి వచ్చిన వచ్చిన జనసేన కార్యకర్తలు.. తమ్మయ్యబాబుకు సమాచారం అందించారు. ఆయన ఫోన్‌లో డాక్టర్ శ్వేతతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆమె.. ఫోన్‌లో మాట్లాడేది ఎవరో తనకు తెలియదని, తాను మరొక రోగికి వైద్యం అందిస్తున్నానని బదులిచ్చారు. దీంతో కోపోద్రిక్తుడైన తమ్మయ్యబాబు వెంటనే ఆస్పత్రికి చేరుకుని తానెవరో తెలియదా? అంటూ వైద్యురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డాక్టర్ సౌమ్య.. కాకినాడ కలెక్టర్, కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు.

క్షమాపణలు.. సస్పెన్షన్

వైద్యురాలిని తమ్మయ్యబాబు దుర్భాషలాడిన విషయం జనసేనాని పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. తమ్మయ్యబాబుని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు.. తమ్మయ్యబాబుతో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యురాలు శ్వేత చేతులు పట్టుకుని తమ్మయ్యబాబుతో క్షమాపణలు చెప్పించారు.

ఎన్టీఆర్ వైద్య ట్రస్ట్.. అస్తవ్యస్తం!

సేవ కంటే రాజకీయాలకే అడ్డా

డా॥ ఎన్.టి.ఆర్ వైద్యసేవ — పేదలందరికి ఆధునిక వైద్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ రాజకీయాలకు అడ్డాగా మారింది. వైద్యంపై అవగాహన లేని అధికారులను నియమించడం, అర్హత లేని అధికారులను కీలకమైన స్థానాల్లో కూర్చోబెట్టడంతో ట్రస్ట్ ప్రధాన లక్ష్యం దారి తప్పుతోంది. ముఖ్యంగా ట్రస్ట్‌లో విభాగాధిపతులు అందినకాడికి దోచేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇతర శాఖలకు చెందిన కొంతమంది అధికారులు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో వాలిపోయారు. వీరి రాకతో ట్రస్ట్ పరిపాలన అస్తవ్యస్తంగా మారిపోయింది. అధికారులే ఒకరిపై మరొకరు అంతర్గతంగా ఫిర్యాదులు చేసుకోవడం... ట్రస్ట్‌లో వర్గాల వారీగా చీలిపోవడం... ఈవోలు, జేఈవోల పోస్టుల విషయంలో ఒక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం... వీరికి నచ్చని అధికారులపై బయట వ్యక్తులతో వీళ్లే ఫిర్యాదులు చేయించడం... వాటిని తీసుకువెళ్లి ట్రస్ట్ సీఈవో ముందు పెట్టడం... ఇలా ట్రస్ట్‌ను రాజకీయాలకు కేంద్ర బిందువుగా మార్చేశారు. బయట నుంచి వచ్చిన అధికారుల వ్యవహార శైలి ట్రస్ట్ సీఈవోకు పెద్ద తలనొప్పిగా మారింది. ట్రస్ట్ అధికారులంతా కలిసి వ్యవస్థ మొత్తాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు.

సర్కారు లక్ష్యానికి భిన్నంగా...

ప్రభుత్వం ఇన్సూరెన్స్ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తోంది. దానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే.. ట్రస్ట్ అధికారులు మాత్రం అంతర్గత వివాదాలతో ట్రస్ట్ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు. కొత్తగా వచ్చిన ట్రస్ట్ సీఈవో కూడా పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. కొత్తగా ట్రస్ట్‌లోకి వచ్చిన అవగాహన లేని అధికారులపై ఆధారపడుతున్నారు. దీంతో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో పాలన గాడి తప్పుతోంది. ట్రస్ట్‌లో ఎంప్యానల్‌మెంట్ అనేది కీలకం. ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలకు దీని ద్వారానే అనుమతులు ఇస్తారు. ఈ విభాగంలో కూడా అవినీతి ఎక్కువగా ఉంటోంది. మొన్నటి వరకూ ఎంప్యానల్‌మెంట్‌లో కీలకంగా వ్యవహరించిన అధికారిపై ఆరోపణలు వచ్చాయి. సదరు అధికారిపై ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడైనా సమర్థుడైన అధికారికి ఎంప్యానల్‌మెంట్ బాధ్యతలు అప్పగించారా.. అంటే అదీ లేదు.

గాడి తప్పిన పాలన.. లక్ష్యం పక్కదారి

ఒకే అధికారికి 3 విభాగాలు.. డీఎంఈ కార్యాలయంలో క్యాన్సర్ కేర్ యూనిట్లు పర్యవేక్షించే అధికారిని తీసుకువచ్చి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో కీలకమైన బాధ్యతలు అప్పగించారు. ఎంప్యానల్‌మెంట్ ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) బాధ్యతలతో పాటు ఈవో ఆపరేషన్స్, ఈవో ఈహెచ్ఎస్, చీఫ్ మెడికల్ ఆడిట్ విభాగాలు మొత్తం ఆయన చేతుల్లో పెట్టారు. ఎంప్యానల్‌మెంట్ విభాగంలోనే పని భారం ఎక్కువగా ఉంటుంది. ఈవో ఆపరేషన్స్ అంటే.. ప్రీ-ఆర్థలకు అనుమతులు ఇవ్వాల్సిన బాధ్యత ఈ విభాగానిదే. ఈహెచ్ఎస్ కూడా ట్రస్ట్‌లో కీలకం. ఈ మూడు విభాగాలను ఒకే అధికారి చేతుల్లో పెట్టారు. డీఎంఈ కార్యాలయంలో క్యాన్సర్ కేర్ యూనిట్ల పర్యవేక్షణలో సదరు అధికారులు అంత యాక్టివ్‌గా ఉండే వారు కాదు. అలాంటి వ్యక్తికి ట్రస్ట్‌లోని కీలకమైన విభాగాలు మొత్తం అప్పగించేశారు. ట్రస్ట్ అధికారులు ఏ ఉద్దేశంతో బాధ్యతలు మొత్తం ఆయనకు అప్పగించారో? తాము చేసే అవినీతిని ప్రశ్నించకూడదు.. చెప్పినట్లు చేసేవారు కావాలన్న ఉద్దేశంతో సదరు అధికారిని ట్రస్ట్‌కు తెచ్చారన్న విమర్శలున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌పై ఆరోగ్య శాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ట్రస్ట్ నిర్వహణపై అధికారులు కనీసం దృష్టి పెట్టడం లేదు. దీంతో ట్రస్ట్‌లో కొంతమంది అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోయింది. ట్రస్ట్‌పై కనీస అవగాహన లేని ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులకు కీలకమైన విభాగాల బాధ్యతలు అప్పగించారు. ట్రస్ట్‌లో సదరు అధికారుల రచ్చ అంతా ఇంతా కాదు. ఒక అధికారి ఆస్పత్రులను ఎలా ఇబ్బందులు పెడతామని ఆలోచిస్తే.. మరో అధికారి ఆస్పత్రుల నుంచి వసూళ్లు చేసుకోవడం ఎలా అన్న దానిపైనే దృష్టి పెడుతున్నారన్న విషయం బహిరంగ రహస్యంగా మారింది. పేదవాడికి ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ముందుకు వెళ్తుంటే... సదరు అధికారులు మాత్రం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వ్యవహరిస్తున్నారు.



నెల్లూరు హరనాథపురంలో సిమెంట్ రోడ్డు శంకుస్థాపన సందర్భంగా మహిళలతో అక్షింతలు చల్లిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఒకేరోజు 105 ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి మంత్రి లోకేశ్ ప్రశంస
- నెల్లూరు రూరల్‌లో నూతన అధ్యాయం

నెల్లూరురూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నూతన రాజకీయ అధ్యయనానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గంలోని 26 మున్సిపల్ డివిజన్ల పరిధిలోని 105 ప్రాంతాల్లో ఒకే రోజు 9.50 కోట్ల విలువజేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించారు. వీటిల్లో కొన్ని ప్రాంతాల్లో ఆయన పాల్గొని స్థానికులతో అక్షింతలు వేయించి పనులు ప్రారంభించారు. వీటితోపాటు 14వ తేదీలోపు మరో 198 ప్రాంతాల్లో శంకుస్థాపనలకు రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాగా, ఒకేరోజు 105 పనులకు శంకుస్థాపన నిర్వహించడం పై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమం బహుశ దేశ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమం అని పేర్కొంటూ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు.

బర్డ్ ఫ్లూతో పౌల్ట్రీకి రూ.200 కోట్ల నష్టం

- నెక్ చైర్మన్ కేవీ సుబ్బారావు

తణుకు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పౌల్ట్రీ పరిశ్రమకు రూ.200 కోట్ల నష్టం వాటిల్లినట్లు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(నెక్) రాష్ట్ర చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రస్తుతం కోళ్లలో బర్డ్ ఫ్లూ వైరస్ తగ్గిపోయినప్పటికీ చికెన్, గుడ్ల వినియోగంలో ప్రజల్లో భయం పోలేదన్నారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి పౌల్ట్రీ రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఉపశమన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా రుణాలను రీ షెడ్యూల్ చేసి రుణాలు ఇవ్వాలని కోరారు.

'ఆసుపత్రి' సాకు ఉత్తిదే

చెన్నై అపోలోకు వెళ్లని బోరుగడ్డ.. కూతుళ్లతో వెళ్లిన తల్లి పద్మావతి

అనంతపురం క్రైం, మార్చి9(ఆంధ్రజ్యోతి): మధ్యంతర బెయిల్‌పై వచ్చి అజ్ఞాతంలో ఉన్న రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ వ్యవహారంలో అసలు విషయం బయటపడింది. తన తల్లికి చికిత్స పేరిట హైకోర్టులో బెయిల్ గడువు పొడిగించుకున్న అనిల్ అసలు ఆసుపత్రికే వెళ్లలేదు. అనిల్ తల్లి చికిత్స చేయించుకున్న చెన్నైలోని అపోలో ఆసుపత్రికి అతడు వెళ్లలేదని పోలీసులు ఆధారాలు సేకరించారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు సోమ, మంగళవారాల్లో కోర్టులో ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది. హైకోర్టుకు బోరుగడ్డ సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ ఫోర్జరీ అని తేలిన సంగతి తెలిసిందే. దీంతో అజ్ఞాతంలో ఉన్న అనిల్ కోసం పోలీసులు గాలించడంతో శనివారం అతడు ఓ వీడియో విడుదల చేశాడు. ఫోర్జరీ చేసిన విషయం గురించి మాట్లాడకుండా తల్లికి సర్జరీ కోసం బెయిల్‌పై వచ్చినట్టు మొసలి కన్నీరు కారుస్తూ, కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశాడు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన పోలీసులు



'ఆసుపత్రి' సాకుపై సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కూపీ లాగారు. పోలీసులను, కోర్టును త ప్పుదోవ పట్టించినట్టు తేలింది. అనిల్ తన తల్లికి ఊపిరితిత్తుల సమస్య ఉందంటూ నయం చేయించడానికి హైకోర్టులో ఫిబ్రవరి 15 నుంచి 28 వరకు మధ్యంతర బెయిల్ పొందాడు. గడువులోగా జైలు సూపరింటెండెంట్ వద్ద లొంగిపోయాడు. అనంతరం తన తల్లి ఆరోగ్యం క్షీణించిందని, చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయించాలని, మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని ఈ నెల 1న పిటిషన్ వేశాడు. ఆ పిటిషన్ ఆధారంగా ఈ నెల 11వ తేదీ వరకు మధ్యంతర బెయిల్‌ను కోర్టు పొడిగించింది. కాగా బోరుగడ్డ తన తల్లికి చికిత్స పేరి ట సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నకిలీదని గుంటూరు పోలీసులు నిర్ధారించారు.అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో ఆరా తీశారు. బోరుగడ్డ తల్లి పద్మావతి ఆ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని గత నెల 23న డిశ్చార్జి అయ్యారు. ఆమె తన కుమార్తెలతో కలిసి ఆసుపత్రికి వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ నెల 2న చెకప్ కోసం మరోసారి వెళ్లారు. పోలీసుల విచారణలో ఈ రెండు సందర్భాల్లోనూ బోరుగడ్డ ఆసుపత్రికి వెళ్లలేదని తెలిసింది. మరి ఆ సమయంలో అనిల్ ఎక్కడికెళ్లాడనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, పోలీసు లు బోరుగడ్డ కదలికలపై ప్రత్యేక నిఘా వేశారు. ఓ పోలీసు బృందం తెలంగాణకు వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే బోరుగడ్డ రద్దు చేయాలంటూ కోర్టులో పిటిషన్ వేశారు. సెక్షన్ 111 బీఎన్ఎస్-2023 తనకు వర్తించదంటూ బోరుగడ్డ బెయిల్ కోసం వెళ్లడాన్ని పోలీసులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

'మొక్కజొన్న తోటలో... ముసిరిన చీకట్లలో'... అనే పాటకు 1,116 మంది విద్యార్థులు నృత్యం చేశారు. దానిని తిలకించిన ప్రేక్షకులు పులకించిపోయారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో ఆదివారం మధ్యాహ్నం జానపద నృత్య కళాకారుడు, డ్యాన్స్ మాస్టర్ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల పాటు నగరంలోని మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు నృత్య శిక్షణ ఇచ్చారు. ఆదివారం ఆ విద్యార్థినులంతా ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనను గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులతోపాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డుల ప్రతినిధులు తిలకించారు. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును త్వరలో ప్రకటిస్తామని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. మిగిలిన ఐదు వరల్డ్ రికార్డుల సంస్థల ప్రతినిధులు డ్యాన్స్ మాస్టర్ నారాయణమూర్తికి మెడల్స్, రికార్డులు ప్రదానం చేశారు. ఈ అవార్డులను తమ తల్లిదండ్రులకు, భారత్ జవాన్లకు అంకితం ఇస్తున్నామని నారాయణమూర్తి ప్రకటించారు.

- నెల్లూరు సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి

టన్నెల్ ప్రమాదం.. గురుప్రీత్ మృతదేహం లభ్యం

- ఏడు లేయర్ల కింద గుర్తింపు.. మిగతా ఏడుగురి కోసం గాలింపు



గురుప్రీత్ సింగ్



ప్రమాద సమయంలో తీసిన ఫొటోలో కనిపిస్తున్న గుర్‌ప్రీత్‌సింగ్ చేయి(ఫైల్)

మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/దోమలపెంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందిలో.. 16 రోజుల సహాయక చర్యల తర్వాత ఒకరి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ర్యాబిన్స్ ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. ఆయన స్వస్థలం పంజాబ్‌లోని చీమాకలాన్. కేరళ నుంచి తెప్పించిన క్యాడవర్ డాగ్స్ గుర్తించిన చోటే.. గురుప్రీత్ మృతదేహం లభ్యమైంది. శనివారం రాత్రి సహాయక బృందాలకు ఓ చేయి కనిపించగా.. కాంక్రీట్‌లా గట్టిపడ్డ మట్టిలోంచి.. దెబ్బతినకుండా మృతదేహాన్ని తీసేందుకు 12 గంటలు శ్రమించాయి. మృతదేహం నిలువున ఉన్నట్లు గుర్తించి, 12 అడుగుల మేర తవ్వకాలు జరిపాయి. టీబీఎం వ్యర్థాలను ఏడు లేయర్ల మేర తొలగించాక, మృతదేహం లభ్యమైంది. ఆదివారం అర్ధరాత్రి నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవ్వగా.. మృతదేహాన్ని పంజాబ్‌కు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత సోమవారం నుంచి గాలింపును తీవ్రతరం చేయగా.. జీపీఆర్ రాడార్లు, ఆక్వా-ఐ యంత్రాలు, స్నిఫర్ డాగ్స్ క్యాడవర్ శునకాలను వినియోగించారు. ప్రమాదం జరిగిన మొదటిరోజు లభించిన ఫొటోల్లోనే ఒక చేయి కనిపించింది. 'ఆంధ్రజ్యోతి'లో ఆ ఫొటో ప్రచురితమైంది. ప్రమాదం జరుగుతున్న సమయంలోనే భయంతో పరుగులు పెట్టిన కార్మికుల్లో ఒకరు తీసిన ఫొటో అది. మొదటి ప్రమాదం జరిగినప్పుడు ఆ ఫొటో తీయగా.. తర్వాత మరోసారి పైకప్పు కూలడంతో ఆ చేయి ఉన్న ప్రాంతాన్ని గుర్తించడం సాధ్యం కాలేదు. గురుప్రీత్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల పరిహారం ప్రకటించారు. రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. సహాయక చర్యల్లో సీఎం వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం, కాంట్రాక్టు సంస్థ రూ.50 లక్షల చొప్పున రూ.కోటి పరిహారం అందించి, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



అంచనాలకు భిన్నంగా లానినా

వేసవి ఆరంభంలోనే మండుతున్న ఎండలు.. వేడి వాతావరణంపై లానినా ప్రభావం ఉండకపోవచ్చు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయి. ఏటేటా నిపుణుల అంచనాలకు భిన్నంగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడి వాతావరణం, రోజుల తరబడి వడగాడ్పులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది వేసవి మరింత వేడిగా ఉంటుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. అయితే పెరుగుతున్న ఎండలు, వడగాడ్పులపై పసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న 'లానినా' ప్రభావం ఉండబోదని నిపుణులు అంచనా వేస్తున్నారు. లానినాతో పసిఫిక్ మహాసముద్రంలో చల్లగా ఉండే ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావంతో దేశంలో వేసవి కొంత చల్లగా ఉంటుందన్న అంచనాలకు భిన్నంగా ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. సాధారణంకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు, తీవ్రమైన దీర్ఘకాల వేడి తరంగాలతో 1901 నుంచి ఇప్పటి వరకు ఈ ఏడాది ఫిబ్రవరి అత్యంత వేడి నెలగా నమోదైంది. ఈసారి వెచ్చని శీతాకాలం, తక్కువ వ్యవధిలో వసంతకాలం కొనసాగిందని ముంబై ఐఐటీ చెందిన సెంటర్‌ఫర్ క్లైమేట్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ అర్పితా పేర్కొన్నారు.

లానినా కాలపరిమితి స్వల్పమే: డబ్ల్యూఎంవో

సాధారణంగా లానినా ఉంటే చల్లని వాతావరణం, ఎల్‌నినో కొనసాగితే వేడి వాతావరణం నెలకొంటాయి. అయితే వాతావరణంలో మార్పుల ప్రభావంతో లానినా కొనసాగినా.. వేడి ప్రభావం కనిపిస్తుందని మరికొందరు నిపుణులు అభిప్రాయపడ్డారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఏర్పడాల్సిన లానినా ఒకింత ఆలస్యంగా డిసెంబరులో వచ్చిందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) పేర్కొంది. ప్రస్తుత లానినా కాలపరిమితి స్వల్పమేనని, వచ్చే నెలాఖరుకు పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని తాజాగా వెల్లడించింది. కాగా, గతేడాది దేశంలో రోజుల తరబడి వడగాడ్పులు కొనసాగాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు. గాంధీనగర్ ఐఐటీ ప్రొఫెసర్ విమల్ మిశ్రా మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల ప్రభావంతో గతనెల నుంచి దేశంలో వెచ్చని వాతావరణం చూస్తున్నామని, వచ్చే రెండు, మూడు నెలల్లో వడగాడ్పుల తీవ్రతను చవిచూస్తామని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న బలహీనమైన లానినా ఉపశమనం కలిగించకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

ఆలమూరులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత


అమరావతి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం నంద్యాల జిల్లా ఆలమూరులో 40.3, కర్నూలు జిల్లా లద్దగిరిలో 39.6, కడప జిల్లా నల్లచెరువుపల్లిలో 39.4, శ్రీసత్యసాయి జిల్లా కుటగుల్ల, పెనుగొండలో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొన్ని మండలాల్లో వడగాడ్పులు వీచాయి. సోమవారం అల్లూరి జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మన్యం, అల్లూరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

అభినవ అన్నమయ్య గరిమెళ్ల అస్తమయం

- టీటీడీ ఆస్థాన విద్వాంసుడు బాలకృష్ణ ప్రసాద్ తుదిశ్వాస



గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ భౌతికకాయం



యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన విభావరిలో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

తిరుపతి/అమరావతి/యాదగిరిగుట్ట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అభినవ అన్నమయ్యగా కీర్తినందుకున్న టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) ఇక లేరు. తిరుపతి భవానీనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ఆదివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రముఖ సంగీత విద్వాంసుడిగా ప్రఖ్యాతి గాంచిన గరిమెళ్ల 600కు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరచి వెలుగులోకి తెచ్చారు. 6వేలకు పైగా కచేరీలు చేశారు. ప్రత్యేకించి 'వినరో భాగ్యము విష్ణుకథ', 'పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు', 'జగడపు చనువుల జాజర', 'తిరువీధుల మెరసీ దేవదేవుడు', 'సందెకాడ పుట్టినట్టి ఛాయల పంట', 'ఇతడొకడే సర్వేశ్వరుడు', 'నమో నారాయణాయ నమో' వంటి కీర్తనలు ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. సంప్రదాయ కర్ణాటక సంగీతంతో పాటు లలిత సంగీతం, జానపద సంగీతంలోనూ ఆయన సుప్రసిద్ధులు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన లక్ష గళార్చనలో బాలకృష్ణ ప్రసాద్ ప్రధాన గాయకులు. ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్‌లో నమోదైంది.

శ్రీవారి సేవకే అంకితం

1948లో రాజమండ్రిలో కృష్ణవేణి, నరసింహరావు దంపతులకు గరిమెళ్ల జన్మించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్.జానకి ఈయనకు స్వయాన పిన్ని. మృదంగ విద్వాంసులైన తండ్రి నుంచి సంగీతం పట్ల మక్కువ పెంచుకున్నారు. 1978లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరిన ఆయన 2006లో ఉద్యోగ విరమణ పొందారు. 2012 నుంచి 2023 వరకూ టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా కొనసాగారు. అన్నమయ్య కీర్తనలను ప్రపంచ వ్యాప్తం చేశారు. నేదునూరి కృష్ణమూర్తి, పశుపతి వంటి గురువుల వద్ద శిక్షణ పొందిన ఆయన 300 కీర్తనలను నాన్‌స్టాప్‌గా పాడారు. ఎందరో శాస్త్రీయ కచేరీలు చేసినా తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత గరిమెళ్లకే దక్కుతుంది. హరి సంకీర్తన ద్వారా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. సినిమా అవకాశాలు వచ్చినా శాస్త్రీయ సంగీతానికి, స్వామివారి సేవకు జీవితాన్ని అంకితం చేశారు. 2020లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. అపర అన్నమయ్య, అన్నమాచార్య సంకీర్తనా మహతి బిరుదులు స్వీకరించారు. గరిమెళ్ల మంచి భక్తి గీత రచయిత కూడా. శ్రీవేంకటేశ్వర స్వామి సేవకులుగా ఉన్నప్పటికీ ఆయన స్వతహాగా హనుమాన్ భక్తులు. 21 ఆంజనేయ కృతులు రచించి స్వరపరిచారు. వినాయకుడిపై 50 కృతులు రచించారు. దాదాపు 150 శివ పద కీర్తనలను స్వరపరచి ఆలపించారు. వెయ్యికి పైగా కీర్తనలు రచించి స్వరపరచి జనబాహుళ్యంలోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. ఆయన స్వరపరచిన సంకీర్తనలను టీటీడీ అనేక పుస్తకాలుగా ప్రచురించింది. టీటీడీతో పాటు కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసులుగా సేవలు అందించారు. రాజమండ్రి వాస్తవ్యులైన గరిమెళ్ల... తిరుపతిలో స్థిరపడి అన్నమయ్య అంశగా గుర్తింపు పొందారు. కాగా, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు భార్య రాధ, కుమారులు పవన్ కుమార్, అనిల్ కుమార్ ఉన్నారు. ప్రస్తుతం కుమారులిద్దరూ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వీరు రావడం ఆలస్యం కానుండటంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి పట్ల సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీటీడీలో ఆస్థాన గాయకుడిగా పనిచేసిన ఆయన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. గరిమెళ్ల.. తన మధుర గాత్రంతో శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలకు పాత్రులయ్యారని, అలాంటి మహనీయుడు మనల్ని వదిలి వెళ్లడం బాధాకరమని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, గరిమెళ్ల మృతి పట్ల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. కాగా, ఈ నెల 6న తెలంగాణలోని యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఇంతలోనే ఆయన కన్నుమూశారని తెలిసి సంగీత ప్రియులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.2.46 కోట్లు కొట్టేశారు!

- ఇన్‌స్టాలో ట్రేడింగ్ లింకుతో ఘరానా మోసం
- నెల్లూరు పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నగదు పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని నమ్మించి పలు దఫాలుగా రూ.2.46 కోట్లు దోచేసిందో ముఠా!. ఈ ఘటనపై బాధితురాలు ఆదివారం రాత్రి నెల్లూరులోని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నగరంలోని పొగతోటకు చెందిన ఓ మహిళకు రెండు బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నాయి. ఇటీవల ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై లింకు వచ్చింది. ఆ లింకును ఆమె క్లిక్‌చేసిన వెంటనే వాట్సాప్ నంబరుకు నిషాబసు అనే మహిళ మెసేజ్ పంపారు. తాను షైరే అసెట్ షేర్‌ఖాన్ కంపెనీకి ఉద్యోగిని అంటూ పరిచయం చేసుకుంది. ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో లాభాలు వచ్చేందుకు సలహాలు, సూచనలు ఇస్తామని తమ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ఆమె మాటలను నమ్మిన ఆ మహిళ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అందులో తన పాన్, ఆధార్, బ్యాంకు వివరాలను పొందుపరిచింది. యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న మొదట్లో కొంత నగదును యాప్‌లో పెట్టుబడిగా పెడితే రెట్టింపు నగదు ఆదాయంగా వచ్చింది. దీంతో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే అధికంగా ఆదాయం వస్తుందని భావించి ఈ ఏడాది జనవరి 23 నుంచి ఫిబ్రవరి 3 వరకు పలుదఫాలుగా రూ.2,46,30,396 డిపాజిట్ చేశారు. వారు అకౌంట్‌లో రూ.4,02,24,759 నగదు ఉన్నట్లు ఆమెకు చూపెట్టారు. ఈ నెల 3న నగదు డ్రా చేసేందుకు యత్నించగా డ్రా కాలేదు. దీంతో కంపెనీ కస్టమర్ కేర్‌ను సంప్రదించగా నగదు డ్రా చేయాలంటే కొంత డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితురాలు ఈ నెల 6న ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఆదివారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

పారిశ్రామికవేత్త రాహుల్ హత్య కేసులో ట్విస్ట్

మాజీమంత్రి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి పేర్ల ప్రస్తావన



రాహుల్ (ఫైల్)

- దర్యాప్తును తప్పుదోవ పట్టించిన వెలంపల్లి, రఘురాం!
- సీఐడీ విచారణ కోరుతున్న రాహుల్ తండ్రి
- పునఃదర్యాప్తునకు సిఫారసు చేస్తూ డీజీపీకి మంత్రి కొలుసు, ఎమ్మెల్యే బొండా లేఖలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

యువ పారిశ్రామికవేత్త కరణం రాహుల్ కేసు మూడేళ్ల తర్వాత కొత్త మలుపు తిరిగింది. విజయవాడ పోలీసులు విచారణ పూర్తిచేసి, న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశాక కేసును పునఃదర్యాప్తు చేయాలన్న డిమాండ్ వస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితులతో పాటు రాహుల్ తండ్రి ఇదే డిమాండ్ చేస్తున్నారు. 2021 ఆగస్టు 18న ఇంటి నుంచి బయటకు వచ్చిన రాహుల్ 19వ తేదీ ఉదయం ఠాగూర్ రైసుమిల్లు వీధిలో కారులో డ్రైవర్ సీట్లో చనిపోయి ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా మాజీ కార్పొరేటర్ కోరాడ విజయ్ కుమార్, రెండో నిందితుడిగా పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ అలియాస్ సత్యం ఉన్నారు. ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, దీన్ని పునఃదర్యాప్తు చేయించాలని డీజీపీగా సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఉన్నప్పుడు కోగంటి సత్యం ఫిర్యాదు చేశారు. అందులో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పేర్లను ప్రస్తావించారు. కేసు దర్యాప్తును సీబీఐకి గానీ, సీఐడీకి గానీ అప్పగించాలని లేఖలో కోరారు. ఇదిలా ఉండగా రాహుల్ తండ్రి రాఘవరావు తన కుమారుడి హత్య కేసులో దర్యాప్తు సమగ్రంగా జరగలేదని, ఈ హత్య వెనుక పెద్దలు ఉన్నారని కొద్దిరోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కేసు సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఇదిప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాహుల్ హత్య కేసు నాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. పోలీసులు దర్యాప్తు చేసి ఈ హత్యకు కర్త, కర్మ, క్రియ కోరాడ విజయ్‌కుమార్, కోగంటి సత్యం అని అప్పట్లో నిర్ధారించారు. కాగా, కోగంటి సత్యం ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించాలని మంత్రి కొలుసు పార్థసారథి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తాజాగా లేఖలు ఇచ్చారు. వాస్తవాలు ఏమిటో ప్రాథమికంగా తేల్చాలని రాజమహేంద్రవరం సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలోని అధికారులకు కేసును అప్పగించారు. దీనిపై వారు ఒక ప్రాథమిక నివేదికను డీజీపీ కార్యాలయానికి ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాలు ఇస్తానని కోగంటి సత్యం సన్నిహితుల వద్ద చెప్పినట్టు తెలిసింది. రాహుల్ హత్య కేసు విచారణను తప్పుదారి పట్టించినవారిలో అప్పటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, జగన్ సన్నిహితుడు తలశిల రఘురాం పేర్లను ప్రస్తావించినట్టు తెలుస్తోంది.

పంచాయతీరాజ్ ప్రక్షాళన!

వ్యవస్థలన్నీ ఒకే గొడుగు కిందకు.. మొదటిసారిగా సంస్కరణల బాట

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ
- ఉద్యోగ సంఘాలు, భాగస్వాములతో చర్చలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



పంచాయతీరాజ్ శాఖ ప్రక్షాళనకు మొదటి అడుగు పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఆ శాఖను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆ శాఖకు సంబంధించిన వ్యవస్థలన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి గ్రామీణులకు విస్తృతంగా సేవలందించాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ నిపుణులతో సంప్రదించిన ఉపముఖ్యమంత్రి.. అన్నిటినీ ఒక చోటకు తెచ్చే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 22న డివిజినల్ అభివృద్ధి అధికారులు (డీఎల్‌డీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవోలు), ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారులు (డిప్యూటీ సీఈవోలు), డివిజినల్ పంచాయతీ అధికారులు (డీఎల్‌పీవోలు), విస్తరణ అధికారుల (పీఆర్-ఆర్‌డీ ఈవోలు) ఉద్యోగ సంఘాలు, పంచాయతీరాజ్ అసోషియేషన్ జేఏసీ నేతలతో తాడేపల్లి కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ, ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపట్టదలచిన సంస్కరణలను వారి ముందుంచారు. వీటిపై అన్ని కేడర్ల అధికారులు సంతృప్తి చెంది.. ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉపముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రక్షాళన దశలో మొదట ఉద్యోగుల కేడర్ విషయంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. ముందుగా ఈ శాఖలో పనిచేసే అధికారుల కేడర్ హోదాకు సంబంధించి ఉన్న అంతరాలను తొలగించే ప్రతిపాదనను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంతో మొదటి అడుగు విజయవంతమైంది.

కేడర్ పోస్టులకు ఒకే హోదా..

సంస్కరణల్లో మొదటగా ఎంపీడీవో, డీఎల్‌పీవోలను ఒకే కేడర్‌గా నిర్ధారించారు. అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్‌లో ఉన్న డీపీవోలకు డివిజినల్ అభివృద్ధి అధికారి (డిప్యూటీ డైరెక్టర్) హోదా కల్పించారు. ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీసీ) ప్రిన్సిపాళ్లకు డిప్యూటీ కమిషనర్ (అదనపు డైరెక్టర్) హోదా ఇచ్చారు. డీడీవో, డిప్యూటీ సీఈవో, డీపీవోలను ఒకే కేడర్ కిందకు చేర్చారు. వారు పదోన్నతి పొంది జడ్పీ సీఈవోలవుతారు. అయితే ఎంపీడీవోలను దేశవ్యాప్తంగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(బీడీవో)లుగా పిలుస్తున్నందున మన రాష్ట్రంలో కూడా బీడీవోలుగానే పరిగణించాలని పంచాయతీరాజ్ అధికారుల సంఘాలు గతంలో ప్రభుత్వాన్ని కోరాయి. దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 50 శాతం జడ్పీ సీఈవో పోస్టులను ఐఏఎస్ అధికారులతో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఐఏఎస్‌లు లేకపోతే ఆ ఖాళీలను పంచాయతీరాజ్ శాఖలోని ఫీడర్ కేటగిరీ నుంచి భర్తీ చేస్తారు. లేదంటే డిప్యుటేషన్‌పై నియమించుకునే వెసులుబాటు కూడా కల్పించారు.

ఎంపీడీవోల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు చెక్..

తాజా సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవోలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించకుండా పదోన్నతులతో భర్తీ చేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. పీఆర్-ఆర్‌డీ ఈవో కేడర్‌ను ఇక నుంచి డిప్యూటీ ఎంపీడీవోలుగా పరిగణిస్తారు. జడ్పీ సీఈవోలుగా ఇతర శాఖల అధికారులను డిప్యుటేషన్‌పై నియమించుకోవచ్చన్న నిర్ణయం కొందరు పంచాయతీరాజ్ అధికారులకు మింగుడు పడడంలేదు. 50 శాతం జడ్పీ సీఈవో పోస్టులను ఐఏఎస్ అధికారులకు కేటాయించడాన్ని వారు వ్యతిరేకించడం లేదు. కానీ ఫీడర్ కేడర్ లేకుంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై నియమించుకోవచ్చన్న నిర్ణయాన్ని రెవెన్యూ అధికారులు అవకాశంగా తీసుకుంటారని అనుమానిస్తున్నారు. శాఖలోకి ఇతర అధికారులు రాకుండా కట్టడి చేసే విధంగా సంస్కరణలు ఉండాలని, ఈ ఒక్క నిర్ణయాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు. పంచాయతీరాజ్ శాఖలో 300 మంది డీడీవోలు పనిచేస్తున్నారని.. అధికారుల కొరత లేదని.. కాబట్టి జడ్పీ సీఈవోలుగా ఇతర శాఖల అధికారులను డిప్యుటేషన్‌పై నియమించేందుకు ఇచ్చిన వెసులుబాటును తొలగిస్తూ సవరణచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏకతాటిపైకి పంచాయతీరాజ్ పాలన..

రాష్ట్రంలో అన్ని శాఖల కంటే పంచాయతీరాజ్ శాఖ చాలా పెద్దది. లక్ష మందికి పైగా ఉద్యోగులున్న ఈ శాఖలో పాలన ఒక తాటి మీద లేకపోవడంతో గ్రామీణాభివృద్ధి సజావుగా సాగడం లేదు. ఎన్నో ఏళ్లుగా పాలకులు, బ్యూరోక్రాట్లు సంస్కరణలు తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా ఉపముఖ్యమంత్రి జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థలన్నీ ఒకే చోట ఉండాలని నిర్ణయించారు. జడ్పీ సీఈవో, డీఎల్‌డీవో, డీపీవో, పీఆర్ ఇంజనీరింగ్ ఎస్ఈ కార్యాలయాలన్నింటినీ ఒకే కాంపౌండ్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీని వల్ల పంచాయతీరాజ్ పాలన సజావుగా సాగించేందుకు వీలవుతుందని భావిస్తున్నారు. ఇది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీరాజ్ ఉద్యోగులకూ ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. ఒక వ్యవస్థతో మరో వ్యవస్థ పరస్పరం సహకరించుకునేలా ఇలా ఏకీకృతం చేస్తున్నారు.

రాజధాని పనులకు రైట్ రైట్!

- ఈ వారంలోనే కాంట్రాక్టర్లతో ఎల్‌వోఏ పూర్తి
- నెలాఖరుకు పునఃప్రారంభం కానున్న పనులు
- 17న అసెంబ్లీ, హైకోర్టు పనులకు ఏజెన్సీల ఖరారు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి నిర్మాణ పనుల ప్రారంభానికి ముహూర్తం దాదాపుగా ఖరారయింది. ఒకటి రెండు రోజుల్లో బిడ్ల పరిశీలనతో పాటు కాంట్రాక్టర్లతో లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) పూర్తవనుంది. ఆ ప్రక్రియ పూర్తయితే ఈ నెలాఖరు నాటికి పనులు పునఃప్రారంభం కానున్నాయి. వైసీపీ సర్కారు హయాంలో ఐదేళ్ల క్రితం ఆగిపోయిన పనులను కూటమి ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించినట్లవుతుంది. పనుల ప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

62 పనులకు టెండర్లు

అమరావతిలో 90 పనులు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో 73 పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. అందుకోసం రూ.48వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. ఇప్పటికే రూ.40,000 కోట్ల విలువైన 62 పనులకు ఈ ఏడాది జనవరిలోనే సీఆర్డీఏ అధికారులు టెండర్లు పిలిచారు. ఫిబ్రవరిలోనే ఆ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమవుతాయని భావించినప్పటికీ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో జాప్యం జరిగింది. తాజాగా కోడ్ తొలగిపోవడంతో కాంట్రాక్టర్ల టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లను అధికారులు పరిశీలించి ఏజెన్సీలను ఖరారు చేస్తున్నారు. వాటికి సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలపాల్సి ఉంది. ఆ వెంటనే కాంట్రాక్టర్లతో ఎల్‌వోఏ ప్రక్రియ పూర్తిచేస్తారు. ఈ నెలఖరుకల్లా కొన్ని పనులు, విగిలినవి ఏప్రిల్‌లో ప్రారంభమవుతాయి. అయితే తాజా టెండర్లలో నాలుగు పనులకు ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదని అధికారులు చెబుతున్నారు. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల భవన సముదాయాల పనులకు పిలిచిన టెండర్లకు ఎవరూ స్పందించకపోవడంతో, మళ్లీ కొత్త టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

అంతర్గత రహదారుల్లో జోరు

రాజధాని నిర్మాణంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన పనుల్లోనూ కూటమి ప్రభుత్వం వేగం పెంచింది. అమరావతిలో అసంపూర్తిగా ఉండిపోయిన ఈ-2, ఈ-4, ఈ-5, ఈ-7 ఈ-11, ఈ-13, ఈ-15, ఎన్8, ఎన్13 రహదారుల నిర్మాణానికి రూ.2,903.76 కోట్లతో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) ఫిబ్రవరి 15న బిడ్లను ఆహ్వానించింది. వాటి గడువు ఈ నెల 3తో ముగిసింది. అదేరోజున బిడ్లను పరిశీలించి అర్హులను నిర్ణయించాల్సి ఉండగా, కోడ్ కారణంగా ఆ ప్రక్రియ ఆగిపోయింది. కోడ్ ముగియడంతో ఆ పనులూ ఈ వారంలో ప్రారంభం కానున్నాయి.

అసెంబ్లీ, హైకోర్టు టెండర్లకు 17వరకే గడువు



రాజధాని అమరావతి గుండెకాయగా ఉండే శాసనసభ, హైకోర్టు శాశ్వత భవనాల నిర్మాణ పనులకు ప్రభుత్వం వారం క్రితమే టెండర్లను ఆహ్వానించింది. రూ.1,816కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు సంబంధించి టెండర్ల గడువు 17తో ముగియనుంది. అదేరోజు సాయంత్రం బిడ్లను తెరిచి ఏజెన్సీలను ఖరారు చేయనున్నారు. ఆ పనులు కూడా మార్చి మూడోవారం నుంచే పరుగులు పెట్టనున్నాయి. 2018లో టీడీపీ హయాంలో అసెంబ్లీ భవనానికి రూ.555కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా ఇప్పుడది రూ.768 కోట్లకు పెరిగిది. హైకోర్టు శాశ్వత భవనానికి అప్పట్లో రూ.860 కోట్ల వ్యయాన్ని అంచనా వేయగా, ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు రూ.1,048 కోట్లకు చేరింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.